శుక్రవారం 9-3-2018

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 347

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'



మార్కెట్లకు ర్యాలీ... 'రిలీఫ్'

318 పాయింట్ల లాభంతో 33,352 వద్ద సెన్సెక్స్ ముగింపు - 13లో



భారత్ బోణీ

ముక్కోణపు టి20 టోర్నీలో బంగ్లాదేశ్‌పై ఆరు వికెట్లతో విజయం - స్పోర్ట్స్‌లో

ధర్నాతో శంఖారావం



ఢిల్లీ నుంచే ఫెడరల్ ఫ్రంట్ అడుగులకు శ్రీకారం

- రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణపై తొలి పోరు
- రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులందరితో ఢిల్లీ యాత్ర
- పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులకు ఆహ్వానం
- జాతీయ, ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టే యత్నం
- మంత్రులు, న్యాయ నిపుణులతో కేసీఆర్ మంతనాలు
- ఈ నెలాఖరులోనే నిర్వహించాలని యోచన



సాక్షి, హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వంపై శంఖారావం పూరించిన టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు.. దేశవ్యాప్తంగా రాజకీయాలను ప్రభావితం చేసేలా భారీ కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నారు. రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ అంశాలతో తొలిపోరు చేపట్టాలని.. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. జంతర్‌మంతర్ వద్ద చేసే ఈ ధర్నాకు రాష్ట్ర మంత్రులతో పాటు అన్ని పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించాలని యోచిస్తున్నారు. ఈ నెలాఖరులోనే చలో ఢిల్లీ యాత్ర నిర్వహించాలని భావిస్తున్నారు.

పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగా..

ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్.. దానికి అనుగుణంగా జాతీయస్థాయిలో పోరాటానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోపే ఢిల్లీ యాత్ర చేయాలన్నది ఆయన యోచన. పార్లమెంట్ సమావేశాలు ఏప్రిల్ 6వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇటు రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 28 వరకు జరిగే అవకాశాలున్నాయి. దీంతో అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఢిల్లీ

మిగతా 3వ పేజీలో ▶

రిజర్వేషన్ల పెంపు అధికారం రాష్ట్రాలకే..



లోక్‌సభలో టీఆర్ఎస్ డిమాండ్..

- వెల్‌లోకి దూసుకెళ్లి ఎంపీల నినాదాలు
- సభ వాయిదా పడ్డాక పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా - 2లో

ప్రజల దృష్టి మళ్లించేందుకే.. కేసీఆర్ రిజర్వేషన్ల జపం



- అసాధ్యమని తెలిసీ రాజకీయం చేస్తున్నారు: కె.లక్ష్మణ్
- మజ్లిస్‌తో కలిసి ముస్లిం రిజర్వేషన్ల పేరిట కుట్ర
- వచ్చే ఎన్నికల్లో గట్టెక్కడం కోసమే ఈ డ్రామా
- ఢిల్లీలో తలకిందులుగా తపస్సు చేసినా ప్రజాగ్రహాన్ని తప్పించుకోలేరని వ్యాఖ్య - 2లో

గురువారం రాజస్తాన్‌లోని ఝుంఝును‌లో 'బేటీ బచావో బేటీ పఢావో' లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



ఆ బాధ్యత అత్తలదే!

బాలికా సంరక్షణపై ప్రధాని మోదీ..

- భ్రూణహత్యలు సిగ్గుచేటు.. ఆందోళనకరం
- సమాజంలో మార్పునకు చిత్తశుద్ధితో ముందుకెళ్లాలి
- లింగ వివక్ష వద్దు.. రేపటి తరానికి పెను ప్రమాదమిది
- రాజస్తాన్‌లోని ఝుంఝును బహిరంగ సభలో పాల్గొన్న మోదీ
- 640 జిల్లాలకు బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం విస్తరణ
- జాతీయ పౌష్టికాహార మిషన్ ప్రారంభం

" దేశంలో నేటికీ బాలికల భ్రూణ హత్యలు జరుగుతుండటం మనం సిగ్గుపడాల్సిన, ఆందోళన చెందాల్సిన విషయం. ఈ దారుణమైన అలవాటును సమాజం నుంచి రూపుమాపేందుకు మనందరం చిత్తశుద్ధితో పని చేయాలి. మనమింకా 18వ శతాబ్దపు ఆలోచనలతోనే ఉన్నాం. అలాంటప్పుడు 21వ శతాబ్దపు పౌరులమని చెప్పుకునే హక్కు మనకెక్కడిది? – మోదీ

- వివరాలు 5లో

కొద్దిసేపు చర్చ.. ఆపై రసాభాస

- మహిళా సాధికారతపై రాజ్యసభలో ఏకతాటిపైకి పార్టీలు
- మహిళా రిజర్వేషన్ బిల్లును త్వరగా ఆమోదించాలని డిమాండ్
- రాజ్యసభలో గంటసేపు చర్చ.. అనంతరం ఆందోళన
- బ్యాంకింగ్ కుంభకోణాలపై ప్రధాని సమాధానానికి కాంగ్రెస్, తృణమూల్ పట్టు - 5లో



వనితకు వరం.. 'వీ హబ్'

రూ.15 కోట్లతో నిధి.. మహిళలకు ప్రత్యేక రాయితీలు ● రూ.25 లక్షల నుంచి కోటి వరకు పెట్టుబడి సాయం

మహిళల ఆవిష్కరణలు.. వీ హబ్ ఉత్పత్తులకు ప్రభుత్వం అండ

హైదరాబాద్‌లో వీ హబ్ ప్రారంభించిన మంత్రి కేటీఆర్

ఆరు ప్రముఖ సంస్థలతో వీ హబ్ ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త వరమిచ్చింది. కొత్తగా పరిశ్రమలు పెట్టే వారి కోసం ఇప్పటికే టీ హబ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. తాజాగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా వీ హబ్ (ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ హబ్) ఏర్పాటు చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు ప్రారంభించారు. ఈ వీ హబ్ ఇంక్యుబేటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించింది. వీ హబ్‌కు కొత్త ఆలోచనలతో వచ్చే మహిళలకు అక్కడే యూనిట్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వడంతోపాటు పెట్టుబడి కోసం రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు సాయాన్ని అందజేయనుంది. ఇందుకోసం తొలుత ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను వీ హబ్‌కు తెలియజేయాలి. ప్రాజెక్టు రిపోర్టు సమర్పించిన అనంతరం పారిశ్రామిక రంగంలో పేరొందిన నిపుణుల ఆధ్వర్యంలో వారికి మార్గనిర్దేశనం చేస్తారు. ఈ మేరకు వీ హబ్ ఆరు ప్రముఖ సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకుంది.

ప్రభుత్వమే తొలి కొనుగోలుదారు: కేటీఆర్

'ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల కోసం వీ హబ్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. తొలుత రూ.15 కోట్లతో ప్రారంభిస్తున్నాం. విడతల వారీగా అభివృద్ధి చేస్తూ భారీగా నిధులు కేటాయిస్తాం. ప్రతి మహిళను విజయవంతమైన పారిశ్రామికవేత్తగా తయారు చేయడమే వీ హబ్ లక్ష్యం' అని మంత్రి కేటీఆర్ తెలిపారు. వీ హబ్ ప్రారంభించిన అనంతరం ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మహిళలకు వినూత్న ఆలోచనలు వస్తాయి. కానీ వాటిని ఆచరణలో పెట్టాలంటే ప్రోత్సాహం అంతంత మాత్రంగానే దక్కుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం వీ హబ్ ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేసింది. ఆలోచన వస్తే వెంటనే వీ హబ్‌లో సంప్రదించండి. నిపుణులతో అవగాహన కల్పించి మార్గనిర్దేశనం చేస్తాం. ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం. వారి ఉత్పత్తులను ప్రభుత్వమే తొలుత కొనుగోలు చేస్తుంది. టీ హబ్ ద్వారా వేలాది మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాం. వీ హబ్ ఆలోచన ఇదివరకే చేసినప్పటికీ మంచిరోజున ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈరోజు ప్రారంభించాం' అని వివరించారు.



గురువారం హైదరాబాద్‌లో వీ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్‌తో మహిళల సెల్ఫీ. చిత్రంలో జయేశ్ రంజన్, టెస్సీ థామస్ తదితరులు

చరిత్ర సృష్టిస్తున్న వారెందరో..

'క్రీడా రంగంలో మన హైదరాబాదీ అమ్మాయిలు సానియా మీర్జా, సైనా నెహ్వాల్, మిథాలీరాజ్, అరుణారెడ్డి చరిత్ర సృష్టించారు. వ్యాపారంలో సరికొత్త కాన్సెప్ట్ 'పెళ్లి జడలు' పేరుతో వ్యాపారం ప్రారంభించిన కల్పన మంచి గుర్తింపు తెచ్చుకుంది. 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇలాంటి వారందరికీ వీ హబ్ అండగా ఉంటుంది' అని కేటీఆర్ అన్నారు. చాలా కుటుంబాల్లో తమ పిల్లల్ని డాక్టర్, ఇంజనీరు చేయాలని అనుకుంటున్నారని, కానీ అత్యుత్తమ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనుకోవట్లేదన్నారు. కేటీఆర్ ప్రసంగానికి ముందు మహిళా పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో ప్రాజెక్టు సంచాలకులు టెస్సీ థామస్, వెంచర్ క్యాపిటలిస్టు కోల వాణి, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

'ఏడాది' నిబంధన ఎత్తివేత!



మెడికల్ పీజీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట..

- ఇక ఏడాది పాటు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయనక్కర్లేదు
- ఈ ఏడాది నుంచే అమలు చేసేందుకు కసరత్తు
- అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతాం: సీఎం

సాక్షి, హైదరాబాద్

మెడికల్ పీజీ విద్యార్థులకు ఊరట లభించనుంది. వైద్య విద్యలో పీజీ పూర్తి చేసిన విద్యార్థులు కచ్చితంగా ఏడాది పాటు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయాలనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లు ప్రవేశ పెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. ఈసారి పీజీ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయకున్నా, వారి విద్యార్హతలను రిజిస్టర్ చేయాలని అధికారులను ఆదేశించారు.

నిబంధనను తొలగించాలని కొన్నేళ్లుగా డిమాండ్..

ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం మెడికల్ పీజీ పూర్తి చేసిన వారు విధిగా ఒక ఏడాది పాటు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేయాలనే నిబంధన అమలులో ఉంది. తర్వాతే వారి విద్యార్హతలను రిజిస్టర్ చేసేలా మార్గదర్శకాలున్నాయి. ఈ నిబంధన తొలగించాలని వైద్య విద్యార్థులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. దీన్ని సీఎం సానుభూతితో పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రుల్లో చాలినంత సిబ్బందిని రెగ్యులర్ ప్రాతిపదికనే నియమిస్తున్నందున.. మెడికల్ విద్యార్థులతో పని చేయించాల్సిన అవసరం లేదని నిర్ణయానికొచ్చారు. బిల్లు రూపకల్పనకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

కేంద్ర మంత్రి పదవులకు అశోక్, సుజనా రాజీనామా

- పార్టీ నిర్ణయం మేరకే బయటకు వచ్చాం
- 16వ లోక్‌సభ పూర్తయ్యే వరకు ఎన్డీయేలోనే కొనసాగుతాం
- ఈలోగా సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నాం

- వివరాలు 3లో

బాబు యూ టర్న్ ప్రజా విజయం

- కేంద్రంలో టీడీపీ మంత్రులు వైదొలగాలన్న నిర్ణయంపై ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్
- ఇప్పటికైనా చంద్రబాబుకు మనం చెప్పింది కాస్త అర్థమైంది..
- ఈ పని ఎప్పుడో చేసి ఉంటే హోదా వచ్చి ఉండేది - 2లో
- నిజంగా చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసానికి మద్దతు ఇవ్వండి

చేవెళ్ల టు హుజూరాబాద్

కాంగ్రెస్ తొలిదశ బస్సు యాత్ర ముగింపు

- 8 రోజులు.. 16 నియోజకవర్గ కేంద్రాల్లో సభలు
- యాత్ర జరిగిన తీరుపై పార్టీ నేతల్లో సంతృప్తి
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లామనే భావన
- టీఆర్ఎస్ వ్యతిరేక పవనాలు స్పష్టంగా కనిపించాయన్న ధీమా



సాక్షి, హైదరాబాద్

చేవెళ్ల సెంటిమెంటు.. నేతల ఐక్యతారాగం.. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీత.. స్థానిక సమస్యల ప్రస్తావన.. ఎన్నికల హామీలు.. బహిరంగసభలు.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ప్రజా చైతన్య బస్సు యాత్ర' తొలిదశ గురువారంతో ముగిసింది. ఎనిమిది రోజుల పాటు రెండు దఫాలుగా సాగిన ఈ యాత్రలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బహిరంగ సభలు నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నేతలంతా ఐక్యతారాగాన్ని చాటడం విశేషం. తొలిదశ యాత్ర తీరుపై పార్టీలో నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీఆర్ఎస్‌పై వ్యతిరేక పవనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

టీఆర్ఎస్‌పై విమర్శల దాడి

తొలిదశ బస్సు యాత్రలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో కాంగ్రెస్ నేతలు పర్యటించారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు గుప్పించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సందర్భంలో, అంతకు ముందు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ.. దళిత సీఎం, ఇంటికో ఉద్యోగం, రైతు రుణమాఫీ, మూడెకరాల భూ పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ముస్లిం, గిరిజన రిజర్వేషన్లు తదితర అంశాల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్రాలకు ఇవ్వాలి

లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: 'ఒక దేశం, ఒకే నీతి' ఉండాలని, రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్రాలకు అప్పగించాలని టీఆర్ఎస్ ఎంపీలు చేపట్టిన ఆందోళనతో గురువారం పార్లమెంటు దద్దరిల్లింది. ఆ పార్టీ నేతలు ఎ.పి.జితేందర్‌రెడ్డి, బి.వినోద్‌కుమార్, సీతారాం నాయక్, బూర నర్సయ్యగౌడ్, నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పసునూరి దయాకర్, బాల్క సుమన్ గురువారం లోక్‌సభ వెల్‌లోకి దూసుకెళ్లి రిజర్వేషన్ల అంశంపై నినదించారు. వెంటనే సభ వాయిదా పడడంతో పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీలు మీడియాతో మాట్లాడారు. 'విద్య, ఉద్యోగాల్లో జనాభా ఆధారంగా ఆయా సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరముంది. అత్యవసరం అనుకుంటే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. దానికి అనుగుణంగా రాష్ట్రంలోని స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్లు పెంచుకొనే అధికారం రాష్ట్రాలకివ్వాలి. సమాఖ్య భారతంలో అన్ని రాష్ట్రాలకు ఒకేచట్టం ఉండాలి'అని పేర్కొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే..

కేసీఆర్ రిజర్వేషన్ల జపం

అసాధ్యమని తెలిసీ రాజకీయం చేస్తున్నారు: కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్

టీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకు సీఎం కేసీఆర్ రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. కేసీఆర్‌కు రాజ్యాంగంపై గౌరవం లేదని, పార్లమెంట్ అంటే లెక్కలేదని మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపి పబ్బం గడుపుకోవడమే కేసీఆర్ లక్ష్యం, లక్షణమని వ్యాఖ్యానించారు. ''నాలుగేళ్ల అస్తవ్యస్త పాలనతో కేసీఆర్ తెలంగాణ ప్రజలను వంచించారు. ఓటు ఆయుధంతో తన దిక్కు మాలిన పాలనకు చరమగీతం పాడేందుకు జనం సిద్ధమయ్యారని తన సర్వేలతో గుర్తించారు. అందుకే మతపరమైన రిజర్వేషన్ల అంశాన్ని ఎత్తుకున్నారు. ప్రజల చీత్కారాలు ఎదురైనప్పుడల్లా వారి దృష్టి మరల్చి నీచ రాజకీయాలు చేయడం కేసీఆర్‌కు ముందు నుంచీ అలవాటే..''అని



లక్ష్మణ్ విమర్శించారు.

జనాన్ని వంచిస్తున్నారు..

కేసీఆర్ ప్రతిపాదిస్తున్న రిజర్వేషన్లు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని, ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను కోర్టులు వ్యతిరేకించాయని లక్ష్మణ్ చెప్పారు. అదీ సుప్రీంకోర్టులో ఉందని, ఇలాంటి తరుణంలో ముస్లిం రిజర్వేషన్లను మరింత పెంచడం అసాధ్యమని స్పష్టం చేశారు. కానీ కేసీఆర్‌కు కావాల్సింది రాజకీయంగా పబ్బం గడుపుకోవడమని, అందుకే నిలవదని తెలిసీ తన ప్రతిపాదనను కేంద్రం పైకి నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మజ్లిస్‌తో కలసి పన్నిన కుట్ర ఇదని, దీనివల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీలు గమనించడం లేదని కేసీఆర్ భ్రమిస్తున్నట్టున్నారని.. కానీ జనాన్ని ఎల్లకాలం మోసం చేయలేడన్న సంగతిని గుర్తించడం లేదని చెప్పారు.

కేసీఆర్ ప్రతిపాదనలు సరికాదు..

రిజర్వేషన్లకు 50 శాతం సీలింగ్ ఉన్న విషయం కేసీఆర్‌కు తెలుసని, అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ అమలు చేయాలంటే దానికి శాస్త్రీయ గణాంకాలు కావాలని లక్ష్మణ్ స్పష్టం చేశారు. గుడ్డిగా మతపరమైన రిజర్వేషన్ల ప్రతిపాదన సరికాదని.. అంబేడ్కర్ కంటే తానే గొప్పవాడినన్న భావన కేసీఆర్‌లో ఉందని వ్యాఖ్యానించారు. గతంలో సకల జనుల సర్వే చేసినా వివరాలు బహిర్గతం చేయలేదని, వాస్తవంగా శాస్త్రీయ సర్వే చేస్తే కేసీఆర్ ప్రతిపాదన సరికాదని తేలుతుందని చెప్పారు. అందుకే సమగ్ర సర్వే లేకుండా, కావాల్సిన గణాంకాలు లేకుండా గుడ్డిగా రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదన తెచ్చారని విమర్శించారు. ''వచ్చే ఎన్నికల్లో గట్టెక్కడం కోసం ఈ డ్రామా. నిజానికి రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్లు పెంచుకునే అవకాశముంది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ముస్లింలకు అమలు చేస్తున్న 4శాతం రిజర్వేషన్లు తొలగించి.. దానిని ఎస్టీలకు జోడించాలి. కావాలంటే ఆర్థికంగా వెనుకబడిన వారికి అదనపు రిజర్వేషన్లు ఇవ్వచ్చు. అందులో ముస్లింలు కూడా వస్తారు. కానీ కేసీఆర్‌కు కావాల్సింది ముస్లింల గంపగుత్త ఓట్లు. అందుకే మజ్లిస్‌తో కలసి కుట్రపన్నారు. పైగా కేంద్రం సహకరించడం లేదనే నింద మోపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఆటలు సాగవు..''అని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలకిందులుగా తపస్సు చేసినా కేసీఆర్ అస్తవ్యస్త పాలనపై ప్రజల ఆగ్రహాన్ని తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ తొలిదశ బస్సు యాత్ర ముగింపు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మిషన్‌కాకతీయ, భగీరథ, ఇతర ప్రాజెక్టుల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలూ గుప్పించారు.

ఎన్నికల హామీలు

వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, డ్వాక్రా మహిళలకు రూ.లక్ష రివాల్వింగ్ ఫండ్, అభయహస్తం పింఛన్ పెంపు, పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి వంటివి అమలు చేస్తామని బస్సుయాత్రలో హామీలు గుప్పించారు. వీటితోపాటు ఎక్కడికక్కడ స్థానిక అంశాల ప్రస్తావన, సమస్యల పరిష్కారానికి హామీలిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

పకడ్బందీగా సభలు

సభల నిర్వహణలోనూ కాంగ్రెస్ యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించింది. తొలిరోజున చేరికలతో ప్రారంభమైన యాత్ర.. చేవెళ్ల సెంటిమెంట్‌తో ముందుకు సాగింది. దాదాపు అన్ని సభలకు భారీగానే సమీకరణ చేసింది. పార్టీకి మంచి బలమున్న మెదక్, నిజామా బాద్‌లతో పాటు టీఆర్ఎస్ ప్రాబల్యమున్న ఆదిలా బాద్, కరీంనగర్ జిల్లాల్లో జరిగిన సభలకు కూడా జనం భారీగానే హాజరుకావడంతో కాంగ్రెస్ నేతల్లో కొత్త ఉత్సాహం కనిపి స్తోంది. సభ నిర్వహణ ఆలస్యమైనా కేడర్ ఓపికతో ఉన్నారని, సభ పూర్తయ్యేవరకు ఉండి నేతలు మాట్లాడిందంతా విని వెళ్లారని... ఇది ప్రభుత్వంపై ఉండే వ్యతిరే కతకు నిదర్శనమని ఓ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, బస్సుయాత్ర సభలు ఎన్నికల సభలను తలపించాయని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షం చేస్తున్న బస్సుయాత్రపై అధికార టీఆర్ఎస్ నేతలు విమర్శలు చేసినా.. కాంగ్రెస్ నేతలు దీటుగానే సమాధానాలు ఇచ్చారు. మొత్తంగా తొలిదశ యాత్రతో కాంగ్రెస్‌లో నూతనోత్సాహం కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీఎంవో కార్యదర్శిగా ఎస్కే సుల్తానియా

అదనపు కార్యదర్శిగా మాణిక్‌రాజ్

రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ హోదాల్లో పలు విభాగాల్లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా ఉన్న సందీప్ కుమార్ సుల్తానియాను సీఎంవో కార్యదర్శిగా నియమించారు. పశుసంవర్ధక శాఖ బాధ్యతలను కూడా ఆయనకే అదనంగా అప్పగించారు. పలువురు సీనియర్ ఐఏఎస్‌లు కలెక్టర్ బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాల్లో పూర్తి స్థాయి కలెక్టర్లను నియమిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

బదిలీల వివరాలివీ..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్కే సుల్తానియా	కార్యదర్శి, పశుసంవర్ధక శాఖ	కార్యదర్శి, సీఎంవో
మాణిక్‌రాజ్	కలెక్టర్, సంగారెడ్డి	అదనపు కార్యదర్శి, సీఎంవో
కె.ధర్మారెడ్డి	జాయింట్ కలెక్టర్, మేడ్చల్	కలెక్టర్, మెదక్
టి.వినయ్‌కృష్ణారెడ్డి	జాయింట్ కలెక్టర్, ఖమ్మం	కలెక్టర్, జనగాం
సీహెచ్ శివలింగయ్య	జాయింట్ కలెక్టర్, నిర్మల్	కలెక్టర్, మహబూబాబాద్
వి.వెంకటేశ్వర్లు	జాయింట్ కలెక్టర్, సంగారెడ్డి	కలెక్టర్, సంగారెడ్డి
డి.అమోయ్‌కుమార్	జాయింట్ కలెక్టర్, భూపాలపల్లి	కలెక్టర్, భూపాలపల్లి
ఎం.హరిత	జాయింట్ కలెక్టర్, వరంగల్(రూ)	కలెక్టర్, వరంగల్ రూరల్

బాబు యూ టర్న్ ప్రజా విజయం

ఇప్పటికైనా చంద్రబాబుకు మనం చెప్పింది కాస్త అర్థమైంది.. • కేంద్రంలో టీడీపీ మంత్రులు వైదొలగాలన్న నిర్ణయంపై ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- ఈ పని ఎప్పుడో చేసి ఉంటే హోదా వచ్చి ఉండేది
- జైట్లీ చెప్పిన దాంట్లో అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమీ లేదు
- అప్పట్లో పొగిడిన బాబు.. ఇప్పుడు తప్పుపట్టడం సరికాదు
- నిజంగా చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసానికి మద్దతు ఇవ్వండి
- లేదంటే మీరు అవిశ్వాసం పెట్టినా మేము మద్దతు ఇస్తాం
- 25 మంది ఎంపీలు ఒక్క మాటపై నిలబడితే కేంద్రం దిగొస్తుంది
- ప్రత్యేక హోదా ఎవరు ఇస్తే వాళ్లకే తమ మద్దతు అని స్పష్టీకరణ



గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ప్రత్యేక హోదా కావాల్సిందేనన్న ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఎట్టకేలకు చంద్రబాబు తలొగ్గారని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి గతంలో చేసిన ప్రకటనకు, తాజాగా బుధవారం చేసిన ప్రకటనకూ ఎంత మాత్రం తేడా లేకపోయినా.. అప్పుడు స్వాగతం పలికి సన్మానం చేసిన ముఖ్యమంత్రి.. ఇప్పుడిలా అతిగా స్పందించారంటే అది ప్రజల విక్టరీ (ప్రజా విజయం) అన్నారు. ప్రకాశం జిల్లాలో ప్రజా సంకల్ప యాత్రలో ఉన్న జగన్ సంతరావూరు వద్ద తాను విడిది చేసిన శిబిరంలో గురువారం ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ప్రత్యేక హోదా ఇవ్వరాదని 14వ ఆర్థిక సంఘం చెప్పలేదనే విషయం ఇప్పుడే తెలిసిందని చంద్రబాబు చెప్పడం ఎంత మాత్రం సరికాదని మండిపడ్డారు. ఈ విషయాన్ని తాను అసెంబ్లీలో, యువభేరీ సభల్లో డాక్యుమెంట్లతో సహా ప్రదర్శించి చెప్పినా పట్టించుకోలేదన్నారు. 'హోదాతో ఏమొస్తుంది?' అని ఎదురు ప్రశ్నలు వేసిన ఘనత కూడా చంద్రబాబుదేనని విమర్శించారు. రాజీనామాలు చేయాలనే నిర్ణయాన్ని ప్రకటించడానికి ముందు ఢిల్లీ పెద్దలతో మాట్లాడినట్లు చంద్రబాబే చెప్పుకోవడంపై జగన్ అభ్యంతరం తెలిపారు. తమ మంత్రులు కేంద్రం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించినా, ఇప్పటికీ ఎన్డీయే కూటమికి చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్నారని, అందులో ఇప్పటికీ భాగస్వామియేనని జగన్ ఎత్తి చూపారు. ఈ సమావేశంలో జగన్ పలు ప్రశ్నలకు కింది విధంగా సమాధానమిచ్చారు.

జైట్లీ కొత్తగా చెప్పిందేమీ లేదు..

''అరుణ్ జైట్లీ నిన్న (బుధవారం) ఇచ్చిన స్టేట్‌మెంట్ ఏమాత్రం కొత్తది కాదు. 2016 సెప్టెంబర్ 8న కూడా ఇదే మాట చెప్పారు. ఆ రోజున జైట్లీ మాట్లాడిన సందర్భంలో అర్ధరాత్రి వరకూ చంద్రబాబు మేలుకొని మరీ స్వాగతించారు. అప్పట్లో ఎం.వెంకయ్యనాయుడు, జైట్లీలకు చంద్రబాబు శాలువాలు కప్పారు. జైట్లీ ప్రకటనపై అసెంబ్లీలో కూడా విపరీతంగా పొగుడుతూ మాట్లాడారు. ఇవాళ జైట్లీ మళ్లీ అవే మాటలు మాట్లాడితే చంద్రబాబు మాట మార్చారు. చంద్రబాబు చెబుతున్నది వింటున్నప్పుడు.. చూసినప్పుడు ఆశ్చర్యం కలుగుతోంది. చంద్రబాబు ఈ రోజు ఇలా స్పందించడానికి కారణం ఒక్కటే. ప్రత్యేక హోదా కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీలు రాజీనామాలు చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ నెల 21న అవిశ్వాస తీర్మానం పెడతామని స్పష్టంగా చెప్పారు. ప్రజల ఆకాంక్షలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రతిబింబిస్తోంది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఇలా నిర్ణయం తీసుకున్నారు. అందుకే ఇది ప్రజల విక్టరీ. ప్రజల ఆకాంక్షకు సీఎం తలొగ్గాల్సి వచ్చింది.

14వ ఫైనాన్స్ కమిషన్ హోదా ఇవ్వొద్దని చెప్పిందా?

అరుణ్ జైట్లీ 2016 సెప్టెంబర్ 8వ తేదీ రాత్రి హోదాకు 14వ ఫైనాన్స్ కమిషన్ అడ్డుచెబుతోందనప్పుడు ఆ మరుసటి రోజే నేను విలేకరుల సమావేశం పెట్టాను. అయ్యా.. 14వ ఆర్థిక సంఘం అని మీరు సాకు చెబుతున్నారు.. ఆ కమిషన్ సభ్యుడు అభిజిత్ సేన్ రాత పూర్వకంగా ఇచ్చిన నోట్‌ను చూడండని చెప్పాను. 14వ ఆర్థిక సంఘం ఎప్పుడూ కూడా ప్రత్యేక హోదా రద్దు చేయమని చెప్పలేదు. అందులో స్పష్టంగా రాసి ఉన్న ఇదే విషయాన్ని చదివి వినిపించాను. చంద్రబాబుకు కూడా ఇది అర్థం కావాలని అసెంబ్లీలో కూడా చెప్పాను. ప్రతి యువభేరి సభలోనూ చూపించాను. వాస్తవానికి ఈ కమిషన్‌పై బీజేపీకి పట్టు లేదు. దానిని వైవీ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ 2013లో నియమించింది. అసలు 14వ ఆర్థిక సంఘానికి, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడానికి సంబంధం ఏమిటి? 14 ఆర్థిక సంఘం సిఫార్సులను చేయకముందే.. వాటి ఆమోదం పొందక ముందే, 2014 మార్చి 2వ తేదీన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని చెప్పి తన మంత్రివర్గంలో తీర్మానం చేసింది. ఆ మేరకు ప్లానింగ్ కమిషన్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటికి ఇంకా 14వ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులే లేవు. 13వ ఫైనాన్స్ కమిషన్ ఉండగానే ఇది జరిగింది. ఐదేళ్ల పాటు 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ప్లానింగ్ కమిషన్‌కు ఉత్తర్వుల కోసం పంపారు. ప్లానింగ్ కమిషన్ కూడా డిసెంబర్ 31, 2014 దాకా ఉండింది. జనవరి 1, 2015న నీతి ఆయోగ్ వచ్చింది. అంటే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక కూడా 7 నెలల వరకు కమిషన్ ఉండింది. మరి చంద్రబాబు ఈ ఏడు నెలల కాలం ఎందుకు పట్టించుకోలేదు? ప్లానింగ్ కమిషన్‌కు అప్పటికే ఆదేశాలు వెళ్లిపోయి, ఆ ఫైలు అక్కడే ఏడు నెలలుగా పడి ఉంది. కేంద్ర మంత్రివర్గం చేసిన తీర్మానం అక్కడే పడి ఉంది. కానీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు మాత్రం అసలు పట్టించుకోలేదు. వాస్తవం ఇలా ఉంటే 14వ ఆర్థిక కమిషన్ అలా చెప్పింది.. ఇలా చెప్పింది అని ఎలా చెప్పగలుగుతారు? తాము అలా చెప్పలేదని 14వ ఆర్థిక సంఘం సభ్యుడు అభిజిత్‌సేన్ నోట్ ద్వారా కూడా తెలిపారు.

మా వైఖరి స్పష్టంగా ఉంది..

ప్రత్యేక హోదా విషయంలో మా వైఖరి చాలా స్పష్టంగా, పారదర్శకంగా ఉంది. ఇప్పుడు బీజేపీపై అవిశ్వాసం ఎవరు పెడుతున్నారు? ఆ తర్వాత రాజీనామాలు ఎవరు చేస్తున్నారు? ప్రత్యేక హోదా ఎవరు ఇస్తే వాళ్లకు మద్దతు ఇస్తాం. వి ఆర్ వెరీ వెరీ క్లియర్ ఆన్‌దట్ స్టాండ్. బీజేపీ వాళ్లు ప్రత్యేక హోదా ఇవ్వని పరిస్థితుల్లో వారికి మద్దతు ఇవ్వడం అన్నది ఎప్పటికీ రాదు. ఇక కాంగ్రెస్ గెలిచి ప్రధాని అయ్యే పరిస్థితి లేదని మీరే చెబుతున్నారు. అయినా చూద్దాం పరిస్థితులు ఎలా ఉంటాయో.

చంద్రబాబుకు అన్నీ తెలుసు

ఇవన్నీ నేను ఇప్పుడు చెబుతున్నవి కావు. వాస్తవానికి ఇవన్నీ చంద్రబాబుకు తెలియనివీ కావు. జైట్లీ అర్ధరాత్రి ప్రెస్ మీట్ పెట్టిన మరుసటి రోజు నేను పెట్టిన ప్రెస్‌మీట్ చూడండి. ఆ రోజే ఇవన్నీ చెప్పాను.. చూపించాను. అసెంబ్లీలోనూ, యువభేరీల్లోనూ నా ఉపన్యాసాలు చూడండి. అన్ని చోట్లా ఇవే చెప్పాను. ఆ రోజు చంద్రబాబు ఇవి పట్టించుకోలేదు. ఈరోజు హఠాత్తుగా యూ టర్న్ తీసుకున్నాడు. అసలు ఈ మనిషి నిజంగా ముఖ్యమంత్రేనా! బాధ్యత గల స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడ్డం న్యాయమేనా? 14వ ఫైనాన్స్ కమిషన్ హోదా ఇవ్వొద్దని చెప్పలేదని ఇప్పుడు తెలిసిందంట. ఈ రోజు చంద్రబాబు చేసిన పని జైట్లీ తొలిసారి స్టేట్‌మెంట్ ఇచ్చినప్పుడే రెండేళ్ల కిందటో, మూడేళ్ల కిందటో చేసి ఉంటే ఈవాళ్టికి ప్రత్యేక హోదా వచ్చి ఉండేది. ఇవాళ ఎన్నికలకు ఒక ఏడాది ముందు, చివరి బడ్జెట్ కూడా ప్రవేశ పెట్టాక ఇక ఎన్నికలకు పోయే సందర్భంలో తన మంత్రులను ఉపసంహరించుకుంటానంటున్నాడు. (గురువారం సాయంత్రం మంత్రి పదవులకు రాజీనామా చేశారు) ఈ సందర్భంలో మరొక చోట, ఇంకొక చోట రకరకాల డిమాండ్లు వస్తాయని చెప్పి వాళ్లు కూడా సందేహిస్తారు.

గోబెల్స్ ప్రచారంతో బాబును వెనకేసుకొస్తున్న ఓ వర్గం మీడియా

చంద్రబాబు ఎలాంటి వ్యక్తి అంటే గోబెల్స్ సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మిన వ్యక్తి. హిట్లర్ జర్మనీని పాలించే రోజుల్లో వాళ్ల సమాచార ప్రసార శాఖ (ఐబీ) మంత్రిగా గోబెల్స్ అనే వ్యక్తి ఉండే వాడు. ఆయన, హిట్లర్ కలిసి ఒక అబద్ధాన్ని వారి అనుకూల మీడియాలో విపరీతంగా పబ్లిసిటీ చేయించి దానిని నిజమని నమ్మించే వారు. ఆ రోజు గోబెల్స్ చేసిందే ఇవాళ చంద్రబాబు చేస్తున్నారు. తన అనుకూల మీడియాలో ఓ అబద్ధాన్ని మళ్లీ మళ్లీ చెప్పించి.. చెప్పించి అదే నిజమని జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. అవతలి వ్యక్తి ఎంత నిజాయితీగా ఉన్నా వారిపై బండ వేయాల్సిందే, బురద చల్లాల్సిందే అనే విధంగా ఆయన అనుకూల మీడియా పని చేస్తోంది. చంద్రబాబు ఎన్ని అన్యాయాలు చేసినా, అబద్ధాలు చెప్పినా, అధర్మాలు చేసినా, అవినీతికి పాల్పడినా.. ఆయన మాత్రం మంచోడని చెప్పి మోసుకుని వస్తున్నారు. నాలుగేళ్ల నుంచి రాష్ట్రంలో అవినీతి జరగని అంశం ఏదైనా ఉందా? కాంట్రాక్టర్ల దగ్గర నుంచి ఇసుక, మట్టి, మద్యం, బొగ్గు కొనుగోలు, కరెంటు కొనుగోలు, రాజధాని భూములు, గుడి భూముల వరకూ దేన్నీ వదలి పెట్టకుండా రాష్ట్రంలో అవినీతి జరుగుతోంది. నాలుగేళ్లుగా చంద్రబాబు అడ్డగోలుగా అవినీతి చేస్తున్నా, ఒక్క పత్రిక గానీ, ఒక్క టీవీ చానెల్ గానీ దాన్ని చూపించడం లేదు. చంద్రబాబు ఏ స్థాయిలో మేనేజ్ చేస్తున్నారనేందుకు ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. ఒక ముఖ్యమంత్రి అడ్డగోలుగా నల్లధనంతో, అవినీతి సొమ్ముతో రూ.20 కోట్లు, రూ.30 కోట్లు ఎమ్మెల్యేలకు ఇవ్వజూపుతూ ఆడియో, వీడియో టేపులలో అడ్డంగా దొరికి పోయినా డిస్క్వాలిఫై కారు. రాజీనామా చేయరు. ఒక ప్రభుత్వోద్యోగి అవినీతి చేస్తూ దొరికిపోతే వెంటనే అతన్ని జైలుకు పంపి ఉద్యోగం నుంచి తొలగిస్తారు. దానిని గొప్పగా (గ్లోరిఫై చేసి) చూపిస్తారు. ఈయన విషయంలో మాత్రం మరోలా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా అనేది ఫోర్త్ ఎస్టేట్ లాంటిది. అలాంటి ఫోర్త్ ఎస్టేట్ చిత్తశుద్ధితో నిజాయితీగా నిలబడితే చాలా బాగుండేది. కానీ ఫోర్త్ ఎస్టేట్‌ను కూడా భ్రష్టు పట్టించే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది గోబెల్స్ తరువాత చంద్రబాబు మాత్రమే. మాపై అబద్ధపు వార్తలు రాస్తున్నందుకు, ప్రసారం చేస్తున్నందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఆంధ్రజ్యోతి దినపత్రికను, ఏబీఎన్ టీవీ చానెల్‌ను మా కార్యక్రమాల కవరేజీ నుంచి బహిష్కరించింది. ఆ పేపర్‌లో రాసే రాతలు, ఆ టీవీలో చూపేవి నమ్మొద్దని చెప్పాం. ఆ పేపర్‌పైన, ఆ టీవీపైన కోర్టులో కేసు వేశాం. మా మీద ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా, అన్యాయంగా దురుద్దేశ పూరితంగా రాసిన రాతలపై కోర్టులో కేసు నడుస్తోంది. అయినా మీ ఇద్దరూ (ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ టీవీ చానెల్ రిపోర్టర్లు) రావడం సరికాదు. మీరు చేసేది కరెక్ట్ కాదు. ఈ సారికి కానిచ్చేద్దాం'' అని జగన్ అన్నారు.

బాబూ.. అవిశ్వాసానికి కలసి రండి

కేంద్రంలో మంత్రులు రాజీనామా చేయకమునుపే ఢిల్లీ వాళ్లతో మాట్లాడానని చంద్రబాబు చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. రాజీనామాలు చేయాలని నిర్ణయించు కున్నపుడు మళ్లీ ఢిల్లీ వాళ్లతో మాట్లాడ్డం ఎందుకు? ఢిల్లీ పెద్దలతో ఫోన్‌లో మాట్లా డానని ఆయనంతట ఆయనే చెప్పుకుంటు న్నాడంటే దానర్థం ఏమిటి? ఎన్డీయే కూటమిలో ఇంకా కొనసాగుతున్నాడంటే దానర్థం ఏమిటి? దేనికైనా చిత్తశుద్ధి ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిత్వం, విశ్వసనీయత, నిజాయితీ, విలువలు, చిత్తశుద్ధి ఉండటం చాలా ముఖ్యం. చంద్రబాబుకు ఇవేవీ లేవు కాబట్టి పూటకో మాట మాట్లాడుతూ, రోజుకో పాట పాడుతున్నాడు. తాను ఏం చేసినా పడుంటారులే అని ఆయన భావిస్తున్నారు. ఇలాంటి చంద్రబాబు ఆలోచనలకు ప్రజలు చరమగీతం పాడే రోజులు త్వరలోనే వస్తాయి. చంద్రబాబుకు ఇప్పటికైనా ఒకటే చెబుతున్నా. మేము 21న అవిశ్వాసం పెడతాం. మీరు మద్దతు ఇవ్వండి. ఆ తర్వాత 25 మంది ఎంపీలం పార్లమెంటు చివరి రోజున రాజీనామాలు చేద్దాం. అప్పుడు కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుంది. దేశం మొత్తం ఈ విషయం చర్చనీయాంశం అవుతుంది. ఆంధ్రరాష్ట్రం ఒక్కతాటిపై నిలబడి ఇలా చేస్తే దేశం మొత్తం మనవైపు చూస్తుంది. ఆ స్థాయిలో ఎప్పుడైతే ఒత్తిడి పెరుగుతుందో అప్పుడు కేంద్రం దిగి రాక తప్పదు.

కేంద్ర మంత్రి పదవులకు
సుజనా, అశోక్ రాజీనామా

పార్టీ నిర్ణయం మేరకే బయటకొచ్చాం
- 16వ లోక్‌సభ పూర్తయ్యే వరకు ఎన్డీయేలోనే కొనసాగుతాం
- రాజీనామాల అనంతరం అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి


సుజనా చౌదరి


అశోక్ గజపతి రాజు

సాక్షి, న్యూఢిల్లీ : టీడీపీకి చెందిన సుజనాచౌదరి, అశోక్ గజపతిరాజు గురువారం సాయంత్రం కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా ఆయన నివాసంలో కలిసి అందజేశారు. వాటిని రాష్ట్రపతి ఆమోదానికి పంపాలని కోరారు. రాజీనామాల అనంతరం మోదీ నివాసం నుంచి బయటకు వచ్చిన సుజనా, అశోక్ గజపతిరాజు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజనకు సంబంధించి ఏపీకి ఇచ్చిన హామీలను కేంద్రం అమలుచేయడంలో విఫలమైనందున, రాష్ట్రంలో అన్ని వర్గాల నుంచి ఒత్తిడి వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పార్టీ నిర్ణయం మేరకు రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. మంత్రి పదవులకు రాజీనామా చేసినంత మాత్రాన ఎన్డీయే నుంచి బయటకు వచ్చినట్టు కాదని, 16వ లోక్‌సభ కాలం పూర్తయ్యే వరకూ ఎన్డీయే భాగస్వామిగానే కొనసాగుతామని సుజనా చెప్పారు. ఈలోగా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన చేసి ఒక జాతీయ పార్టీ రాష్ట్రానికి ద్రోహం చేస్తే.. హామీలు అమలుచేయకుండా మరో జాతీయ పార్టీ మోసం చేసిందని ఆయన ఆరోపించారు. 2016 సెప్టెంబర్ 8న ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీని అమలుచేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమవడంతో రాజీనామాలు చేయక తప్పలేదన్నారు. ఈ పరిస్థితి ఇంత దూరం రావడం దురదృష్టకరమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారన్నారు. ఏపీకి కేంద్రం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని మోదీ చెప్పారన్నారు.

సమాధానం దాటవేత

కేంద్ర చివరి బడ్జెట్‌లో ఏపీ న్యాయం చేయలేదని చెబుతున్న టీడీపీ.. ఫైనాన్స్ బిల్లుకు మద్దతు ఇస్తుందా అని మీడియా అడిగిన ప్రశ్నకు సుజనాచౌదరి సమాధానం దాటవేశారు. సమయం వచ్చినప్పుడు పార్టీ నిర్ణయం ప్రకారం నడుచుకుంటామన్నారు. కాగా, దేశానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి అశోక్ గజపతిరాజు కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామాలు చేశాక తమకు స్వేచ్ఛ లభించిందని.. హామీలు సాధించుకుంటామన్న నమ్మకం ఉందని సుజనా వివరించారు.

ధర్నాతో శంఖారావం

▸ మొదటి పేజీ తరువాయి

ధర్నా తేదీని ఖరారు చేయనున్నారు. భావ సారూప్యత ఉన్న వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలను ధర్నాకు ఆహ్వానించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

రిజర్వేషన్లే ప్రధాన డిమాండ్‌గా..

రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్లను 12 శాతానికి, ఎస్టీల రిజర్వేషన్లు 10 శాతానికి పెంచే బిల్లును అసెంబ్లీలో ఆమోదించి గతేడాదే కేంద్ర ప్రభుత్వానికి పంపింది. కానీ రాష్ట్రంలో ప్రతిపాదిత రిజర్వేషన్లతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించటంతో కేంద్రం కొర్రీలు పెట్టింది. ఎస్టీ రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదనకు కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ సంతృప్తి వ్యక్తం చేసినా.. ముస్లిం (బీసీ–ఈ) రిజర్వేషన్ కోటా పెంచే విషయంలో కేంద్ర హోంశాఖ, డీవోపీటీ అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో కేంద్ర హోంశాఖ పేర్కొన్న అంశాలపై వివరణలు పంపాలని, అవసరమైనంత సమాచారాన్ని జత చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. వాస్తవానికి తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈ విషయాన్ని కేసీఆర్ గుర్తుచేస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 46ను సవరించి తెలంగాణకు వెసులుబాటు కల్పించాలని పలుమార్లు కేంద్రానికి విన్నవించినా సానుకూలంగా స్పందించలేదు.

రాష్ట్రాలకే అప్పగించాలి

విద్య, ఉపాధి రంగాలు రాష్ట్రాల జాబితాలో ఉన్నాయని.. వాటిలో రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని కేంద్ర పరిధి నుంచి తప్పించి రాష్ట్రాలకు అప్పగించాలని కేసీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'చలో ఢిల్లీ'కి పిలుపునివ్వాలని.. అవసరమైతే జంతర్‌మంతర్ వేదికగా మహాధర్నాకు సైతం దిగాలని యోచిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణ అంశమూ కొద్దిరోజులుగా రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తోంది. గతంలో ఈ అంశంపై ప్రధాని దగ్గరికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ అపాయింట్‌మెంట్‌కు ప్రధాని నిరాకరించారు. ఈ నేపథ్యంలో చలో ఢిల్లీ మహా ధర్నాలో ఎస్సీ వర్గీకరణ అంశాన్నీ లేవనెత్తి ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని కేసీఆర్ యోచిస్తున్నారు. వర్గీకరణపైనా ఢిల్లీ కేంద్రంగా ఒత్తిడి పెంచాలనే వ్యూహంతో ఉన్నారు. దీంతో ఈ రెండు అంశాలూ కలిపి కార్యాచరణ రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫెడరల్ ఫ్రంట్ యోచన, జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తేవడానికి స్వయంగా రంగంలోకి దిగుతానని కేసీఆర్ ప్రకటనల నేపథ్యంలో చలో ఢిల్లీ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. పనిలోపనిగా తనతో కలసి వచ్చే జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఒకే వేదిక మీదకు తెచ్చేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తారని ఆయన సన్నిహితవర్గాలు పేర్కొంటున్నాయి.

జూలై 15న టీఎస్‌సెట్-2018

నోటిఫికేషన్ జారీ, ఈనెల 14 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు (టీఎస్‌సెట్–2018) పరీక్షను జూలై 15న (ఆదివారం) నిర్వహించాలని ఉస్మానియా యూనివర్సిటీ నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఉస్మానియా యూనివర్సిటీ కార్యాలయంలో టీఎస్‌సెట్–2018 చైర్మన్, ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం, సభ్యకార్యదర్శి ప్రొఫెసర్ యాదగిరి స్వామి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి వచ్చే నెల 14 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 500, బీసీలకు రూ. 800, ఓసీలకు రూ.1000గా నిర్ణయించినట్లు తెలిపారు. రూ.1500 ఆలస్య రుసుముతో వచ్చే నెల 24 వరకు, రూ. 2 వేల ఆలస్య రుసుముతో మే 4వ తేదీ వరకు, రూ. 3 వేల ఆలస్య రుసుముతో మే నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పూర్తి వివరాలను www.telanganaset.org/ www.osmania.ac.in వెబ్‌సైట్లలో పొందవచ్చని తెలిపారు.

మేలో డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్!

- ఏప్రిల్ నెలాఖరులోగా కాలేజీల అనుబంధ గుర్తింపు
- ఈసారి కూడా సీజీజీకే ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలపై కసరత్తు మొదలైంది. ప్రవేశాల షెడ్యూలును ఖరారు చేసేందుకు ఉన్నత విద్యా మండలి సిద్ధమైంది. త్వరలోనే డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కమిటీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఆ సమావేశంలో 2018–19 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూలును ఖరారు చేయనుంది. మొత్తానికి ఏప్రిల్ నెలాఖరులోగా కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇక మేలో ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేసి, జూలై కల్లా ప్రవేశాలను పూర్తిచేసే ఆలోచనలు చేస్తోంది. ఈసారి కూడా ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణ బాధ్యతలను సీజీజీకే అప్పగించే ఆలోచనలు చేస్తోంది. ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియలో గతేడాది కొంత గందరగోళం నెలకొన్నప్పటికీ ఈసారి అలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడాలని భావిస్తోంది. ఇందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించింది. ఆన్‌లైన్ ప్రవేశాల అనంతరం మిగిలిపోయే సీట్లను యాజమాన్యాలు స్పాట్ ద్వారా భర్తీ చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది.

తగ్గిపోనున్న సీట్లు..

రాష్ట్రంలోని 1,100 డిగ్రీ కాలేజీల్లో 4.20 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో రెండేళ్లుగా 2.25 లక్షలకు మించి సీట్లు భర్తీ కాలేదు. ఈ నేపథ్యంలో ఈసారి సీట్లను భారీగా తగ్గించేందుకు యూనివర్సిటీలు కసరత్తు చేస్తున్నాయి. గతేడాది ఒక్క విద్యార్థి కూడా చేరని కాలేజీలు 50 ఉండగా, 250 కాలేజీల్లో 25 శాతంలోపే ప్రవేశాలు జరిగాయి. ఆయా కాలేజీల్లోనే భారీగా సీట్లు మిగిలిపోయినట్లు అంచనా. ఈ నేపథ్యంలో మూడేళ్లపాటు 30 శాతంలోపు ప్రవేశాలున్న కాలేజీల్లో ఈసారి ప్రవేశాలకు అవకాశం ఇవ్వవద్దని యూనివర్సిటీలు భావిస్తున్నాయి. దీంతో సీట్లు లక్షకు పైగా మిగిలిపోయే అవకాశముంది. అయితే, దీనిపై త్వరలో జరుగనున్న ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

సాక్షి
శుక్రవారం, మార్చి, 9

వంచనాత్మక విన్యాసం!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు షరా మామూలుగా అలవాటైన రాజకీయ క్రీడను నదురూ బెదురూ లేకుండా మరోసారి ప్రదర్శిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రజలు నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా కోసం సాగిస్తున్న పోరాటాన్ని నీరుగార్చడానికి శాయశక్తులా ప్రయత్నించి భంగపడిన బాబు... చివరికిప్పుడు గత్యంతరం లేని స్థితిలో కేంద్రంలోని తన ఇద్దరి మంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరిలతో రాజీనామా చేయించారు. దానికి బోలెడు లీకులిస్తూ రక్తి కట్టించాలని చూశారు. అంతకన్నా ముందు ఇన్నాళ్లూ తనవల్ల తప్పు జరిగిందని బాబు అంగీకరించి ఉంటే వేరుగా ఉండేది. ఎన్‌డీఏ సర్కారుపై వైఎ స్సార్ కాంగ్రెస్ ప్రతిపాదించ దలచిన అవిశ్వాస తీర్మానానికి సహకరిస్తామనో... లేదా తామే అలాంటి తీర్మానం తీసుకొస్తాం మద్దతివ్వమని కోరి ఉంటేనో బాబును ప్రజానీకం పెద్ద మనసుతో క్షమించేవారు. కానీ ఆయనగారు మాత్రం ఆ ఊసే ఎత్తకుండా ఎప్పటిలాగే తన కపటనాటకాన్ని కొనసాగిస్తున్నారు. మంత్రి పదవుల నుంచి తప్పుకుంటారటగానీ ఎన్‌డీఏలో కొనసాగుతారట... ఎన్‌డీఏ సర్కారు వైఖ రికి ఆగ్రహిస్తారటగానీ దానికి యథావిధిగా మద్దతు పలుకుతారట! రానున్న రోజుల్లో కేంద్రం స్పందన ఎలా ఉంటుందో చూసి తదుపరి చర్య తీసుకుంటారట! ఏమిటీ నయవంచన? 5 కోట్ల మంది ప్రజానీకం జీవన్మరణ సమస్య అయిన ప్రత్యేక హోదా విషయంలో ఎందుకీ డ్రామాలు? 'ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతార'న్న నానుడిని నిజం చేస్తూ బీజేపీ సైతం ఇందులో యథోచిత పాత్ర నిర్వహించినట్టు కనబడుతోంది. అటు కేంద్రంలోని టీడీపీ మంత్రులు రాజీనామా చేస్తారని బాబు ప్రకటించగానే తామూ చేస్తామని బీజేపీ నేతలు తెలిపారు. కూడ బలుక్కున్నట్టు ఒకేరోజు ఢిల్లీలోనూ, అమరావతిలోనూ రాజీనామాల పర్వం ముగిసింది. కానీ 'హోదా ఖేదం' టీడీపీ నేతల్లోగానీ, రాజీనామాలిచ్చిన కేంద్ర మంత్రుల్లోగానీ మచ్చుకైనా కనబడలేదు.

ఇంతకూ రాజీనామా పర్వంలోని ఆంతర్యమేమిటో బాబు చెప్పగలరా? కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం పెట్టి కేంద్రం చేసిందేమిటో, చేయదల్చుకున్నదేమిటో చెప్పారు. 'సెంటిమెంటుతో నిధులు రాలవ'ని కుండబద్దలు కొట్టారు. నిరుడు సెప్టెంబర్‌లో తొలిసారి ప్రత్యేక హోదా అసాధ్యమని ప్రకటించిన సందర్భంలో సైతం అరుణ్ జైట్లీ ఈ మాదిరి మాటలే అన్నారు. అప్పుడు రాత్రి పదకొండు గంటలు కావొస్తుండగా జైట్లీ మీడియానుద్దేశించి మాట్లాడితే, సరిగ్గా అర్ధరాత్రి ముహూర్తం చూసుకుని చంద్రబాబు దాన్ని స్వాగతించారు. అప్పటికీ, ఇప్పటికీ జైట్లీ మాటల్లో ఆవగింజంతయినా తేడా ఉందా? ఆనాడు నచ్చిన ప్రకటన ఇప్పుడు వెగటెందుకైంది? అప్పుడు పడి పడి పొగిడి, ఆయనకు శాలువాలు కప్పి పరవశించిన బాబుకు... ఇప్పుడు అవే మాటలు అవమానంగా ఎందుకనిపిస్తున్నాయి? అసలు తాను కోరుకుంటున్నదేమిటో స్పష్టంగా చెప్పగలరా? హోదా వద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని, అందుకే ఏపీకి ప్యాకేజీ ఇస్తున్నామని జైట్లీ అప్పుడూ, ఇప్పుడూ కూడా తేటతెల్లం చేశారు. రెవెన్యూ లోటు విషయంలోనూ అప్పటి లెక్కలే తిరగేశారు. అప్పట్లో జైట్లీ ప్రకటన చేశాక ఇక హోదా ముగిసిన అధ్యాయమని బాబు ప్రచారం మొదలెట్టారు. ప్రత్యేక హోదా తాము ఎలాంటి సిఫార్సులూ చేయలేదని ఆర్థిక సంఘం చైర్మన్ వేణుగోపాలరెడ్డి, అందులోని ఇతర సభ్యులు వివిధ వేదికలపై పదే పదే చెప్పినా అవి వినబడనట్టే నటించారు. అంతేకాదు... ప్రత్యేక హోదాపై జరిగే సదస్సుల్లో, ఉద్యమాల్లో పాల్గొంటే మీ పిల్లల్ని పీడీ చట్టం కింద జైల్లో పెట్టిస్తానని తల్లిదండ్రుల్ని బెదిరించారు. సదస్సుల నిర్వహణకు చోటు దొరక్కుండా చేయడానికి పోలీసుల్ని ఉసిగొల్పారు. ఇప్పుడు సరిగ్గా దానికి విరుద్ధమైన రాగాలు తీస్తున్నారు.

ఇన్నేళ్లుగా ఎన్ని కబుర్లు చెబుతూవస్తున్నా ప్రజల్లో 'ప్రత్యేక హోదా' ఆకాంక్ష సజీవంగా ఉండటం గమనించాక, అది రోజురోజుకూ బలం పుంజుకోవడాన్ని గ్రహించాక బాబు వెన్నులో వణుకు మొదలైంది. ముఖ్యంగా గత నెల 13న జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన తాజా కార్యాచరణ చూశాక ఆయనకు కాళ్లూ చేతులూ ఆడలేదు. ఈనెల 1వ తేదీన మొదలైన ఆ కార్యాచరణ తర్వాత అనుకున్నట్టే ఉద్యమం కొత్త మలుపు తిరిగింది. పార్లమెంటు సమావేశాలు మొదలైన 5 తేదీన ఢిల్లీలో ధర్నా జరిగింది. ఆనాటినుంచి రోజూ పార్లమెంటు కార్యకలాపాలను వైఎ స్సార్ కాంగ్రెస్ ఎంపీలు స్తంభింపజేస్తున్నారు. జనాగ్రహం దావానలంగా మారి అందులో భస్మంకావడం ఖాయమని అర్థమయ్యాక 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు విభజన చట్టంలోని అంశాలు నెరవేర్చాలని, రాజ్యసభలో ఆనాడిచ్చిన హామీలు తీర్చాల'ని బుధవారం అసెంబ్లీలో మాట్లాడి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ మాటలు మాట్లాడే ముందు గతంలో తాను చేసిన ప్రకటనలకు బాబు పశ్చాత్తాపం ప్రకటించి ఉంటే వేరుగా ఉండేది. ఎందుకంటే గత ఏడాది కాలంగా బాబు కేంద్రంనుంచి మనమే ఎక్కువ సాధించామని, మనకే దండిగా నిధులొచ్చాయని, హోదావల్ల అదనంగా ఒరిగేదేమీ ఉండదని ప్రకటనలిచ్చారు. ఢిల్లీలోని టీడీపీ మంత్రులు అదే బాణీ వినిపిస్తూ వచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి మళ్లీ ప్రత్యేక హోదా పాట అందుకుంటున్నారు.

ఉద్యమ ఉధృతిని నీరుగార్చడానికి బాబు ఆడుతున్న కపటనాటకాలను పోల్చుకోలేనంత అమాయకులు కారు ఆంధ్రప్రదేశ్ ప్రజలు. చేసేది వంచనే అయినా అందులో ప్రతిసారీ వైవిధ్యతను ప్రదర్శించడం బాబు ప్రత్యేకత. తనకంటిన 'ప్యాకేజీ మకిలి'ని చడీచప్పుడూ లేకుండా వదుల్చుకుని రాబోయే ఎన్నికల్లో 'రహస్య చెలికాడు' కాంగ్రెస్‌తో జట్టు కట్టేందుకు బాబు సన్నాహాలు చేస్తున్నట్టున్నారు. ఎన్ని వేషాలేసినా, స్వరం ఎలా మార్చినా విలువైన ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టిన వైనం జనం మరిచిపోరు. తమకేది ప్రయోజనమో, దాన్ని సాకారం చేసేదెవరో పోల్చుకుంటారు. రాజీనామా డ్రామాలు వారిని ఏమాత్రం ఏమార్చలేవు.




నిబద్ధత, విశ్వసనీయత అనేవి కార్యసాధకుడికి కరదీపికల వంటివి.

– జిగ్నూ బ్రెజెన్‌స్కీ
అమెరికన్ దౌత్యవేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.అష్టమి పూర్తి (24 గంటలు), నక్షత్రం జ్యేష్ఠ తె.4.27 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి మూల, వర్జ్యం ఉ.8.33 నుంచి 10.17 వరకు దుర్ముహూర్తం ఉ.8.37 నుంచి 9.24 వరకు, తదుపరి ప.12.33 నుంచి 1.20 వరకు, అమృతఘడియలు రా.7.01 నుంచి 8.45 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం : 6.03
రాహుకాలం :
ఉ.10.30 నుంచి
12.00 వరకు
యమగండం :
ప.3.00 నుంచి
4.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.17	మగ్రీబ్	6.25
జొహర్	12.27	ఇషా	7.37
అసర్	4.45		

ప్రజల డిపాజిట్ల మీద కన్ను

విశ్లేషణ



సురవరం సుధాకరరెడ్డి

లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న వారిలో చెల్లించలేకపోయినవారు 7 శాతం ఉండగా, కోట్ల రూపాయల అప్పులు తీసుకొని ఎగగొట్టిన వారు 93% ఉన్నారు. ఇప్పుడు వారి ప్రతినిధులే బ్యాంకుల ప్రైవేటీకరణ డిమాండ్ చేయటం విచిత్రం. ఈ బ్యాంకుల కుంభకోణాలన్నీ డిపాజిటర్ల, పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను పణంగా పెట్టి జరుగుతున్నవే. ఈ ఆర్థిక నేరాలన్నీ బ్యాంకుల అత్యున్నత అధికారులు రుణాల ఎగవేతదారులతో చేతులు కలుపడంవల్ల జరిగినవే.

నోట్ల రద్దు కుంభకోణాన్ని భారత ప్రజలు ఇంకా మరచిపోలేదు. ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. కానీ బీజేపీ నాయకులు మాత్రం ఆ చర్యను నల్లధనంపై ఆకస్మిక దాడిగా అభివర్ణించారు. ఈ వ్యవహారాన్ని చాలా రహస్యంగా ఉంచినట్లు, మంత్రులకు సైతం తెలియదన్నట్లు ఒక విధమైన అభిప్రాయాన్ని కలిగించారు. కాని పెద్దనోట్ల కట్టలు, కట్టలు తెంచుకొని ప్రవహించినట్టు స్వయంగా అధికార పార్టీకే చెందిన శాసనసభ్యుడు ప్రకటించడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. సామాన్య ప్రజలు నోట్లు మార్చుకోవడానికి చేంతాడు లాంటి క్యూలలో నిలబడాల్సి వచ్చింది. అనేక మంది ఆ క్యూలలోనే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. కొంతమంది బ్యాంకుల ఖాతాదారులు ఏటీయంల ద్వారా గాని, చెక్కుల ద్వారా గాని తాము దాచుకున్న ధనాన్ని పొందలేకపోతున్నారు. దీని ప్రభావం ఇంకా సగటుజీవిని పీడిస్తూనే ఉన్నది. నల్లధనం మాత్రం బయటపడలేదు.



మొన్న హర్షద్ మెహతా, నిన్న మద్యం చక్రవర్తి విజయ్ మాల్యా కేవలం ఒకే ఒక్క భారతీయ స్టేట్ బ్యాంక్‌కు రూ. 7,000 కోట్లు ఎగగొడితే, ఈరోజు పంజాబ్ నేషనల్ బ్యాక్ నుంచి నీరవ్ మోదీ తదితర గణం రూ. 14,000 కోట్లు ఎగగొట్టిన సంగతి వెల్లడైంది. ఈ బ్యాంకులోని అనేక అవకతవకలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. కార్పొరేట్ దిగ్గజాలు, ప్రభుత్వం, ఆర్థిక శాఖ ఈ కుంభకోణాలకు సామాన్య గుమాస్తాలను (చిరుద్యోగులను) బాధ్యులను చేయాలని చూస్తున్నారు. కార్యాలయ ఉన్నతాధికారికి తెలియకుండా ఇంత పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడం సాధ్యం కాదనేది నిర్వివాదాంశం. పరిశ్రమాధిపతుల సంఘం సైతం కుంభకోణాల ఆరోపణలను గుమాస్తాల మీదకు నెడుతున్నారు. గ్యారంటీలను ఇచ్చినప్పటికి, ఒక లక్ష రూపాయల రుణం పొందటం ఎంత కష్టమో ప్రతి ఒక్కరికి తెలుసు. రిజర్వ్‌బ్యాంక్ ప్రతి బ్యాంక్ నిర్వహణ, నిర్వాకాలపై తనిఖీ చేయాలి. కానీ ఇన్ని సంవత్సరాలుగా ఈ తనిఖీ జరగడం లేదనేది స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

అందరి జాతకాలు ఉన్నాయి

అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘాలు ఒక పుస్తకాన్ని ప్రచురించాయి. ఎంతమంది కార్పొరేట్ దిగ్గజాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు ఏ బ్యాంకు నుండి ఎన్ని కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకొన్నారు? వారు ఎన్ని సంవత్సరాల నుండి ఎంత చెల్లించాల్సి ఉంది వంటి వివరాలు అందులో వెల్లడించారు. ఈ పారు బాకీలు దాదాపు రూ. 15 లక్షల కోట్లకు చేరుకొన్నాయి. ఇవన్నీ నిరర్థక ఆస్తులుగా ప్రకటించే అవకాశముంది. వీటితోపాటు కార్పొరేట్ దిగ్గజాలు ప్రతి సంవత్సరం ఆరులక్షల కోట్ల రూపాయల రాయితీలు పొందుతున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలే కుంభకోణాలకు చిరుద్యోగులను బాధ్యులుగా చిత్రీకరిస్తూ, ఈ సమస్యకు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణే శరణ్యమని వాదిస్తున్నారు. రుణాల ఎగవేతదారుల పట్ల కఠినవైఖరి అవలంబించని వారంతా ఈనాడు ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయాలని గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకులకు రుణాల ఎగవేతదారుల పట్ల సౌమ్యంగా వ్యవహరించే అధికారులే ఈనాడు బ్యాంకులకు నష్టాలు తేవడానికి బాధ్యులు. ఆర్థిక శాఖ, రిజర్వుబ్యాంక్, ప్రభుత్వం, ప్రత్యక్షంగా, పరోక్షంగా బ్యాంకు నష్టాలకు, అవకతవకలకు వీరందరి మౌనమే ప్రధాన కారణం. వీరంతా సామాన్య క్లర్కుల మీద తప్పిదాలను నెట్టివేయడానికి అసలు కారణమేమిటంటే బ్యాంక్ ఉద్యోగుల తరచు ఆందోళనలలో ఇలాంటి అవినీతి అధికారుల ఆస్తులను జప్తు చేయాలని, వీరిని అరెస్టు చేయాలని, పాస్‌పోర్టులను రద్దు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయటమే.

దిగ్భ్రాంతి కలిగించే విషయమేమిటంటే ఒక్క బ్యాంకుకే రూ. 7,000 కోట్లు ఎగవేసిన మద్యం వ్యాపారి విజయ్ మాల్యాకు బీజేపీ రాజ్యసభ సీటు కేటాయించడం. మాల్యా, నీరవ్ మోదీ, ఆయన సోదరునితో సహా కుటుంబం మొత్తం దేశ సరిహద్దులను సౌకర్యంగా దాటి పోవడం దేశాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. నీరవ్ మోదీ అయితే, 'మీకు చేతనైంది చేసుకోండి' అని ప్రభుత్వానికి సవాలు విసరడం మరొక ఆశ్చర్యకరమైన విషయం. 2016 లోనే బెంగళూరుకు చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి నీరవ్ మోదీ బ్యాంకులకు రుణాలు ఎగగొట్టాడని, అతన్ని అరెస్టు చేయాలని, పాస్‌పోర్ట్ రద్దు చేయాలని ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. నీరవ్ ఈ జనవరిలోనే దేశం వదిలి పారిపోవడంతోపాటు, అదే నెల 23–26 తేదీలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో నరేంద్ర మోదీతో గ్రూపు ఫొటోకు పోజు ఇవ్వడం అనేక అనుమానాలకు దారితీస్తున్నది.

చిరుద్యోగులను బలి చేస్తారా?

కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవడానికి చిరుద్యోగులే ఈ కుంభకోణానికి కారణమని, అందుకే ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని గోలపెడుతున్నది. అదే నిజమైతే బ్యాంకుల జాతీయీకరణకంటే ముందు 200 ప్రైవేటు బ్యాంకులు ఎందుకు మూతపడ్డాయి? అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్‌తో సహా అనేక కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు మూత పడ్డాయి. అమెరికాలో సైతం, లేమాన్ బ్రదర్స్, మెర్రిల్ లించ్, ఏఐడి, ఫ్రెడ్డి, మాక్ ఫాన్నీమాక్, హెచ్‌బీఓఎస్, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్ మూత పడ్డాయి. ఇవన్నీ ప్రైవేట్ బ్యాంకులే. అందువల్ల అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ కుదుటపడటానికి ఫెడరల్ గవర్నమెంట్ 236 బిలియన్ల (1 బిలియన్=100 కోట్లు) డాలర్లను వెచ్చించింది. ఈ అర్థశతాబ్దకాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు అత్యద్భుతంగా అభివృద్ధి చెందాయి. దేశంలోని మారుమూల గ్రామాలకు సైతం శాఖలు విస్తరించాయి. ఈ బ్యాంకులు సన్నకారు రైతాంగానికి, చిరువ్యాపారులకు రుణాలిచ్చి ఆదుకుంటే కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం ఉమ్మడిగా వీటిపై దుమ్మెత్తి పోస్తున్నాయి. పబ్లిక్ రంగ బ్యాంకులు, రాజకీయ జోక్యంతో, రుణమేళాలు పెట్టి బ్యాంకులను దివాలా తీయించారని ఆరోపిస్తున్నారు.

లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న వారిలో చెల్లించలేకపోయిన వారు 7శాతం ఉండగా, కోట్ల రూపాయల అప్పులు తీసుకొని ఎగగొట్టిన వారు 93% ఉన్నారు. ఇప్పుడు వారి ప్రతినిధులే బ్యాంకుల ప్రైవేటీకరణ డిమాండ్ చేయటం విచిత్రం. ఈ బ్యాంకుల కుంభకోణాలన్నీ డిపాజిటర్ల, పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను పణంగా పెట్టి జరుగుతున్నవే. ఈ ఆర్థిక నేరాలన్నీ బ్యాంకుల అత్యున్నత అధికారులు రుణాల ఎగవేతదారులతో చేతులు కలుపడంవల్ల జరిగినవే. ప్రభుత్వరంగ బ్యాంకులలో అప్పులు తీసుకునే వారికి 90 రోజుల గడువుతోనే అవగాహనా పత్రాలను అందజేస్తారు. బ్యాంక్ నియమావళికి విరుద్ధంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ యాజమాన్యం 365 రోజులకు ఈ అవగాహనా పత్రాన్ని అందజేసింది. ఈ బ్యాంకులో ఈ తతంగం అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నది. నిర్ధారిత కాలంలో అప్పుతీసుకొన్న వ్యక్తి డబ్బు చెల్లించకపోతే విదేశాలలోని బ్యాంక్ శాఖలు తిరిగి అప్పు ఇచ్చి ఉండాల్సిందికాదు.

రుణం తీసుకొన్న వారి ఆస్తుల విలువ మొత్తం రుణం మొత్తం కంటే ఎక్కువ ఉందా లేదా అనేది సాధారణమైన పరిజ్ఞానంతో అంచనా కడతారు. దానివల్ల బ్యాంకుకు ఏమైనా నష్టం వస్తుందా అనే అంశంపై అంచనా వేస్తారు. ఆస్తుల రహస్యమేమిటంటే బ్యాంక్‌లో జరిగే ఆర్థిక నేరాన్ని అరికడితే మేనేజర్‌కు వచ్చే ప్రోత్సాహకాలు లేవు. కాబట్టి మేనేజర్ అప్పు తీసుకొన్నవారితో చేతులు కలిపితే అతనికి ముడుపులు ముట్టడం ఖాయం.

ఆ బిల్లుతో ప్రజల డిపాజిట్లకు ఎసరు

ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లును ముందుకు తీసుకొస్తున్నది. ఇదొక మోసపూరిత నల్లచట్టం. పార్లమెంట్‌లో చెవులు, కళ్లు మూసుకొని మందబలంతో ఒకసారి ఈ బిల్లును ఆమోదిస్తే పట్టపగలు డిపాజిటర్ల సొమ్మును ప్రభుత్వం లాగేసుకొని డిపాజిటర్లను వీధిన పడేస్తుంది.

డిపాజిటర్ల సొమ్ము నుండి కార్పొరేట్లకు రుణాలను అందజేస్తే వీరు విదేశాలకు వెళ్లి తందనాలాడుతుంటే తద్వారా బ్యాంక్‌లకు నష్టం వాటిల్లితే, ఆ బ్యాంక్ డిపాజిటర్ల సొమ్ముతో, పన్ను చెల్లింపుదార్ల సొమ్ముతో ఆదుకోవడం ఈ బిల్లు లక్ష్యం. వీటినే 'బేల్ ఇన్' అని అంటారు. ఇలాంటి బ్యాంకులను ప్రభుత్వ ఖజానా నుండి గాని డిపాజిటర్ల సొమ్ము నుండి గాని ఆదుకోవడానికి ఈ బిల్లు అధికారాన్ని ఇస్తుంది. ప్రభుత్వమే చెల్లిస్తే 'బేల్ అవుట్' అంటారు. ఈ వార్త బయటికి పొక్కగానే బ్యాంకుల నుండి డిపాజిట్లు ఉపసంహరించుకోవటం చకచకా జరిగిపోయింది. ఈ ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఏటీఎం ద్వారా డబ్బులు తీసుకొనే యంత్రాలలో డబ్బులు లేని పరిస్థితి దాపురించింది. ఈ ఆర్థిక సంక్షోభానికి ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ కానీ, ఫైనాన్షియల్ బిల్లు కానీ జవాబు కానేరదు.

కానీ ఇలాంటి రుణ ఎగవేతదారుల పాస్‌పోర్టులను రద్దు చేయడం, వాళ్ల ఆస్తులను జప్తు చేయడం జరగాల్సిందే. రుణ ఎగవేతదారులందరిని వెంటనే అరెస్టు చేయాలి. వారిని జైళ్లకు పంపి కఠినంగా శిక్షించాలి. విదేశాలకు పారిపోయిన వీరిని వెంటనే ఇంటర్‌పోల్ సహకారంతో వెనక్కి రప్పించాలి. వారికి సహకరించిన బ్యాంకు ఉన్నతాధికారులను, బాధ్యతలను విస్మరించిన వారందరిని కఠినంగా శిక్షించాల్సిందే. ప్రభుత్వరంగ బ్యాంకులను పరిరక్షించాలి. ప్రైవేటీకరణ డిమాండ్‌ను నిరాకరించాలి.

వ్యాసకర్త గౌరవాధ్యక్షులు, ఎ.పి., తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, భారత కమ్యూనిస్టుపార్టీ మాజీ ఎంపీ

ప్రతి అడుగూ ప్రగతివైపే..

అర్హులైన ప్రతి పేదవాడూ డబుల్ బెడ్‌రూం ఇంట్లో పిల్లాపాపలతో సగౌరవంగా బతకాలనేది కేసీఆర్ ఆకాంక్ష. దశల వారీగా ప్రతి అర్హునికి సొంత ఇంటి కల నెరవేరేంత వరకు ఈ పథకం కొనసాగుతూనే ఉంటుందని అసెంబ్లీలో ప్రకటించారు.

అభిప్రాయం



సోలిపేట రామలింగారెడ్డి

దశాబ్దాల కాలం పాటు కొనసాగిన వివక్ష, అన్యాయంపై అవిశ్రాంత పోరాటం చేసి సాధించుకున్న రాష్ట్రం మనది . తెలంగాణ ఇది ఒక ప్రత్యేకమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. వైవిధ్యభరిత జీవన విధానం ఇక్కడి ప్రజలది. అనువంశికంగా అబ్బిన అద్భుతమైన నైపుణ్యాలను పొందిన సామాజిక వర్గాల సమాహారమే తెలంగాణ పల్లెలు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయటం ద్వారానే తెలంగాణ అభివృద్ధి ఎదుగుదల దిశగా పయనిస్తుంది. కోట్లాడి ప్రత్యేక రాష్ట్రం సాధించుకొని కొత్త అధ్యాయాన్ని లిఖించాం. ప్రతి అడుగు ప్రగతి వైపే వేస్తూ సరికొత్త చరిత్రకు రూపం పోయాలి. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలే పాలకులకు, ప్రతిపక్షాలకు కొలబద్దలు కావాలి.

పల్లెల మొండి గోడల మీద మొలిచిన చెట్లను పీకేసి, బీడు బడిన భూములను పొతం చేసుకునే సమయం ఇది. గ్రామ జీవితం మీద అలుముకున్న విషణ్ణ వదనాన్ని తొలగించి సుందరమైన, సుసంపన్నమైన ముఖ చిత్రాన్ని తీర్చి దిద్దుకోవాల్సిన తరుణం. తాత్విక ధోరణికి, తార్కిక ఆలోచనలకు పదును పెట్టి ప్రతి ఒక్కరు బంగారు తెలంగాణ భౌతిక స్వరూపం కోసం జనం మధ్యన నిలబడాల్సింది పోయి, అధికార పీఠమే పరమార్థంగా ప్రతిపక్షాలు, విమర్శించటమే పనిగా పెట్టుకున్న ఓ స్వయం ప్రకటిత మేధావి వర్గం విమర్శలను వల్లిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకోలేక వందలాది యువత, విద్యార్థుల బలిదానాలకు కారణమైన వీళ్లే ఇప్పుడు తాత్విక దారిద్ర్యంతో తెలంగాణ అభివృద్ధిని పునాదుల్లోనే సమాధి చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు.

తాత్విక దృక్పథం తెలంగాణ సామాజిక వర్గాల్లో సామాన్య ప్రజలకు సహజంగానే అబ్బింది. జనం తార్కికంగా ఆలోచిస్తూ, ఏది మంచో ఏది చెడో అర్థం గమనిస్తున్నారు. కానీ ప్రతిపక్షానికి, కుహనా మేధావి వర్గానికి ఇది ఇంకా అబ్బినట్లు లేదు. తెలంగాణ బాగుకన్న వారికి అధికార పీఠం, వాళ్ల స్వంత ప్రయోజనాలే ముఖ్యం. ముందుగా అవి నెరవేరితే చాలు వారికి ఏ పట్టింపూ ఉండదు. అవి నెరవేరినపుడు, ప్రజలు బాగుపడుతున్నారా? దళితులు ఆత్మగౌరవంతో బతుకుతున్నరా? లేదా? అనే దానితో పనే లేదు. ఏ పని చేపట్టినా... అందులోని చెడును మాత్రమే వెతికితీయటం, మంచిని కూడా చెడుగా చూపబూనటమే వారి ధోరణి అవుతుంది. గత మూడున్నరేండ్లుగా ప్రతి పనిలోనూ ఇదే ధోరణి.

నిరుపేదలు, దళిత బహుజనులు ఆత్మ గౌరవంతో బతకాలి. అర్హులైన ప్రతి పేదవానికీ డబుల్ బెడ్‌రూం ఇంట్లో పిల్లాపాపలతో సగౌరవంగా బతకాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష. రూ 5.04 లక్షలు ఖర్చు చేసి రెండు పడక గదులు, హాలు, వంటగది రెండు మరుగుదొడ్లతో ఇళ్ల నిర్మాణం చేయాలనే నిర్ణయం ఒక తెగువ. సంక్షేమం అంటేనే ప్రజలను కూర్చోబెట్టి పోషించటం అనే భ్రమలతో ఉన్న భ్రమిత్‌షా, మోదీ లాంటి వాళ్లకు తలకిందులుగా తపస్సు చేసినా ఈ తెగువ రాదు. ఇప్పటి వరకు 2.60 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. ఇది దశల వారీగా ప్రతి అర్హునికి సొంత ఇంటి



కల నెరవేరేంత వరకు కొనసాగుతూనే ఉంటుందని కేసీఆర్ అసెంబ్లీలోనే ప్రకటించి చట్టబద్ధత కల్పించారు.

రాష్ట్రంలోనే అత్యధికంగా నా దుబ్బాక నియోజకవర్గానికి 3,900 ఇళ్లు వచ్చాయి. ఇందులో 70 శాతం ఇళ్లు దళిత, గిరిజనులకే ఇచ్చాం. కొత్త మండలం రాయపోల్‌లో చిన్న జాగా సమస్య ఉత్పన్నం అయింది. 45 మంది దళిత కుటుంబాలకు గుడిసెల స్థానంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను కట్టివ్వాలనుకున్నాం... గుడిసెలు తీసిన తరువాత జాగా సరిపోలేదు. వెంటనే మరో స్థలం చూసి లే అవుట్ చేశాం. దీనికి 10 రోజుల సమయం పట్టింది. ఇంకేముంది... గోతి కాడినక్కలా ఎదురు చూస్తున్న బీజేపీ రాజకీయ దురుద్దేశం మది నిండా పెట్టుకుని.. దళితులకు అన్యాయం జరిగిపోయిందని ఆరోపించి జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులను తీసుకువచ్చింది. దళితులపై పోలీసు, అగ్రవర్ణాల ఆగడాలను సహించలేకనే.. గన్నును, ఆ తరువాత నా పెన్నును వాళ్లకు రక్షణ కవచంగా పెట్టిన వాణ్ణి.. గోసాన్‌పల్లిలో 25 దళిత కుటుంబాలను పోలీసులు గ్రామ బహిష్కరణ చేసినప్పుడు నా ప్రాణాలను అడ్డుపెట్టి ధర్మ పోరాటం చేసిన వాణ్ణి. ఈ కమిషన్ సభ్యున్ని ఒక్కటే ఒక ప్రశ్న అడుగుతున్న. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అభంగ పట్నంలో బీజేపీ నాయకుడు భరత్‌రెడ్డి దళితులను మురికి నీళ్లలో ముంచి దారుణంగా అవమానించినప్పుడు ఆ కేసును ఎందుకు సుమోటోగా తీసుకోలేదు? మీ ప్రభుత్వం ఉన్న రాజస్తాన్‌లో అగ్ర వర్ణ కామాంధులు ఈడొచ్చిన దళిత ఆడబిడ్డను బలవంతంగా ఎత్తుకపోయి మానభంగాలకు పాల్పడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా మీరెందుకు స్పందించలేదు?

రాయపోల్ దళితులు గుడిసెల్లోనే ఉండాలనేది మీ ఉద్దేశ్యం అయితే చెప్పండి.. దాన్ని మా దళిత సోదరులు స్వాగతిస్తే మళ్లీ అదే జాగాలో గుడిసెలు వేసిస్తాం. ప్రతి రాజకీయ పార్టీకి తమ సొంత లక్ష్యాలు ఉంటాయి. వాటిని నేను తప్పు పట్టలేను, పట్టను. కానీ ఆ లక్ష్య నిర్దేశాలు తెలంగాణ సమాజానికి చేస్తున్న మేలు ఎంత? అని ఒక్కసారి కాకుంటే ఒకసారైనా విజ్ఞులు బేరీజు వేసు కోవాల్సిన అవసరం లేదా? తెలంగాణ రాష్ట్రంలో జరిగే ప్రతి ఆవిష్కరణ నూటికి నూరుపాళ్లు ప్రజల కోసం గాని మరెవరి కోసమూ కాదు. అందుకు సరిపోగల తాత్వికతను పార్టీలు గానీ, మేధావులుగానీ చూపాల్సి ఉంది. అటువంటి తాత్వికతలో నిర్మాణాత్మకత ఉంటుంది. అలా కాకుండా కమిషన్ మా చేతిలో ఉంది. అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తామంటే... టాడా కేసులకే రామలింగారెడ్డి భయపడలేదు. ఒక్క విషయమైతే సుస్పష్టం. రాయపోల్‌లో నా దళిత సోదర కుటుంబాలను డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి తోలిన తరువాతే జైలుకు వెళ్తా.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు, దుబ్బాక ఎమ్మెల్యే
మొబైల్ : 94403 80141

లక్ష్య రహిత ప్రత్యామ్నాయం

అధికారాన్ని నిలుపుకోవడం కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ప్రజలకిచ్చి, వాటిని నెరవేర్చమనే పార్టీల గొంతెమ్మ కోర్కెలను కాదంటే ఫెడరల్ స్ఫూర్తిని గౌరవించనట్లేనా? మూడో ఫ్రంట్ ప్రతిపాదనకు మూలం ఇదేనా?

సందర్భం



రావుల శ్రీధర్ రెడ్డి

తెలంగాణ వచ్చేంతవరకు ఆంధ్రా వాళ్లను నోటికొచ్చినట్లు, ఇష్టమున్న భాష, యాసలో తిట్టిన తెరాస నాయకులు, ప్రత్యేకించి ముఖ్యమంత్రి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ఆ పదజాలాన్ని ప్రతిపక్షాలను తిట్టడానికి యథేచ్ఛగా వాడుతున్నారు. వాస్తవానికి కేసీఆర్ అద్భుతమైన వాగ్ధాటి కలిగిన నాయకుడు. ప్రపంచ తెలుగు మహాసభల లాంటి సందర్భాల్లో ఆయన పద్య, గద్య పాండిత్యాన్ని చూసిన/ విన్న వారెవరూ 'వారెవ్వా' అనకుండా ఉండలేరు. కానీ దురదృష్టవశాత్తూ సాధారణ జనంలో వారి ఆ పాండిత్యం కంటే ప్రత్యర్థులను ఉద్దేశించి తిట్టే ఎక్కువ ప్రచారంలో ఉన్నాయి. సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఆ భాష మాట్లాడుతున్నప్పుడు మాకేం అడ్డు అన్నట్లు మిగతా మంత్రులు, నేతలు అదే పంథాను ఎంచుకున్నారు.

అయితే, నాయకుల దూషణ, భూషణల మధ్య రాజకీయ సంరంభాన్ని వీక్షిస్తున్న ప్రజలు మాత్రం.. ఏలినవారు తెలంగాణలో ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతూ పోతున్నా కిమ్మనకుండా ఉంటున్నట్లున్న వైఖరి ఆశ్చర్యం కలిగిస్తోంది. దళిత ముఖ్యమంత్రి అనే హామీని అవలీలగా అవతలికి నెట్టి గద్దెనెక్కినా, దళితులకు మూడెకరాల భూమి అని ఆడంబరంగా పలికి హామీలో పదోవంతు చేయకున్నా నాయకులు కేసీఆర్‌కి మంగళ హారతులు పట్టారు, డబుల్ బెడ్ రూం ఇళ్లు కనీసంగానైనా పూర్తి చేయకున్నా, ఉద్యోగాల హామీలు నీటి మూటలైనా పూర్తి చేయకున్నా, ఉద్యోగాల హామీలు నీటి మూటలైనా, అప్పుడు డబులైె ఆర్థిక భారం పెరిగినా, భూమిలో సగం, ఆకాశంలో సగం, జనంలో సగం, ఆఖరికి జీవితంలో సగమని చెప్పిన మహిళలకు మంత్రి వర్గంలో స్థానమివ్వకున్నా, కుటుంబ రాజకీయాలను బ్రహ్మాండంగా నడుపుతున్నా, చివరకు ప్రజలు తమకు ఇచ్చిన హామీలు ఏమయినాయి అని అడిగి, నిరసన తెలిపే అవకాశం ఉన్న ధర్నాచౌక్‌ను తొలగించినా, ఉలకని పలకని పరిస్థితి. బలమైన ఉద్యమాన్ని నిర్మించలేని అశక్తత.

తెలంగాణలోని మేధావులేమయిపోయి నారు. స్వజాతికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కితే ప్రశ్నించాల్సిన దళిత మేధావులెక్కడ. దేశంలో ఎక్కడో ఏదో జరిగితే అవార్డులు వెనక్కిచ్చిన బహుజన కవులెక్కడ? బహుశా ప్రజల్లోని నిస్తేజం, సమాజంలోని నిష్క్రియాపరత్వం కేసీఆర్‌ను, ప్రధానిని కూడా స్వాతంత్ర్యానంతర భారతంలో ఏ ముఖ్యమంత్రీ మరే ప్రధానినీ సంబోధించని పద్ధతిలో మాట్లాడేలా పురిగొల్పినట్టు కన్పడుతోంది. తన వ్యాఖ్యలపై కనీసంగా విచారం వ్యక్తం చేయలేదు సరికదా. బీజేపీ వాళ్ళే ఆయన అనని మాటలను కూడా అన్నట్లు సృష్టించినట్లు మాట్లాడి, పైగా నాపై కేసులు పెడతారా? నన్ను ముట్టుకుంటే భస్మం అయిపోతారని



హుంకరించారు. పనిలో పనిగా థర్డ్ ఫ్రంట్ పాట ఎత్తుకున్నారు.

నాలుగు జిల్లాల నుంచి 400 మందిని ప్రగతి భవన్‌కు పిలిపించి పడికట్టు మాటలతో ఉపన్యాసాన్ని దంచితే, వచ్చిన వారంతా అప్పుడే కేసీఆర్‌కు దేశ ప్రజల ఆమోదం లభించేసినట్లు 3వ కూటమి అధికారంలోకి వచ్చి కేసీఆర్ ప్రధాని అయి నట్లు నినాదాలిచ్చి, సాక్షాత్తూ మంత్రులు కూడా ఏదో అయిపోతుందని భ్రమింపజేసే యత్నం 'పిల్ల పుట్టకముందే కుల్ల కుట్టినట్లున్న' సామెతను గుర్తుకు తెస్తుంది. అవసరానికి ఇతరులను మోసం చేసినవాళ్లను చూస్తున్నాం. కానీ ఏమీ జరక్కున్నా ఈ ఆత్మవంచనలు ఎందుకో ఎవరికీ అర్థంకాని పరిస్థితి.

ఇక మూడో ఫ్రంట్ ఎందుకనే అంశంపై కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పాలన ప్రజలకు నచ్చలేదని తీర్పిచ్చేశారు. 32 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రజలు ఒక పార్టీని, నాయకుడిని నమ్మి అధికారం కట్టబెడితే ఒక్క అవినీతి మరక కూడా లేకుండా సమర్థ పాలనతో, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో పరుగులెట్టిస్తున్న మోదీ పాలనను కాంగ్రెస్ పాలనను పోల్చటం సబబేనా?

కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉండి, అధికారాన్ని నిలుపుకోవడం కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ప్రజలకిచ్చి, వాటిని నెరవేర్చమనే పార్టీల గొంతెమ్మ కోర్కెలను కాదంటే ఫెడరల్ స్ఫూర్తిని గౌరవించనట్లేనా? రిజర్వేషన్లను ఇష్టారీతిన ఇచ్చే అధికారం రాష్ట్రాలకివ్వాలనటం విచ్చలవిడితనాన్ని ఒప్పుకోవాలనటం కాదా?

కేసీఆర్ ప్రతిపాదిస్తున్న ఫ్రంట్‌లు, వాటి చరిత్ర తెలియంది కాదు. ఈ దేశం నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌లను చూసింది. అవి అభాసుపాలైన తీరూ చూసింది. వీపీ సింగ్, చంద్రశేఖర్, దేవెగౌడ, ఐ.కె. గుజ్రాల్ లాంటి వారు విఫలమైన వ్యవహారాలన్నీ చూసింది. సిద్ధాంత సారూప్యత, దీర్ఘకాలిక లక్ష్యాల్లే కుండా అధికారమే పరమావధిగా నిర్మితమయ్యే బంధాలు ఎక్కువకాలం కొనసాగలేవన్న సత్యం తెలిసి ప్రత్యామ్నాయ ఫ్రంట్, టెంటు అంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.

చివరగా చెప్పాలంటే ఎవరే ఫ్రంట్ కట్టినా, ప్రజల మద్దతు బలంగా ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని, రాష్ట్రాల వారీగా విజయాలందుకుంటూ, ప్రజా మద్దతును మరింత పెంచుకుంటున్న మోదీ ఇమేజ్ ముందు ఈ ప్రయత్నాలేవీ ఫలించవు. అధికారం కోసమే ఐక్యత రాగాలు పాడే వారిని ప్రజలు సమర్థించరు.

వ్యాసకర్త బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తెలంగాణ

రూ. 10కే బాయ్‌ఫ్రెండ్



చైనాలో షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో తమని అద్దెకు తీసుకునే వారి కోసం ఎదురు చూస్తున్న యువకులు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం అక్కడ యువతులు ఒక యువాన్(రూ.10) చెల్లించి అరగంట సేపు బాయ్‌ఫ్రెండ్‌ను అద్దెకు తీసుకునే ఆఫర్ పెట్టారు.

కర్ణాటకకు రాష్ట్ర జెండా..

ఆవిష్కరించిన సీఎం సిద్దరామయ్య



బెంగళూరు: కర్ణాటక రాష్ట్రం కోసం రూపొందించిన అధికారిక జెండాను ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య ఆవిష్కరించారు. 'నాద ధ్వజ'గా పేర్కొంటున్న ఈ జెండాలో పసుపు, తెలుపు, ఎరుపు వర్ణాలతోపాటు మధ్యలో రాష్ట్ర చిహ్నమైన 'గండభేరుండ' ఉంటుంది. రాష్ట్రానికి ప్రత్యేక జెండా ఉండాలన్నది కన్నడిగుల అభిప్రాయం, ఆకాంక్ష అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. దీనిని శుక్రవారం రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించనున్నట్లు తెలిపారు. రాష్ట్రాలకు ప్రత్యేక పతాకం ఉండకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. జాతీయ జెండానే అత్యున్నతమనీ, రాష్ట్ర జెండా కంటే ఎత్తులో ఉంటుందనీ వివరించారు. కాగా, ప్రస్తుతం దేశంలో జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేక జెండా ఉంది.

మనమంతా 'సోషల్' బానిసలం..

టొరంటో: 'రోజంతా మా అబ్బాయి స్మార్ట్‌ఫోన్‌కు అతుక్కుపోతున్నాడు. ఇంట్లో ఎవరితోనూ కలవడు. స్మార్ట్‌ఫోన్ చూస్తూ.. భోజనం, ఆటలు, చదువు ఇలా అన్ని మర్చిపోతున్నాడు'అంటూ తల్లిదండ్రులు తెగ కంగారు పడిపోతుంటారు. దీంతో స్మార్ట్‌ఫోన్ వాడద్దంటూ పిల్లలపై ఆంక్షలు విధిస్తుంటారు. అలాగే పెద్దలు కూడా స్మార్ట్‌ఫోన్ వాడుతుంటే స్మార్ట్‌ఫోన్ బానిసలం అని వ్యాఖ్యానిస్తుంటాం. వాస్తవానికి పిల్లలతోపాటు పెద్దలెవరూ కూడా స్మార్ట్‌ఫోన్‌కు బానిసలు కారట.. కేవలం మనమంతా సామాజిక మాధ్యమాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న బలమైన కోరిక వల్లే స్మార్ట్‌ఫోన్ వాడుతుంటామని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అంటే మనమంతా స్మార్ట్‌ఫోన్‌కు కాకుండా.. సోషల్ మీడియాకు మాత్రమే బానిసలం అని అంటున్నారు. ఇలాంటి వారంతా కేవలం హైపర్ సోషల్ తప్ప యాంటీ సోషల్ కాదని అధ్యయనం పేర్కొంది. సోషల్ మీడియాలో వేరే వాళ్ల గురించి తెలుసుకోవడానికి.. అలాగే తాను చేసేది అందరూ చూడాలనే కోరిక వల్లే సామాజిక మాధ్యమాల్లో అధిక సమయం గడుపుతున్నామని కెనడాలోని మెక్ గిల్ యూనివర్సిటీకి చెందిన శామ్యూల్ తెలిపారు. ఇలా ఒకరి గురించి తెలుసుకోవాలనుకోవడం... మన గురించి ఇతరులు తెలుసుకోవాలనుకోవడం ఇప్పుడు కొత్తదేం కాదని.. పూర్వీకుల నుంచే వస్తోందని వివరించారు. నోటిఫికేషన్స్‌ను ఆఫ్ చేయడం, ఫోన్ చూడాల్సిన సందర్భాలను ముందుగానే ఎంచుకోవడం వంటివి చేయడం వల్ల స్మార్ట్‌ఫోన్‌కు కొంచెం దూరంగా ఉండొచ్చని వెల్లడించారు.

12 వరకూ నీట్ దరఖాస్తుల గడువు పెంపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)కు దరఖాస్తులు సమర్పించేందుకు తుదిగడువును మార్చి 12 వరకూ పొడిగించినట్లు సీబీఎస్ఈ తెలిపింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కాకుండా మిగతా గుర్తింపుకార్డులనూ అనుమతించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సీబీఎస్ఈ ఈ నిర్ణయం తీసుకుంది. ఇంతకుముందు నీట్ పరీక్ష దరఖాస్తుల సమర్పణకు తుదిగడువు మార్చి 8గా ఉండేది. తాజా నిర్ణయం ప్రకారం విద్యార్థులు తమ దరఖాస్తుల్ని మార్చి 12 సాయంత్రం 5.30 వరకూ సమర్పించవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజును మార్చి 13, రాత్రి 11.50 వరకూ చెల్లించవచ్చన్నారు.

హదియా భర్తతో కలసిఉండొచ్చు: సుప్రీం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'లవ్ జిహాద్' కేసులో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. కేరళకు చెందిన షఫీన్ జహాన్, హదియా అలియాస్ అఖిలా అశోకన్‌ల వివాహం చెల్లదంటూ గతేడాది కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం కేరళ హైకోర్టు ఈ వివాహాన్ని రద్దుచేయకుండా ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. ఇద్దరు మేజర్ల మధ్య జరిగిన వివాహంలో కోర్టులు ఆర్టికల్ 226 ప్రకారం జోక్యం చేసుకోలేవనీ, ఆ పెళ్లిని రద్దు చేయలేవని కోర్టు అభిప్రాయపడింది. భర్త షఫీన్ జహాన్‌తో కలసి జీవించే పూర్తిస్వేచ్ఛ హదియాకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

దావూద్ అనుచరుడు ఫరూక్ అరెస్టు

న్యూఢిల్లీ: అజ్ఞాతంలో ఉన్న మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు ఫరూక్ తక్లా(57)ను సీబీఐ అరెస్ట్ చేసింది. అతడు గురువారం దుబాయ్ నుంచి ఢిల్లీ విమానాశ్రయం చేరుకోగానే అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆ తరువాత ముంబై తరలించి బాంబు పేలుళ్ల కేసు విచారిస్తున్న ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా కోర్టు అతడిని మార్చి 19 వరకు సీబీఐ కస్టడీకి అప్పగించింది. నిఘా వర్గాల ప్రయత్నాల ఫలితంగానే యూఏఈ ఫరూక్‌ను భారత్‌కు అప్పగించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ముంబై బాంబు పేలుళ్లకు పాల్పడి దేశం నుంచి పరారయిన నిందితులకు ఫరూక్ సహాయకారిగా దోహదపడ్డాడు.

అపరిమిత వైద్య ఖర్చులపై ఏం చేశారు?



న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న అపరిమిత వైద్య ఖర్చుల విషయంలో ఏవైనా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. వైద్యానికి అయ్యే అంత ఖర్చును భరించలేక ప్రజలు సరైన చికిత్సకు నోచుకోలేకపోతున్నారని ఆవేదనవ్యక్తం చేసింది. ఢిల్లీలోని నాలుగు ఆస్పత్రుల్లో నాన్ షెడ్యూల్డ్ మందులు, డయాగ్నస్టిక్స్ సేవలకు విపరీతమైన ధరలు ఉన్నాయని జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ఓ నివేదికలో పేర్కొంది. అడ్రినార్ అనే 2మిల్లీలీటర్ల ఇంజెక్షన్‌కు రిటైల్ ధర రూ. 189.95 ఉందని, అదే ఆస్పత్రులకు మాత్రం రూ.14.7కే వస్తోందని, అయితే రోగులకు పన్నులతో కలుపుకొని రూ.5,318కి అమ్ముతున్నట్లు తేలింది.

చౌకైన శానిటరీ న్యాప్‌కిన్ల ఆవిష్కరణ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అత్యంత చౌకైన, మట్టిలో కలసిపోయే శానిటరీ న్యాప్‌కిన్లను కేంద్రం గురువారం ఆవిష్కరించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన(పీఎంబీజేపీ) కేంద్రాల్లో నాలుగు న్యాప్‌కిన్లు ఉండే ఒక్కో ప్యాక్‌ను 'సువిధా' పేరుతో కేవలం రూ.10కే అందించనున్నట్లు కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది మే 28 నాటికల్లా దేశంలోని 3,200 పీఎంబీజేపీ కేంద్రాల్లో వీటిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

ప్రాంతీయ పార్టీలు ఏకం కావాలి: మమత



కోల్‌కతా: వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని ప్రాంతీయ పార్టీలు ఏకం కావాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. బెంగాల్‌లో అధికారం కోసం బీజేపీ కలలు కనడం మానేసి కేంద్రంలో అధికారం నిలుపుకోవడంపై దృష్టిపెట్టాలని, ఇప్పటికే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ.. 'దేశంలోని వివిధ పార్టీ ల తిరుగుబాటు శంఖారావాలు వినిపించడం లేదా? రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లోని ఎన్నికలు ఫలితాలు మీకు అర్థం కావడం లేదా?' అని ఆమె ప్రశ్నించారు.

ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో సాంస్కృతికోత్సవాలు

చెన్నై: నగరంలోని ఎస్‌ఆర్‌ఎం డీమ్డ్ యూనివర్సిటీలో మిలన్–2018 పేరుతో సాంస్కృతికోత్సవాలు బుధవారం ఘనంగా మొదలయ్యాయి. ఈ వేడుకల ప్రారంభ కార్యక్రమానికి అర్జున్ రెడ్డి చిత్ర హీరో విజయ్ దేవరకొండతోపాటు ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయ వ్యవస్థాపక చాన్స్‌లర్ టీఆర్ పారివేందర్, వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్ తదితరులు హాజరయ్యారు. మొత్తం ఐదు రోజులపాటు సాంస్కృతికోత్సవాలు జరగనుండగా తొలిరోజు దాదాపు 6,000 మంది వచ్చారనీ, వేడుకల్లో పాల్గొనేందుకు ఐదు ఖండాల్లోని 40 దేశాల నుంచి విద్యారంగ ప్రముఖులు ఇక్కడకు రానున్నారని నిర్వాహకులు తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి మొత్తంగా రూ.15 లక్షల నగదును ఇవ్వనున్నట్లు చెప్పారు.

బైక్‌ను తన్నిన పోలీసు.. గర్భిణి మృతి

సాక్షి ప్రతినిధి, చెన్నై: హెల్మెట్ చెకింగ్ కోసం ఆగకుండా వెళ్లిపోతున్న ఓ వ్యక్తి బైక్‌ను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంబడించి కాలితో తన్నడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ గర్భిణి మరణించింది. బైక్ నడుపుతున్న ఆమె భర్తకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ ఘటన తమిళనాడులోని తిరుచ్చిరాపల్లిలో జరిగింది. తిరుచ్చిరాపల్లిలోని తువకూడీ టోల్‌ప్లాజా సమీపంలో ట్రాఫిక్ పోలీసులు బుధవారం హెల్మెట్ చెకింగ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా భార్యతో కలసి బైక్‌పై బయలుదేరిన రాజాను ఆపడానికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కామరాజ్ యత్నించారు. కానీ రాజా బైక్‌ను ఆపలేదు. వెంటనే మరో బైక్‌పై వెంబడించిన కామరాజ్.. తిరుచ్చిరాపల్లి–తంజావూరు హైవేపై రాజా బైక్‌ను కాలితో తన్నారు. దీంతో బైక్‌పై ఉన్న దంపతులిద్దరూ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నాలుగు నెలల గర్భిణి ఉషాను ఆస్పత్రికి తరలించగా.. మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై పోలీసులు కామరాజ్‌ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఉషా మృతికి సంతాపం తెలిపిన సీఎం పళనిస్వామి.. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.7 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. ఉష కుటుంబానికి రూ.రెండు లక్షల ఆర్థిక సాయాన్ని మక్కల్ నీది మయ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కమల్ హాసన్ ప్రకటించారు.

ఆ బాధ్యత అత్తలదే!

బాలికా సంరక్షణపై ప్రధాని

- భ్రూణహత్యలు సిగ్గుచేటు.. ఆందోళనకరం
- రాజస్తాన్‌లోని ఝుంఝున్ బహిరంగ సభలో పాల్గొన్న మోదీ
- 640 జిల్లాలకు బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం విస్తరణ



ఝుంఝున్‌లో 'బేటీ బచావో, బేటీ పఢావో' లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ఝుంఝున్: లింగవివక్ష లేకుండా అందరూ సమానమనే భావనను సమాజం అలవర్చుకోవాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బాలికల భ్రూణహత్యలు మనం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. ఇంట్లో ఆడపిల్లలను సంరక్షించే బాధ్యతను ఆ బాలిక తల్లి, అత్తగారే తీసుకోవాలని సూచించారు. మహిళాదినోత్సవం సందర్భంగా 'బేటీ బచావో, బేటీ పఢావో' పథకాన్ని విస్తరించే ప్రణాళికలో భాగంగా నేషనల్ న్యూట్రిషన్ మిషన్ (ఎన్ఎన్ఎమ్)ను రాజస్తాన్‌లోని ఝుంఝున్‌లో మోదీ ప్రారంభించారు. 'సమాజంలో ప్రతిఒక్కరూ సమానమే. బాలురతో సమానంగా బాలికలు నాణ్యమైన విద్యను అందుకోవాలి. బాలిక ఎప్పటికీ భారం కారాదు. ఆమె మన కుటుంబానికి గర్వకారణం. చుట్టుపక్కల చూడండి. మన కూతుళ్ల దేశప్రతిష్టను ఎలా పెంచుతున్నారో గమనించండి. కుమారులతో సమానంగా కూతుళ్లను పెంచండి' అని అన్నారు. నవభారత నిర్మాణం కోసం మహిళల జీవితాల్లో సానుకూలమైన మార్పుతీసుకురావటం, మహిళాశక్తిని సరైన పద్ధతిలో వినియోగించుకోవటం చాలా అవసరమన్నారు. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమాన్ని 161 జిల్లాలనుంచి దేశవ్యాప్తంగా 640 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు ప్రకటించారు.

మనం 21వ శతాబ్దంలో ఉన్నామా?

'తరగతి గదుల నుంచి క్రీడాప్రాంగణాల వరకు ప్రతిచోటా వారు రాణిస్తున్నారు. అందుకే నేడు బాలికలకు సమానత కల్పించే వాతావరణాన్ని సృష్టిస్తామని మనం ప్రతిజ్ఞ చేయాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ లింగ వివక్ష చూపకూడదు. దేశంలో బాలికల భ్రూణ హత్యలు జరుగుతుండటం మనం సిగ్గుపడాల్సిన, ఆందోళన చెందాల్సిన విషయం. ఈ దారుణమైన అలవాటును సమాజం నుంచి రూపుమాపేందుకు మనందరం చిత్తశుద్ధితో పనిచేయాలి. మనమింకా 18వ శతాబ్దపు ఆలోచనలతోనే ఉన్నాం. అలాంటప్పుడు 21 శతాబ్దపు పౌరులమని చెప్పుకునే హక్కు మనకెక్కడిది' అని మోదీ పేర్కొన్నారు. బాలికలను పురిట్లోనే చంపేయటం ద్వారా ఈ తరం ఇబ్బందులు పడుతోందని.. భవిష్యత్ తరాలకోసం పెను ప్రమాదాన్ని స్వాగతిస్తున్నట్లేనన్నారు. ప్రభుత్వాలు ఇచ్చే బడ్జెట్‌తోనే ఈ సమస్యకు పరిష్కారం దొరకదని.. బాలికలకు సరైన విద్యనందించటం, విస్తృత ప్రచారం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావటం అత్యంత అవసరమన్నారు. తక్కువకాలంలో ఈ దిశగా భారీ మార్పును సాధించలేమని ఇప్పటినుంచే ప్రచారం ప్రారంభిస్తే సమాజంనుంచి ఈ చెడు సంప్రదాయం తొలగిపోయేందుకు ఐదారు తరాలు పడుతుందన్నారు. పౌష్టికాహార ఆవశ్యకతను, మిషన్ ఇంద్రధనుష్ (జాతీయ వ్యాధినిరోధక కార్యక్రమం) ద్వారా చిన్నారులు, మహిళల్లో వస్తున్న సానుకూల మార్పునూ మోదీ వివరిం చారు. అంతకుముందు, కలెక్టర్లతో సంభాషించిన మోదీ.. బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న కలెక్టర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీ, కర్ణాటక, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, సిక్కిం, గుజరాత్, హరియాణా, కశ్మీర్ రాష్ట్రాలకు చెందిన కలెక్టర్లు అవార్డులు అందుకున్నారు.

కున్వర్‌బాయిను గుర్తుచేసుకున్న మోదీ

కొందరు మహిళలు మార్గదర్శకమైన కార్యక్రమాల ద్వారా దేశ చరిత్రలో తమ స్థానాన్ని పదిలం చేసుకున్నారని మోదీ పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌కు స్ఫూర్తిగా నిలిచిన దివంగత కున్వర్‌బాయిను గుర్తుచేసుకున్నారు. షి ఇన్‌స్పైర్ మి హ్యాష్‌ట్యాగ్‌తో గురువారం ప్రధాని పలు ట్వీట్లు చేశారు. 'ఈ ఏడాది ఆరంభంలో కన్నుమూసిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 106 ఏళ్ల కున్వర్‌బాయి జీవితం స్ఫూర్తిదాయకం. ఆమెకున్న మేకలు అమ్మి తన ఇంట్లో రెండు మరుగుదొడ్లు నిర్మించారు. స్వచ్ఛ భారత్‌లో ఆమె భాగస్వామ్యం మరువలేనిది. ఆమెనుంచి ఆశీర్వాదం తీసుకున్న రోజును ఎన్నటికీ మరవబోను' అన్నారు.

కొద్దిసేపు చర్చ.. ఆపై రసాభాస

- మహిళా సాధికారతపై రాజ్యసభలో ఏకతాటిపైకి పార్టీలు
- రాజ్యసభలో గంటసేపు చర్చ.. అనంతరం ఆందోళన



రాజ్యసభలో ప్రసంగిస్తున్న మహిళా ఎంపీలు సుష్మా స్వరాజ్, అంబికా సోని, రేణుకా చౌదరి, విప్లవ్ ఠాకూర్ (పై వరస), సీతారామ లక్ష్మి, సెల్జా, కనిమొళి, వాన్‌సుక్ సయిమ్

న్యూఢిల్లీ: గత మూడు రోజులకు భిన్నంగా పార్లమెంటు ఉభయ సభల్లో గురువారం కొద్ది సేపు ప్రశాంత వాతావరణం కనిపించింది. ఉదయం సభా కార్యకలాపాలు ప్రారంభం కాగానే రాజ్యసభలో పార్టీలకు అతీతంగా సభ్యులంతా ఏకతాటిపై నిలిచారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మహిళా సాధికారత, మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై సభ్యులు తమ వాణి వినిపించారు.

లైంగిక దాడుల పట్ల ప్రతిపక్షం ఆందోళన

రాజ్యసభ ఉదయం సమావేశం కాగానే.. మహిళల అంశాలపై దాదాపు గంటపాటు చర్చ సాగింది. మహిళలపై పెరుగుతున్న నేరాల పట్ల సభ్యులు ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు.. మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని కోరారు. చర్చను చైర్మన్ వెంకయ్య ప్రారంభిస్తూ.. ' జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు.. పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీల్లో రిజర్వేషన్లతో పాటు దేశం వేగంగా పురోగమించేందుకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరముంది' అని అన్నారు. అనంతరం వివిధ పార్టీల మహిళా ఎంపీలు ప్రసంగించారు.


ప్రధాని సమాధానానికి కాంగ్రెస్ పట్టు

అనంతరం చర్చ పూర్తి కాగానే విపక్షాలు నిరసన కొనసాగించాయి. బ్యాంకింగ్ కుంభకోణాలు, ఏపీకి ప్రత్యేక హోదా అంశాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభను హోరెత్తించాయి. ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు అన్నాడీఎంకే సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రతిపక్షాల తీరుపై వెంకయ్య అసహనం వ్యక్తం చేస్తూ.. సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదావేశారు. అనంతరం సమావేశమయ్యాక బ్యాంకింగ్ కుంభకోణాలపై ప్రధాని సమాధానం కోరుతూ కాంగ్రెస్, టీఎంసీ ఎంపీలతో పాటు ఇతర అంశాలపై ప్రాంతీయ పార్టీలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ శుక్రవారానికి వాయిదా వేశారు.

రెట్టించిన ఉత్సాహంతో ముందడుగు

లోక్‌సభ ఉదయం సమావేశం కాగానే స్పీకర్ మహాజన్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ..రెట్టించిన శక్తి, ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత ఎంతో అవసరమని... అయితే దాన్ని సాధించడమే అతి పెద్ద సవాలన్నారు. స్పీకర్ ప్రసంగం ముగియగానే.. విపక్షాలు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన కొనసాగించాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే పార్టీ ఎంపీల ఆందోళన కొనసాగించడంతో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. అనంతరం సభ మళ్లీ సమావేశమైనా.. అదే పరిస్థితి ఉండడంతో శుక్రవారానికి వాయిదా పడింది.

నాగా సీఎంగా రియో ప్రమాణం



కోహిమా: నాగాలాండ్ ముఖ్యమంత్రిగా నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ నేత నీఫియు రియో బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఆ రాష్ట్ర గవర్నర్ ఆచార్య.. రియోతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత పాట్టూన్ ప్రమాణం చేశారు. వీరుకాక మరో 10 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీతో కలసి పీపుల్స్ డెమొక్రటిక్ అలయన్స్ ప్రభుత్వాన్ని రియో ఏర్పాటు చేశారు. మార్చి 16 లోగా అసెంబ్లీలో తన బలం నిరూపించుకోవాలని రియోను గవర్నర్ కోరారు. నాగా సీఎంగా రియో బాధ్యతలు చేపట్టడం ఇది నాలుగోసారి. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కిరెణ్ రిజిజు, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌తోపాటు తాజా మాజీ ముఖ్యమంత్రి జెలియాంగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. మరోవైపు, త్రిపురలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం శుక్రవారం కొలువుదీరనుంది. త్రిపుర కొత్త సీఎంగా బిప్లబ్ కుమార్ డేబ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే పలువురు మంత్రులు కూడా ప్రమాణం చేయనున్నారు.

కొనసాగుతున్న 'విగ్రహ' కాండ

యూపీలో ఆంజనేయుడి విగ్రహం పాక్షిక ధ్వంసం

చెన్నై/కన్నూర్/లక్నో: దేశవ్యాప్తంగా విగ్రహాల ధ్వంసకాండ కొనసాగుతోంది. లెనిన్, పెరియార్, శ్యామాప్రసాద్ ముఖర్జీ, అంబేడ్కర్ విగ్రహాలపై వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఘటనలపై ఆగ్రహం వ్యక్తమవుతుండగానే కేరళలోని కన్నూర్‌లో గాంధీ విగ్రహానికి నల్లరంగు పూశారు. ఈ ఘటనలో గాంధీ కళ్లద్దాలు పగిలిపోయాయి. చెన్నైలోని తిరువొత్తియూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నల్లరంగు పూశారు. ఈ ఘటనను తమిళనాడు సీఎం పళనిస్వామి ఖండించారు.నిందితులను పట్టుకునేందుకు పోలీసు శాఖ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసింది. అటు, యూపీలోని బలియా జిల్లాలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయటం ఉద్రిక్తతకు దారితీసింది. విగ్రహాల ధ్వంసానికి పాల్పడుతూ.. సమాజంలో శాంతి సామరస్యాలకు భంగం కలిగిస్తున్న వారిపై దేశద్రోహం కేసులు నమోదుచేయాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు.

బాల్యం శిథిలం

పసివాళ్ల నెత్తుటితో తడుస్తున్న సిరియా

రెండు నెలల వ్యవధిలో ప్రాణాలొదిలిన 342 మంది చిన్నారులు



ఘూటాలోని ఓ ఆసుపత్రిలో వైద్యం కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

డమాస్కస్: ఒక్క దృశ్యం గుండెల్ని పిండేసింది. కరడు గట్టిన హృదయాల్ని కరిగించింది. సిరియాలో అంతర్యుద్ధం ముక్కుపచ్చలారని బాల్యాన్ని ఎలా ఛిద్రం చేస్తోందో ఒక్క చిత్రంతో తెలుసుకున్న ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. 2011 నుంచి అంతర్యుద్ధంతో అతలాకుతలమైపోతున్న సిరియా నుంచి పొట్ట చేత్తో పట్టుకొని ఎన్నో కుటుంబాలు వివిధ దేశాలకు వలస వెళ్లిపోతున్నాయి. సరిగ్గా మూడేళ్ల క్రితం అలా యూరప్‌కు పడవలో వెళుతూ ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకొని టర్కీ బీచ్‌లోకి కొట్టుకొని వచ్చిన మూడేళ్ల చిన్నారి అలన్ కుర్దీ నిర్జీవంగా పడి ఉండటాన్ని చూసి ప్రపంచమే కన్నీరు పెట్టింది. నీలం రంగు ప్యాంటు, ఎర్ర షర్టు వేసుకొని ఇసుక మేటల్లో విగతజీవిగా పడిఉన్న ఆ బాలుడి చిత్రం ఇప్పటికీ ఎందరినో వెంటాడుతోంది. సిరియాలో పువ్వులాంటి బాల్యం ఆధిపత్య పోరులో ఇంకా నలిగిపోతూనే ఉంది. పసివాళ్ల నెత్తుటితో నేలను తడిపేస్తున్నారు. బాంబుల మోతలు, క్షిపణుల గర్జనల మధ్య చిన్నారుల ఏడుపులు, వారి తల్లిదండ్రుల ఆక్రందనలు గాల్లో కలిసిపోతున్నాయి. బాల్యం రక్తమోడుతున్న ఎన్నో దృశ్యాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

క్షిపణి దాడులతో ఘూటా విధ్వంసం..

సిరియా రాజధాని డమాస్కస్‌కు సమీపంలో తిరుగుబాటుల అధీనంలో ఉన్న తూర్పు ఘూటా ప్రాంతాన్ని తిరిగి వశం చేసుకోవడానికి ప్రభుత్వ నేతృత్వంలోని సైనికులు చేస్తున్న దాడులు, తిరుగుబాటుదారుల ప్రతిదాడులు ఏ పాపం తెలీని పసివాళ్ల ఉసురు తీస్తున్నాయి. ఘూటాలో దాదాపుగా నాలుగు లక్షల మంది జనాభా ఉంటే..అందులో మూడో వంతు మంది చిన్నారులే. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయాలన్న తీర్మానాన్ని సిరియా ప్రభుత్వం అటకెక్కించింది. సిరియా ప్రభుత్వ సైన్యం, దానికి మద్దతుగా రష్యా సైన్యం జరుపుతున్న వైమానిక దాడుల్లో గత రెండు నెలల్లోనే 342 మంది పసివాళ్లు ప్రాణాలు కోల్పోగా, 803 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షిపణి దాడులతో శిథిల భవనాల కింద నలిగిపోతున్న చిన్నారుల్ని చూసి నెటిజన్లు చలించిపోతున్నారు. ప్రే ఫర్ సిరియా హ్యాష్ ట్యాగ్‌తో గాయపడిన పసివాళ్ల ఫోటోలను షేర్ చేస్తూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఐక్యరాజ్య సమితి సేకరించిన వివరాల ప్రకారం.. సిరియాలో ఆపన్న హస్తం కోసం 86 లక్షల మంది బాలలు ఎదురుచూస్తున్నారు. శరణార్థి శిబిరాల్లో సుమారు 30 లక్షల మంది పిల్లలు ఆవాసం పొందుతున్నారు. 28 లక్షల మంది చిన్నారులు బడి ముఖం కూడా చూడటం లేదు. కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేక గడ్డకట్టే చలిలో వేలాది మంది పిల్లలు వణికిపోతూ కాలం గడుపుతున్నారు. రసాయన దాడులకు గురై వేల మంది చిన్నారులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు. యూనిసెఫ్‌కు చెందిన 200 మందికి పైగా సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెడుతూ సిరియా చిన్నారుల్ని కాపాడటానికి తమ వంతు శ్రమిస్తున్నారు.

శిబిరాల్లో 30 లక్షల మంది

- సిరియాలో రెండు నెలల్లో ప్రాణాలు కోల్పోయిన 342 మంది చిన్నారులు
- 803 మంది పసివాళ్లకు తీవ్ర గాయాలు
- ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న బాలలు 86 లక్షలు
- శరణార్థి శిబిరాల్లో ఉన్న చిన్నారులు 30 లక్షలు
- బడి ముఖం కూడా చూడని బాలలు 28 లక్షలు

సీఎంకు మన గోస పట్టదు

ఓయూ సదస్సులో కోదండరాం

హైదరాబాద్: సీఎం కేసీఆర్‌కు మన గోసపట్టదని, తను చేసేదే సరైందనుకుంటున్నారని రాజకీయ జేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన 'మిలియన్‌మార్చ్ స్ఫూర్తి – ఉద్యమ ఆకాంక్షల సాధనకు విద్యార్థి, నిరుద్యోగ మేధోమథన సదస్సు'కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగాల భర్తీ అద్దంలో మిఠాయిలా కన్పిస్తోందని, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిలియన్ మార్చ్‌ను స్మరించుకుంటు భవిష్యత్తు ఉద్యమ స్ఫూర్తి కోసం ఈ నెల 10న ట్యాంక్‌బండ్‌పై జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్, ఓయూ అధ్యాపకుడు ఇటికాల పురుషోత్తం, ఐక్య విద్యార్థి సంఘాల నేతలు నిజ్జన రమేశ్ ముదిరాజ్, సయ్యద్ సలీంపాషా, కల్వకుర్తి ఆంజనేయులు పాల్గొన్నారు.

✦ మాదిగలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

సీఎం కేసీఆర్‌కు వంగపల్లి విజ్ఞప్తి

హైదరాబాద్: మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు ఈ నెల 12వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఆత్మబలిదానం చేసిన భారతి కుటుంబానికి రూ.25 లక్షలు అందిస్తానని, అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని చెప్పిన కేసీఆర్ మాట నిలుపుకోలేదని గురువారం అన్నారు. 'డప్పు, చెప్పు'కు 2 వేల పింఛన్ ఇస్తామని, ఎస్సీ సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయిస్తామని, దళితులకు మూడెకరాల భూమిని ఇస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న ఉస్మానియా యూనివర్సిటీలో సభ పెట్టి మాదిగ సత్తా చాటుతామని తెలిపారు. సమావేశంలో బెడ, బుడిగ జంగాల హక్కులదండు వ్యవస్థాపక అధ్యక్షుడు తూర్పాటి హనుమంత్, మాదిగ ఉపకులాల అధ్యక్షులు మురళి, కొల్లూరి వెంకట్, రమేశ్, శ్యామ్‌రావు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

✦ 'బంద్ ఢిల్లీలో చేయకుండా రాష్ట్రంలోనా?'

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం ఢిల్లీలో బంద్ చేయకుండా రాష్ట్రంలో చేయడమేంటని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ప్రశ్నించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 13న ఎమ్మార్పీఎస్ నిర్వహించనున్న బంద్‌పై పునఃసమీక్షించాలన్నారు. వర్గీకరణ కోసం రాష్ట్రంలోని రాజకీయపార్టీలు, సంఘాలు మద్దతిచ్చినా కేంద్ర ప్రభుత్వం బిల్లు పెట్టకుంటే ఇక్కడ బంద్‌కు మద్దతు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. మంద కృష్ణకు చేతనైతే ఢిల్లీలో బంద్ చేయాలని సవాల్ చేశారు.

✦ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే


సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మతోన్మాదంతో దేశాన్ని అరాచకమయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా లెనిన్ విగ్రహాలను కూల్చివేయడం బీజేపీ, మతోన్మాద శక్తుల ఫాసిస్టు చర్యలకు పరాకాష్ట అన్నారు. ఏప్రిల్ 1–4వ తేదీల మధ్య జరిగే సీపీఐ రాష్ట్ర సమితి మహాసభల కోసం చేపట్టిన సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. అసహనం, మూర్ఖత్వానికి నిదర్శనమే విగ్రహాల కూల్చివేత అని అన్నారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరుల విగ్రహాలు బ్రిటన్, అమెరికా, దక్షిణాఫ్రికా దేశాల్లో ఉన్నాయని గుర్తుచేశారు.

✦ బడ్జెట్ సమావేశాల భద్రతపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల సమయంలో భద్రతపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, మండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ ఆదేశించారు. అసెంబ్లీ పరిసరాల్లో తీసుకోవాల్సిన చర్యలు, సమావేశాల సమయంలో జరిగే ఉత్సవాలు, సభ్యుల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా అనుసరించాల్సిన వ్యూహంపై గురువారం సమీక్షించారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ మారుతున్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. మండలి వైస్ చైర్మన్ విద్యాసాగర్, ప్రభుత్వ సీఎస్ ఎస్.కె.జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, జీఏడీ అధికారులు, సమీక్షలో పాల్గొన్నారు.

107వ రోజు
08–03–2018,
గురువారం
వేటపాలెం, ప్రకాశం జిల్లా



గంధపు చెట్లను కాపాడతానని గజదొంగ వీరప్పనే ముందుకొచ్చినట్టుంది..

కేంద్ర, రాష్ట్ర తాజా పరిణామాలు.. చంద్రబాబు హైడ్రామా ఆశ్చర్యం కలిగిస్తోంది. వరుస ఘటనలు చూస్తుంటే.. దిగజారుడు రాజకీయానికి చంద్రబాబు మరోసారి తెరతీశాడనేది సుస్పష్టం. హోదా కోసం వెల్లువెత్తే ప్రజాగ్రహం ఎక్కడ దహించి వేస్తుందోననే భయం ఆయనలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రత్యేక హోదా ఇవ్వం అని, ప్యాకేజీనే ఇస్తామని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఆయనకు ఇప్పుడేదో కొత్తగా చెప్పినట్టు.. దీంతో బీజేపీతో తెగతెంపులకు సిద్ధమైనట్టు టీడీపీ అధినేత తికమక రాజకీయాలను రక్తికట్టిస్తున్నారు. నిజంగా చంద్రబాబు నైజాన్ని చూస్తే.. ఊసరవెల్లి కూడా సిగ్గుతో తల దించుకుంటుందేమో! అంతులేని మోసాలకు, అడ్డూ అదుపూ లేని అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన చంద్రబాబుతో దేశంలో మరెవ్వరూ పోటీపడలేరేమో! ఆయనేంటో, ఆయన డ్రామాలేంటో.. నాలుగేళ్లుగా జనానికి తెలిసిపోయింది. ప్రత్యేక హోదాను ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెట్టిన వంచనను జనం అర్థంచేసుకున్నారు. ప్యాకేజీతో కమీషన్లు బాగా వస్తాయని ప్యాకేజీకి సై అని, ఓటుకు కోట్లు కేసులో ఆడియో, వీడియో టేపులతో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు కేంద్రం ముందు ఎలా సాగిలపడిందీ గమనిస్తూనే ఉన్నారు. ప్రత్యేక హోదాపై పూటకో మాట మార్చడాన్ని నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నారు. ఎన్నికలప్పుడు రాష్ట్రానికి హోదానే సంజీవని అంటాడు.. అధికారంలోకి రావడంతోనే నాలుక తిప్పేస్తాడు. హోదా ఏమైనా సంజీవనా? అంటాడు.. లేని ప్యాకేజీని చూపిస్తూ.. ప్యాకేజీనే మేలంటూ గొప్పగా చెబుతాడు. ప్యాకేజీ ప్రకటించిన జైట్లీని పొగడ్తలతో ఆకాశానికెత్తేస్తాడు. జైట్లీకి, వెంకయ్యకు సన్మానాలు, సత్కారాలు చేస్తాడు. నాలుగేళ్ల బీజేపీతో అంటకాగి, అవినీతితో కోట్లు కొల్లగొట్టి, హోదాకు సమాధి కట్టేందుకు ప్రయత్నించిన చరిత్ర చంద్రబాబుదే! ఆయనే ఇప్పుడు హోదా కోసం పోరాటం చేస్తానంటే నయవంచన కాక ఇంకేంటి? గజదొంగ వీరప్పనే గంధపు చెట్లను కాపాడతానని ముందుకొచ్చినట్టుగా ఉంది చంద్రబాబు వైఖరి.

హోదా సాధించాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే నమ్మకమైన పార్టీ అని జనం విశ్వసిస్తున్నారు. చేయి చేయి కలిపి ముందుకొస్తున్నారు. విద్యార్థి, యువజన, మహిళా లోకం ఏకమై కదలడంతో ఉద్యమం తారస్థాయికి చేరింది. జన నినాదంలో ఎక్కడ కొట్టుకుపోతామోనన్న భయం చంద్రబాబులో మొదలైంది. అందుకే హఠాత్తుగా కేంద్ర మంత్రులచే నామమాత్రపు రాజీనామాలతో కొత్త నాటకం మొదలు పెట్టాడు. ఇన్నాళ్లూ డ్రామాలాడినా ఇకపై ప్రతిష్టకు పోకుండా అవిశ్వాసానికి మద్దతిస్తారని, ఆ తర్వాత రాజీనామాలకు సహకరిస్తారని ఆశిస్తున్నా.

మీడియా సమావేశం ముగించుకుని బయటకొచ్చిన నన్ను అప్పటికే ఎదురుచూస్తున్న అక్క చెల్లెమ్మలు ఆప్యాయంగా పలకరించారు. 'మహిళా దినోత్సవం' సందర్భంగా సోదర ప్రేమను పంచారు. కలువ పూలతో స్వాగతం పలికారు. వాళ్లందరి మధ్య మహిళా దినోత్సవం జరుపుకోవడం నిజంగా నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం అన్నారు.. జాతీయ రాజకీయాల్లో దేశంలోనే అత్యంత సీనియర్‌ని అన్నారు.. ఎంతోమందిని ప్రధానుల్ని, రాష్ట్రపతుల్ని చేసిన ఘనుడనన్నారు. అంతటి వ్యక్తి.. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయించుకోలేకపోయారు? 29 సార్లు ఢిల్లీ పర్యటన చేశానంటున్నారు.. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ పర్యటన ఉద్దేశాన్ని మీడియాకు వెల్లడించారు. ఏ ఒక్కసారైనా 'హోదా కోసం ఢిల్లీకి వచ్చాను.. ఢిల్లీ పెద్దలతో హోదా విషయం చర్చించాను' అన్న సందర్భం ఉందా? మీ భాగస్వాములైన బీజేపీ నేతలు.. మీరు ఒక్కసారి కూడా హోదా విషయం ప్రస్తావించలేదంటున్నారు. ఏం సమాధానం చెబుతారు? మీ 29 ఢిల్లీ పర్యటనలు ఏం లాభం ఆశించి చేశారు?

నీటి వాటాపై కొత్త లొల్లి..!

సాగర్, శ్రీశైలంలో కనీస నీటిమట్టాలకు ఎగువన 36:64 నిష్పత్తిన నీటిని పంచిన కృష్ణా బోర్డు

- ఎండీడీఎల్ దిగువన తాగునీటికే అయినందున నీటి నిష్పత్తి మార్చాలంటున్న తెలంగాణ
- తెలంగాణకు 69 శాతం, ఏపీకి 31 శాతం దక్కుతుందని వాదన
- సాగర్‌లో 500, శ్రీశైలంలో 800 అడుగుల్లో 41.23 టీఎంసీల నీటి లభ్యత ఉందని బోర్డు అంచనా



సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో కనీస నీటిమట్టాలకు దిగువన వాడుకునే నీటి వాటాలపై లొల్లి మొదలైంది. కనీస నీటిమట్టానికి(ఎండీడీఎల్) ఎగువన ఉన్న నీటి పంపకాల విషయంలో ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అంగీకరించిన 36:64 నిష్పత్తిని, ఎండీడీఎల్ దిగువకు వెళ్లి తీసుకునే నీటి విషయంలో మార్చాల్సిన అవసరాన్ని తెలంగాణ పట్టుబడుతుండటంతో వివాదం ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటా నిష్పత్తిని మార్చాలంటున్న తెలంగాణ వినతిని బోర్డు, ఏపీ వ్యతిరేకించే అవకాశాల నేపథ్యంలో వివాదం ఏ తీరానికి చేరుతుందన్నది ఆసక్తిగా మారింది. రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన అవగాహన మేరకు ప్రస్తుత ఏడాదిలో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో ఎండీడీఎల్‌కు ఎగువన ఉన్న లభ్యత నీటిని ఏపీ 66 శాతం, తెలంగాణ 34 శాతం వాటా పద్ధతిన వాడుకుంటున్నాయి. ప్రస్తుతం శ్రీశైలంలో కనీస నీటిమట్టం 834 అడుగులకు ఎగువన 6.73 టీఎంసీలు, సాగర్‌లో కనీస నీటిమట్టం 510 అడుగులకు ఎగువన 18.70 టీఎంసీలు కలిపి 25.73 టీఎంసీలు లభ్యతగా ఉన్నాయి. ఈ నీటిని నిర్ణయించిన దామాషా పద్ధతినే ఇరు రాష్ట్రాలకు బోర్డు పంచింది. అయితే కనీస నీటిమట్టాలకు దిగువన నీటినీ ఇదే రీతిన రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా పంచుతామనే సంకేతాలిచ్చింది. ఇక్కడే సమస్య తలెత్తుతోంది. ఎండీడీఎల్ ఎగువన సాగు అవసరాలను దృష్టిలో పెట్టుకుని వాటాలు నిర్ణయించగా, దిగువన నీటిని తాగు అవసరాలకే వినియోగించాలని తెలంగాణ చెబుతోంది. బచావత్ అవార్డు ప్రకారం, తాగునీటి అవసరాలకు జరిగిన కేటాయింపుల్లో చెన్నై, హైదరాబాద్ మహా నగర తాగునీటి అవసరాలను పొందుపరిచారు. ఇందులో చెన్నై తాగునీటికి కావాల్సిన 15 టీఎంసీల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మధ్య 5 టీఎంసీల చొప్పున వాటా కేటాయించారు. ఈ 5 టీఎంసీల్లో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతీయ వాటాలుగానూ విభజించారు. దీని ప్రకారం ఒక్కో ప్రాంతానికి సుమారుగా 1.7 టీఎంసీల వాటా వచ్చింది. హైదరాబాద్ తాగునీటికి 16.5 టీఎంసీలను కేటాయించారు. వీటిని పరిగణనలోనికి తీసుకుని లెక్కిస్తే ఏపీకి తాగునీటి పరంగా 31 శాతం, తెలంగాణకు 69 శాతంగా వాటా తేలుతుందని తెలంగాణ నీటి పారుదల వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ ప్రకారం ప్రస్తుతం ఎండీడీఎల్ దిగువన లభ్యతగా ఉన్న నీటిని పంచాలని కోరుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలంలో కనీస నీటి మట్టాలకు దిగువన 800 అడుగులు, సాగర్‌లో 500 అడుగుల దిగువకు వెళ్లి నీటిని తీసుకోవాలని బోర్డు సమక్షంలో ఇరు రాష్ట్రాలు నిర్ణయించాయి. ఈ మట్టాల్లో నీటి లభ్యత 41.23 టీఎంసీలుగా ఉంది ఈ నీటిని తెలంగాణకు 69 శాతం, ఏపీకి 31 శాతం నిష్పత్తిన పంచితే తెలంగాణకు 28.23 టీఎంసీ, ఏపీకి 13 టీఎంసీల మేర దక్కుతాయని తెలంగాణ స్పష్టం చేస్తోంది.

ఏపీకి 30.. తెలంగాణకు 45

శ్రీశైలం, సాగర్‌లో ఎండీడీఎల్ దిగువన నిర్ణయించిన మట్టాల్లో 41.23 టీఎంసీల లభ్యత ఉందంటూ కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం గురువారం ఇరు రాష్ట్రాలకు లేఖలు రాశారు. ఎండీడీఎల్ ఎగువన ఉన్న నీటిని కలుపుకుని వాటా ప్రకారం తెలంగాణకు 45 టీఎంసీలు, ఏపీ 30 టీఎంసీల నీరు ఆగస్టు వరకు తాగు, సాగు అవసరాలకు దక్కుతాయని తెలిపారు. ఎండీడీఎల్ దిగువన తాగునీటి అవసరాలను పేర్కొంటూ తమకు ఇండెంట్‌లు సమర్పిస్తే అందుకు అనుగుణంగా నీటి విడుదలకు ఆదేశాలు ఇస్తామని లేఖలో స్పష్టం చేశారు.

'రాజ్యసభ' ఎవరికి?

అంతుచిక్కని టీఆర్‌ఎస్ అధినేత అంతరంగం

- సన్నిహితులతోనూ చర్చకు దూరంగా కేసీఆర్
- మూడు రాజ్యసభ స్థానాలకు జరుగనున్న ఎన్నికలు
- సంతోష్‌కు ఖాయమేనంటున్న పార్టీ వర్గాలు
- యాదవ వర్గంలోనూ పెరుగుతున్న పోటీ
- సామాజికవర్గాల కూర్పుతోనే మూడో స్థానానికి నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. ఎవరికి అవకాశం దక్కుతుందన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ మూడు స్థానాలూ టీఆర్‌ఎస్‌కే దక్కనున్న నేపథ్యంలో పార్టీలోని ఆశావహులు, ముఖ్య నేతలు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఎన్నికలకు ఈ నెల 12వ తేదీతో నామినేషన్ల గడువు కూడా ముగియనుంది. అయినా ఎవరికి అవకాశం దక్కుతుందన్నది స్పష్టంగా తేలలేదు. ఈ విషయంలో కేసీఆర్ అంతరంగం ఏమిటన్నది సన్నిహితులకు సైతం అంతుచిక్కడం లేదని, కేసీఆర్ ఎవరితోనూ మాట మాత్రంగానైనా ప్రస్తావించడం లేదని టీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

సంతోష్‌కు ఖాయమే!

కేసీఆర్ సమీప బంధువు, పార్టీ ప్రధాన కార్యదర్శి జె.సంతోష్‌కుమార్‌కు రాజ్యసభ అవకాశం ఖాయమని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఆయన 15 ఏళ్లుగా కేసీఆర్‌కు తోడుగా ఉన్నారని.. ఉద్యమకాలంలో, అధికారంలోకి వచ్చాక కూడా కేసీఆర్‌కు వ్యక్తిగతంగా, రాజకీయంగా పూర్తికాలం సేవ చేస్తున్నారని పేర్కొంటున్నాయి. పార్టీలో, కుటుంబంలో అన్నివర్గాలకు అందుబాటులో ఉంటున్న సంతోష్‌కుమార్‌కు రాజ్యసభ అవకాశం ఖాయమేనని అంటున్నాయి. అయితే సార్వత్రిక ఎన్నికలకు ఇంకా ఏడాది సమయమే ఉన్న సమయంలో.. సామాజిక సమతూకం, దీర్ఘకాలిక ప్రయోజనాలు వంటి వాటిని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ తుది నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నాయి.

యాదవ వర్గంలో పెరిగిన పోటీ

యాదవ సామాజికవర్గానికి చెందిన నేతకు రాజ్యసభ అవకాశం కల్పిస్తామని సీఎం కేసీఆర్ పలుమార్లు ప్రకటించారు. దీంతో తాజా ఎన్నిక కోసం యాదవ సామాజికవర్గ నేతలు రంగంలోకి దిగుతున్నారు. పార్టీకోసం పనిచేసిన పలువురు యాదవ నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.జైపాల్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్ కె.రాజయ్య యాదవ్‌ల పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీకోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఎడ్ల హరిబాబు యాదవ్ కూడా ఇటీవల సీఎం కేసీఆర్‌ను కలిసి తనకు రాజ్యసభ అవకాశమివ్వాలని కోరారు. అఖిల భారత యాదవ మహాసభ కూడా ఎడ్ల హరిబాబుకు అవకాశం ఇవ్వాలని కోరింది. ఇక బడుగుల లింగయ్య యాదవ్ కూడా రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశిస్తున్నారు. మరోవైపు కురుమలకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దేవరి మల్లప్ప కోరుతున్నారు. పార్టీకోసం నిత్యం కృషి చేసిన, ఏ బాధ్యతలను అప్పగించినా నమ్మకంగా పనిచేసిన తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ, టీజీవోల నేత కృష్ణ యాదవ్ కూడా రాజ్యసభ సభ్యత్వం ఆశతో ఉన్నారు.

సామాజిక సమీకరణాలపైనే మూడో సీటు!

మూడో రాజ్యసభ సీటు ఎవరికి దక్కుతుందనేది ఇప్పటివరకు ఎవరి అంచనాలకూ అందడం లేదు. బీసీల్లో జనాభా ఎక్కువగా ఉన్న ముదిరాజ్‌లకుగానీ, మైనారిటీలకుగానీ వచ్చే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలకు జరిగితే.. బలమైన రెడ్డి సామాజికవర్గానికి అవకాశం ఇవ్వకుండా ఎలాగని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. మైనారిటీలకు అవకాశం వస్తే మహబూబ్ ఆలంఖాన్, ఎంఏ బేగ్ (ఖమ్మం)ల పేర్లు వినిపిస్తున్నాయి. అటు ముదిరాజ్, రెడ్డి సామాజికవర్గాలకు సంబంధించి కేసీఆర్ మదిలో ఎవరి పేర్లు ఉన్నాయనేది తేలడం లేదు. మొత్తంగా 12వ తేదీ నాటికి మూడు స్థానాలు ఎవరికి దక్కుతాయన్నది తేలనుంది.

రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా గుత్తా

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు సమన్వయ సమితిని లాభాపేక్షలేని సంస్థ(కార్పొరేషన్)గా నమోదు చేసినట్లు ఉత్తర్వులో పేర్కొంది. రైతు సమన్వయ సమితిలో ఐదుగురిని డైరెక్టర్లుగా నియమించారు. గుత్తా సుఖేందర్ రెడ్డి డైరెక్టర్, చైర్మన్ హోదాలో ఉంటారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం.జగన్‌మోహన్‌ను రైతు సమన్వయ సమితి ఎండీగా, ఉద్యాన శాఖ డైరెక్టర్ ఎల్.వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సి.హెచ్.వి.సాయిప్రసాద్‌ను రైతు సమన్వయ సమితి డైరెక్టర్లుగా నియమించారు. నియామక ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, విధి విధానాలను త్వరలో ఖరారు చేస్తామని తెలిపారు. జిల్లా రైతు సమన్వయ సమితిల నుంచి రాష్ట్ర స్థాయిలో సభ్యులుగా ఎవరిని నియమిస్తారనే విషయాన్ని ఉత్తర్వులో పేర్కొనలేదు.

12న బాధ్యతల స్వీకరణ

రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా నియమితులైన గుత్తా సుఖేందర్‌రెడ్డి మార్చి 12న బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ ఆవరణలో రైతు సమన్వయ సమితి చైర్మన్ కోసం ప్రత్యేకంగా కార్యాలయాన్ని సిద్ధం చేశారు.

ఉద్యోగం ఇక్కడ.. విరమణ అక్కడ

ఏపీకి వెళ్లాలంటూ పలువురు అధికారులకు ప్రభుత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లవుతున్నా పోలీస్ శాఖలో మాత్రం ఉద్యోగుల విభజన పెండింగ్‌లోనే ఉంది. డీఎస్పీ, ఆపై స్థాయి అధికారుల విభజన పూర్తికాకపోవడంతో.. తెలంగాణ స్థానికతగా ఉండి కీలక హోదాలో ఇక్కడ పనిచేస్తున్న పలువురు అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో పదవీ విరమణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రెండ్రోజుల కింద ఆదేశాలిచ్చింది. ఈ వ్యవహారం ఇప్పుడు పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. సూర్యాపేట ఎస్పీగా పనిచేస్తున్న ప్రకాశ్ జాదవ్ స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా.. అయితే ఆయన నాన్ క్యాడర్ ఎస్పీ హోదాలో ఉన్నారు. విభజనలో భాగంగా ఆయనను తాత్కాలిక కేటాయింపు కింద ఏపీకి కేటాయించారు. ఎస్పీ హోదాలో పనిచేస్తున్న మధు, వనస్థలిపురం ఏసీపీగా పనిచేస్తున్న రవీందర్‌రెడ్డి కూడా తాత్కాలిక కేటాయింపుల్లో ఏపీకి అలాట్ అయ్యారు. ఈ ముగ్గురిలో ప్రస్తుతం మధు గత నెలాఖరులో పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఏపీకి అలాటైన అధికారులకు తెలంగాణలో పదవీ విరమణ చేసే అధికారం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో వీరు ఏపీకి వెళ్లిపోవాలని సూచిస్తూ పోలీస్ శాఖ ఆదేశాలిచ్చింది. ప్రకాశ్ జాదవ్, రవీందర్‌రెడ్డికి ఇంకా సర్వీసు ఉంది. మధు మాత్రం పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఇంకా చేయలేదు. దీంతో జీతభత్యాలు ఏ రాష్ట్ర పోలీస్ శాఖ చెల్లించాలన్న దానిపై సందిగ్ధం ఏర్పడింది. త్వరలోనే జాదవ్, రవీందర్‌రెడ్డి ఏపీలో రిపోర్టు చేయనున్నట్టు పోలీస్ శాఖ తెలిపింది.

ఎంబీసీలకు రాయితీ పెంపు

యూనిట్‌కు రూ.లక్ష నుంచి 12 లక్షల వరకు రుణం

సాక్షి, హైదరాబాద్: అత్యంత వెనుకబడిన తరగతులకు (ఎంబీసీ) ఇచ్చే రుణ సాయం, సబ్సిడీలను పెంచాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. స్వయం ఉపాధి పథకాలకు అందించే ఆర్థిక సహకారాన్ని మరింతగా పెంచాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే విధంగానే ఎంబీసీలకు సబ్సిడీలు ఇవ్వాలన్నారు. బీసీలకు అమలు చేసే ఎకనామిక్ సపోర్టు స్కీమ్‌కు ఇప్పటివరకు రూ.లక్షకు 60 శాతం (రూ.60 వేలు) సబ్సిడీ ఇచ్చేవారు. అది సరిపోదని, మరింత పెంచాల్సిన అవసరముందని సీఎం పేర్కొన్నారు. మరోవైపు యూనిట్లకు అందించే రుణ సాయాన్ని రూ.లక్ష నుంచి రూ.12 లక్షల వరకు అందించాలన్నారు. రూ.లక్ష యూనిట్‌కు ఇకపై రూ.80 వేలు (80 శాతం), రూ.2 లక్షల యూనిట్‌కు రూ.1.40 లక్షలు (70 శాతం), రూ.2 లక్షల నుంచి రూ.12 లక్షల యూనిట్‌కు గరిష్టంగా రూ.5 లక్షలు (60 శాతం) సబ్సిడీ ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు ఎంబీసీలకు అమలు చేసే స్వయం ఉపాధి పథకాల సబ్సిడీకి సంబంధించిన ఫైలుపై గురువారం సీఎం కేసీఆర్ సంతకం చేశారు. సబ్సిడీలపై స్పష్టత వచ్చినందున అమలు చేయాల్సిన పథకాలకు వెంటనే రూపకల్పన చేసి, సహాయం అందించాలని సూచించారు. గతేడాది ఎంబీసీ కార్పొరేషన్‌కు బడ్జెట్లో రూ.వెయ్యి కోట్లు కేటాయించామని, ఈసారి కూడా నిధులు కేటాయిస్తామని సీఎం వెల్లడించారు.

బీజేపీ మంత్రుల రాజీనామా

- ఏపీ సీఎంకు సమర్పించిన కామినేని, మాణిక్యాలరావు
- ఆమోదించిన గవర్నర్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి చెందిన మంత్రులు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్‌లు గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఉదయం అసెంబ్లీలో సీఎం చంద్రబాబును కలిసి తమ రాజీనామా లేఖలను సమర్పించారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించేందుకు భేటీ అయిన మంత్రివర్గ సమావేశానికి ఇరువురు మంత్రులు హాజరు కాలేదు. తర్వాత సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు, ఆకుల సత్యనారాయణ, పీవీఎన్ మాధవ్‌లతో కలిసి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి ఇరువురు నేతలు తమ రాజీనామా లేఖలను సమర్పించారు. వీరి రాజీనామాలను ఆమోదించాలని సీఎం చేసిన సిఫార్సును గవర్నర్ నరసింహన్ ఆమోదించారు. కొంతమంది రాజకీయాల్లో ఎంట్రీ చాలా బాగుంటుంది కానీ ఎగ్జిట్ బాధగా ఉంటుందని మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. మంత్రి పదవికి రాజీనామా సమర్పించిన అనంతరం కామినేని అసెంబ్లీలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చోటు చేసుకున్న పరిణామాలతో విధిలేని పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజీనామా చేశానని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలోనూ, తర్వాత కూడా వెంకయ్యనాయుడును చాలామంది ద్రోహిగా చిత్రీకరించడం బాధగా ఉందని పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. వెంకయ్యనాయుడు రాష్ట్రానికి ఎంతో చేశారని, దేశంలోనే ఎక్కువ గ్రామాలు తిరిగిన ఘనత ఆయనదని, అలాంటి వ్యక్తిని కూడా ద్రోహిగా పేర్కొనడం దారుణమన్నారు.

ఈ ప్రభుత్వంలో న్యాయం జరగడం లేదన్నా..

ఏపీ ప్రతిపక్ష నేత జగన్‌కు అడుగడుగునా సమస్యలు విన్నవించిన జనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'అన్నా.. ఎన్నికలప్పుడు చంద్రబాబు మాటలు నమ్మి ఆయనకు ఓట్లు వేసి గెలిపించాం. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా మా కష్టాలు తీరడం లేదు. ఈ ప్రభుత్వంలో మాకు న్యాయం జరగడం లేదు. మీరొస్తేనే మా బతుకులు బాగు పడతాయి' అని వివిధ వర్గాల ప్రజలు ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. ప్రజా సంకల్ప యాత్ర 107వ రోజు గురువారం ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం నుంచి చీరాల నియోజకవర్గ శివారు వరకు కొనసాగింది. పాదయాత్రలో ప్రజలు ఓ వైపు తమ కష్టాలు చెప్పుకుంటుంటే మరోవైపు తమ కష్టాలు వినే నాయకుడు వచ్చాడంటూ జనం ఘన స్వాగతం పలికారు. రాజన్న బిడ్డ వస్తున్నాడని తెలిసి పొలాల్లో పని చేస్తున్న రైతులు, కూలీలు ఆయన్ను చూసేందుకు ఆరాటపడ్డారు. తనను కలసిన అవ్వాతాతలు, అక్క చెల్లెళ్లు, అన్నదాతలు, అన్నదమ్ములను జగన్ ఆత్మీయంగా పలకరిస్తూ.. వారి కన్నీళ్లు తుడుస్తూ.. నేనున్నానని భరోసా ఇస్తూ ముందుకు సాగారు.



గురువారం ప్రకాశం జిల్లా సంతరావూరులో జగన్‌తో కలిసి నడుస్తున్న మహిళలు

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

బడాయి అంకెలు!

- రూ. 1,91,064 కోట్లతో 2018–19 ఏపీ బడ్జెట్
- కేటాయింపులు ఘనం.. అవసరాలకు బహు దూరం..
- రూ.2.5 లక్షల కోట్లకు అప్పులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రెండు లక్షల కోట్లకు చేరువగా భారీ బడ్జెట్... కేంద్రం నుంచి రూ.50,696 కోట్ల గ్రాంట్లు.. సొంత ఆదాయం రూ.65,535 కోట్లు.. కేంద్ర పన్నుల్లో వాటా రూ.33,930 కోట్లు.. మిగులు రూ.5,235 కోట్లు.. ఏ రంగం చూసినా వేల కోట్ల కేటాయింపులు.. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు రాష్ట్ర అసెంబ్లీకి సమర్పించిన 2018–19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఇలాంటి బడాయి అంకెలెన్నో కనిపిస్తాయి. ఆశ్చర్యం కలిగిస్తాయి.. చివరి బడ్జెట్ కనుకే అంకెల్లో అంత బడాయి.. భారీగా కేటాయింపులు చేయడం, వాటికి సర్దుబాటు చేయలేక చతికిలపడడం రివాజుగా మారింది. రుణమాఫీ పేరుతో రైతులను దారుణంగా వంచించారు. ఈ బడ్జెట్‌లోనూ వారికి ఒరిగింది శూన్యం. రూ.87,612 కోట్ల రుణాలున్నా చంద్రబాబు రూ.24వేల కోట్లేనని కుదించారు. వాటికి దశలవారీగా ఇచ్చింది అరకొరే.. వడ్డీలలో పావు వంతుకు కూడా మాఫీ సొమ్ము సరిపోలేదు. నిరుద్యోగులకూ చంద్రబాబు కుచ్చుటోపీ పెట్టారు.. ఇంటికో ఉద్యోగం–ఉపాధి అన్నారు... ఇవ్వలేకపోతే నెలకు రూ.2వేల నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు... ఇంకేముంది తలరాత మారిపోతుందని నిరుద్యోగులు తబ్బిబ్బయ్యారు.. కొత్తగా ఒక్క ఉద్యోగం లేదు సరికదా ఉన్న ఉద్యోగాలనే ఊడబీకుతున్నారు.. పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా వచ్చి ఉపాధి అవకాశాలను పెంచి ఆర్థిక రంగ పరిపుష్టికి దోహదపడే సంజీవని వంటి ప్రత్యేకహోదాను గాలికొదిలేశారు. ఎన్నికల ఏడాది కనుక ఈ 2018–19 బడ్జెట్‌లోనైనా తమకు న్యాయం చేస్తారని నిరుద్యోగులు ఎదురుచూశారు. వారికి ముఖ్యమంత్రి 'చిల్లర'తో సరిపెట్టారు. గతేడాది ఒక్క పైసా కూడా విదల్చలేదు. ఈ బడ్జెట్‌లో నిరుద్యోగులకు రూ.1,000 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో కోటిన్నర కుటుంబాలున్నాయి. ఒక్కో కుటుంబానికి రెండువేల చొప్పున నెలకు మూడువేల కోట్లు బకాయి. ఏడాదికి రూ.36వేల కోట్లు.. నాలుగేళ్లకు రూ.1.44 లక్షల కోట్లు బకాయి. ఈ ఏడాది మరలా రూ.36 వేలు బకాయి. అంటే మొత్తం రూ.1.76 లక్షల కోట్లు నిరుద్యోగులకు చంద్రబాబు ప్రభుత్వం బకాయి ఉన్నదన్న మాట. మరి ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.1,000 కోట్లు ఏమూలకు? మరోవైపు కమిషన్లకు వీలున్న నీటిపారుదల శాఖకు మాత్రం భారీ కేటాయింపులు జరిపినా పనులు జరుగుతున్న దాఖలాలే లేవు. వరప్రదాయిని పోలవరం ప్రాజెక్టుకు సరేసరి.. డ్వాక్రా మహిళలకూ టోకరా ఇచ్చారు. ప్రజారోగ్యానికి కీలకమైన ఆరోగ్యశ్రీకి కోతలు విధించి.. 108 అంబులెన్సులు, 104 పథకాలకు అరకొర కేటాయించారు. సంక్షేమానికి నిధులు పెంచినట్లు కనిపిస్తున్నా గతేడాది ఖర్చు చేయని నిధులు వెక్కిరిస్తున్నాయి..

2018-19 ఏపీ బడ్జెట్ స్వరూపం (కోట్లలో)

మొత్తం బడ్జెట్	1,91,064
రెవెన్యూ వ్యయం	1,50,272
కేపిటల్ వ్యయం	28,678
రుణాల తిరిగి చెల్లింపు	10,851
మొత్తం రెవెన్యూ రాబడి	1,55,507
కేంద్ర పన్నుల వాటా రూపంలో	33,930
కేంద్ర గ్రాంట్ల రూపంలో	50,696
రాష్ట్ర సొంత పన్ను ఆదాయం	65,535
సేల్స్ టాక్స్	38,448
మద్యం	7,357
మోటారు వాహనాలు	3,687
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్	4,880
పన్నేతర ఆదాయం	5,346
గనులు	2,500
అటవీ	600
రెవెన్యూ మిగులు	5,235
ద్రవ్య లోటు	24,205
రాష్ట్ర స్థూల ఉత్పత్తి	8,70,330
స్థూల ఉత్పత్తిలో రెవెన్యూ మిగులు	0.60 శాతం
రాష్ట్రస్థూల ఉత్పత్తిలో ద్రవ్య లోటు	2.78 శాతం



స్లిట్ స్టైల్‌తో
చింపెయ్!
- ఫ్యాషన్ పేజీలో

మగవాళ్లు చేయలేనివి
చేయడానికే...
- సినిమా పేజీలో



సాక్షి **ఫ్యామిలీ**
నల్లగొండ
శుక్రవారం, 9-3-2018

లేడీస్ స్పెషల్

సౌత్‌లో ఫస్ట్



ఉద్యోగినులకు ఆపరేటింగ్‌పై సూచనలను ఇస్తున్న స్టేషన్‌మాస్టర్ పూర్ణిమ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిత్తూరులోని చంద్రగిరి రైల్వే స్టేషన్‌ను దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి మహిళా రైల్వేస్టేషన్‌గా దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

తిరుపతి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రగిరి రైల్వేస్టేషన్ మీదుగా పదుల సంఖ్యలో రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం భక్తులు, విద్యార్థులు, ఉద్యోగులతో స్టేషన్ రద్దీగా కనిపిస్తుంటుంది. దీనికి తోడు ప్రతిరోజు సుమారు 10 ప్యాసింజర్ల ద్వారా 700 మంది ప్రయాణికులు చంద్రగిరి మీదుగా కాలినడకన తిరుమలకు వెళ్తుంటారు. ఇంత ప్రాముఖ్యం ఉన్న చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో ముగ్గురు స్టేషన్‌మాస్టర్లు, ముగ్గురు పాయింట్ ఉమెన్‌లతో పాటు ఒక టిక్కెట్ బుకింగ్ క్లార్క్ అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు మరింత నాణ్యమైన సేవలను అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈ స్టేషన్‌ను పూర్తిగా మహిళా రైల్వేస్టేషన్‌గా మార్చింది. దాంతో దక్షిణ భారతంలోనే మొట్టమొదటి మహిళా స్టేషన్‌గా చంద్రగిరి స్టేషన్ చరిత్రలో స్థానం సంపాదించుకుంది. విధులకు హాజరయ్యేందుకు ఉద్యోగినులకు ప్రత్యేక వాహనాలతో పాటు, అదనపు సహాయక సిబ్బందిని కూడా ఏర్పాటు చేసే దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రానున్న రోజుల్లో తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించడంలో భాగంగా కూడా చంద్రగిరి మహిళా రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయబోతున్నారు. పురుషులకంటె తామేమీ తక్కువ కాదని, ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించి, నూతన ఒరవడిని సృష్టిస్తామని ఈ స్టేషన్‌లోని మహిళా ఉద్యోగినులంతా ధీమా వ్యక్తం చెయ్యడం అభినందనీయం.

- భూమిరెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, సాక్షి, చంద్రగిరి

సంతోషంగా ఉంది



చంద్రగిరి రైల్వేస్టేషన్లో మొట్టమొదటి మహిళా స్టేషన్‌మాస్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషంగా ఉంది. టికెట్ బుకింగ్ స్టాఫ్ దగ్గర్నుంచి స్టేషన్ మాస్టర్ వరకు అంతా మహిళలమే విధులు నిర్వహిస్తున్నాం. గత పది సంవత్సరాలుగా నేను రైల్వేలో విధులు నిర్వహిస్తున్నాను. అయితే ఇలా మహిళలందరితో కలసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది.

- పూర్ణిమ, స్టేషన్‌మాస్టర్, చంద్రగిరి

ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు



నేటి సమాజంలో పురుషుల కంటే మహిళలే అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇటువంటి తరుణంలో స్త్రీలకు మరింత ప్రోత్సాహం అందించి మా ఉన్నతికి మార్గం సుగమం చేసిన అధికారులకు ధన్యవాదాలు. పదేళ్లకు పైగా రైల్వే పాయింట్ ఉమన్‌గా విధులు నిర్వహిస్తున్నాను. జిల్లాలో ఎన్నో స్టేషన్లలో విధులు నిర్వహించాను. ఎక్కడ చూసినా మహిళలంటే కొంత చిన్నచూపు కనిపించేది. మాలోని ప్రతిభను గుర్తించి, మాకంటూ ఓ రైల్వేస్టేషన్‌ను ప్రకటించడం చెప్పలేనంత ఆనందంగా ఉంది.

- శ్యామల, పాయింట్ ఉమన్, చంద్రగిరి

అవునా?

లక్కుండాలట!

‘బోలెడన్ని తెలివితేటలు, విపరీతమైన టాలెంటు ఉన్నంత మాత్రాన సరిపోదు. కొంచెం లక్కుండాలి’ అనే మాట ఎవరో ఒకరు అనగా వినే ఉంటారు. లేకపోతే మీలో మీరే అనుకునే ఉంటారు. ఏదో జనాంతికంగా అనుకునే మాటలకు లేదా జనాభిప్రాయంగా వినిపించే మాటలకు శాస్త్రీయ ప్రామాణికత ఏముంటుందని ప్రశ్నించే మేధావులు కూడా మనలో ఉంటారు. అయితే, తెలివితేటలు, టాలెంటుతో పాటు కొంచెం లక్కుంటేనే బతుకు పోటీలో గెలుపు దక్కుతుందనే విషయం ఇటీవల వార్‌విక్ బిజినెస్ స్కూల్ పరిశోధకులు నిర్వహించిన ఒక అధ్యయనంలో శాస్త్రీయంగా తేలింది. బిల్ గేట్స్ సహా గడచిన నాలుగు దశాబ్దాల కెరీర్‌లో ఘన విజయాలను సాధించిన వెయ్యిమంది వ్యక్తులపై శాస్త్రవేత్తలు ఒక అధ్యయనం నిర్వహించారు. సుదీర్ఘమైన కెరీర్‌లో విజయవంతంగా నిలదొక్కుకున్న వారికి తెలివితేటలు, ప్రతిభా పాటవాలతో పాటు అదృష్టం కూడా కలిసొచ్చిందని, వారి ఘన విజయాల వెనుక అదృష్టమే ప్రధాన కారణమని తమ అధ్యయనంలో తేలినట్లు వార్‌విక్ బిజినెస్ స్కూల్ పరిశోధకులు చెబుతున్నారు.

ఇదిలా ఉంటే, ఇటలీలోని సిసిలీ నగరంలో ఉన్న కటానియా వర్సిటీ పరిశోధకులు వెయ్యిమంది ‘వర్చువల్’ వ్యక్తులపై నిర్వహించిన ప్రయోగంలో కూడా అదృష్టం ముఖ్య భూమిక పోషిస్తుందని తేలడం విశేషం.



పిల్లల్ని బడిబాట పట్టించినట్లుగా
మహిళల్ని ‘బండిబాట’
పట్టించడానికి ‘ఆత్మనిర్భర్’ అనే
డ్రైవింగ్ స్కూల్‌ను నడిపిస్తోంది పావని.
‘సాధికారత’కు
ఆమె చెబుతున్న అర్థం..
‘బండి నడపడం’.
ఆమె చొరవతో
మథురై, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో
ఇప్పుడు ప్రతి అమ్మా
సాధికారతను ‘డ్రైవ్’ చేస్తోంది

మా మమ్మీ బండి మమ్మీ

ప్రతీకాత్మక చిత్రం

“ఫేస్‌బుక్‌లో బాగానే రెస్పాన్స్ వచ్చింది. ఈ మాత్రం స్పందన చాలు ఇప్పటికిప్పుడు మొదలుపెట్టడానికి”.. ఫేస్‌బుక్‌లోంచి లాగవుట్ అవుతూ అనుకుంది పావని ఖండేల్‌వాల్. ఆ తర్వాత ఎవరికో ఫోన్ చేసింది. కావల్సిన సమాధానమే వచ్చినట్టుంది. ఊరు వెళ్లడానికి టికెట్ బుక్ చేసుకుంది. పుణె నుంచి ఆమె తన సొంతూరు మథుర (యుపి) వెళ్తోంది. పుణెలోని సింబయోసిస్ యూనివర్సిటీలో బీబీఎమ్ చదివింది పావని. అక్కడే ఉద్యోగం కూడా చేస్తోంది. ఆంట్రప్రెన్యూర్ అవ్వాలనే ఆశయం. అయితే పావని అమ్మగారు ఆమె ఆలోచనకు వేరే రూపునిచ్చారు!

అమ్మ నసే.. ఐడియా!

‘‘**పా**వనీ.. నన్ను బజార్‌కు తీసుకెళ్లు, పావనీ.. అత్తవాళ్లింటి దగ్గర వదిలిపెట్టు.. పావనీ.. కాస్త కూరలు తెచ్చిపెట్టవా? పావనీ.. నన్ను అక్కడ డ్రాప్ చేయవా? పావనీ.. ఇక్కడున్నాను.. వచ్చి తీసుకెళ్లవా?’’ అంటూ అమ్మ రేఖ.. సెలవులకు వెళ్లినప్పుడల్లా తనకు పనులు పురమాయించేది. తను ఉన్న వారం రోజుల్లో పనులన్నీ చేసేసుకోవాలని అమ్మ ఆరాటం. అలా మూడు నెలల కిందట మథుర వెళ్లినప్పుడు అమ్మ తనను చాలానే విసిగించింది. ‘‘నువ్వు నేర్చుకోవచ్చు కదా బండి నడపడం? ఇలా నా మీదో.. నాన్న మీదో ఆధారపడేకంటే?’’ అంది అదే విసుగుతో పావని. ఆ మాటను మనసుకు తీసుకుంది పావని తల్లి. లేడీ ట్రైనర్ కోసం చాలా వెదికింది. ఎవరూ దొరకలేదు. ఆమె పట్టుదల చూసి చివరకు తనే వారం రోజులు సెలవు పొడిగించుకుని, మథురలో ఉండి మరీ అమ్మకు బండి నేర్పించింది. అప్పుడు తట్టింది పావనికి ఐడియా! ఆ ఐడియా ఇప్పుడు ఓ ఆకారం దిద్దుకోబోతోంది. ట్రైన్ ఆగింది. స్టేషన్లో దిగింది పావని.

మహిళలా! మథురలోనా?!

అమ్మకు తను డ్రైవింగ్ నేర్పడానికి ముందు, స్కూటీ నేర్పే లేడీ ట్రైనర్ కోసం వెదకుతుంటే అర్థమైంది పావనికి.. లేడీ ట్రైనర్స్ అవసరం ఎంతుందో. అప్పుడే అలాంటి ప్రాజెక్ట్‌కు అంకురం పడింది ఆమె మైండ్‌లో. అమ్మకు డ్రైవింగ్ నేర్పించి, మథుర నుంచి పుణె వెళ్లగానే దానికి సంబంధించి ఫేస్‌బుక్ పేజ్ క్రియేట్ చేసింది. చాలా మంది తమకూ డ్రైవింగ్ నేర్చుకోవాలని ఉందనీ పుణె నుంచి పోస్టులు పంపారు. మథుర సంప్రదాయబద్ధుల నిలయం. ఆ పట్టణంలో ఓ గృహిణి తన కట్టును చీర నుంచి సెల్వార్‌కమీజ్‌కు మార్చుకోవడమే పెద్ద విప్లవం. అలాంటి ఊళ్లో బండి నేర్చుకోవడానికి అంత మంది స్త్రీలు ఉత్సాహం చూపడం ఆమెకు ప్రోత్సాహాన్నిచ్చింది. మథుర వచ్చిన వెంటనే ‘ఆత్మనిర్భర్’ పేరుతో తను మొదలుపెట్టబోయే ‘ఆల్ విమెన్ టూ వీలర్ డ్రైవింగ్ స్కూల్’ను రిజిస్టర్ చేయించింది. వెంటనే పనిలోకి దిగింది.

మథుర సంప్రదాయబద్ధుల నిలయం. ఆ పట్టణంలో ఓ గృహిణి తన కట్టును చీర నుంచి సెల్వార్‌కమీజ్‌కు మార్చుకోవడమే పెద్ద విప్లవం. అలాంటి ఊళ్లో బండి నేర్చుకోవడానికి అంత మంది స్త్రీలు ఉత్సాహం చూపడం పావనికి ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్నీ ఇచ్చింది.

డ్రైవ్ చెయ్యాలా.. వద్దా?!

వారం గడిచేసరికి డ్రైవింగ్ నేర్చుకోడానికి ముందుకు వచ్చిన వాళ్లలో సగం మంది ‘ఎందుకులేబ్బా’ అని వెనక్కి తగ్గారు. పావని వాళ్ల అమ్మ నిరుత్సాహపడింది. అప్పటికే ఆమె స్కూటీ నడపడంలో పర్‌ఫెక్ట్ అయిపోయింది. డ్రైవింగ్‌ని ఆస్వాదిస్తోంది. ‘‘రెక్కలు కట్టుకుని విహరిస్తున్నట్టుంది’’ అంటుంది ఆమె. ఇంకొకరి మీద ఆధారపడకుండా బయట పనులన్నీ స్వయంగా చేసుకుంటే ఉండే సౌకర్యాన్ని, సాధికారతను, దర్పాన్నీ ఆమె అనుభవిస్తోంది. అదే మాట చెప్పింది.. తన కూతురు పెట్టిన డ్రైవింగ్ స్కూల్‌కి వచ్చిన మహిళలకు. కొంతమందికి ఆ మాటలు స్ఫూర్తినిచ్చాయి. డ్రైవింగ్ నేర్చుకోడానికి చేరారు. వాళ్ల సంఖ్య పెరిగేసరికి, నేర్పుతామని బయటి ఊళ్ల నుంచి వచ్చే మహిళా ట్రైనర్‌లూ పెరిగారు. ఇలా పద్దెనిమిది మందితో మొదలైన ఆ స్కూల్ నెల గడిచే సరికి 25 మందికి పెరిగింది.

ఒకర్ని చూసి ఒకరికి ధైర్యం

నలభై ఐదేళ్ల పావని వాళ్ల అమ్మ తన స్కూటీపై మథుర అంతా తిరుగుతుంటే ఆ వయసు వాళ్లకు కూడా డ్రైవింగ్ నేర్చుకోవాలన్న ఆశ కలిగింది. డ్రైవింగ్ స్కూల్లో ట్రైనర్స్ అంతా ఆడవాళ్లే అయ్యేసరికి ధైర్యమొచ్చింది. క్యూ కట్టారు స్కూల్‌కి. ఇప్పుడు దాదాపు యాభై మంది అయ్యారు నేర్చుకునేవారు. అంతా పదహారు నుంచి 48 ఏళ్ల మధ్య వయసున్న ఆడవాళ్లే. చుట్టుపక్కల ఊళ్ల నుంచీ అప్లికేషన్లు పెరుగుతుండటంతో పక్కనే ఉన్న భరత్‌పూర్, జైపూర్లో కూడా బ్రాంచ్‌లను తెరిచింది పావని. ఆత్మనిర్భర్‌లోనే డ్రైవింగ్ నేర్చుకున్న కొంతమంది అల్పాదాయ మహిళలకు అందులోనే ట్రైనర్స్‌గా అవకాశం ఇస్తోంది పావని. అలా వాళ్లు తమ కుటుంబానికి చేదోడువాదోడు అవుతున్నారు. ఆత్మనిర్భర్ ఆలోచన రావడానికి, అది కార్యాచరణ దాల్చడానికి వాళ్లమ్మే కారణం కాబట్టి దానికి వాళ్లమ్మనే సీఈఓగా నియమించింది పావని.

సింపుల్ అండ్ స్పీడ్ కోర్స్

పావని డ్రైవింగ్ కోర్సులో థియరీ, ప్రాక్టికల్స్ రెండూ ఉంటాయి. కోర్సు వ్యవధి పది రోజులు. కోర్సు అయ్యాక బండి మెయిన్‌టెనెన్స్ గురించీ వివరిస్తారు. అంతేకాదు, లైసెన్స్‌ను ఇప్పించే బాధ్యతనూ ఆత్మనిర్భరే తీసుకుంటోంది.

ఇలా.. పాతికవేల రూపాయల పెట్టుబడితో, రెండు స్కూటీలతో మొదలైన ఈ స్కూల్ యేడాది గడవకముందే ఏడాదికి ఆరు లక్షల ఆదాయానికి చేరుకుంది. ఇలా.. ఆంట్రప్రెన్యూర్ అవ్వాలన్న పావని కల కూడా నెరవేరింది. బ్రేక్స్ లేకుండా డ్రైవింగ్ స్కూల్‌ను ముందుకు పరిగెత్తించడమే నా ధ్యేయం అంటోంది పావని.

- శరాది



తల్లి రేఖతో పావని



పావని

మహిళా (డ్రైవింగ్) దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు తమ ఆత్మనిర్భర్‌లో విమెన్ ఆంట్రప్రెన్యూర్స్ కోసం ఓ వర్క్‌షాప్‌నూ నిర్వహించింది పావని. దీనికి మథుర చుట్టుపక్కల పట్టణాల నుంచే కాక రాజస్థాన్, మధ్యప్రదేశ్ నుంచీ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఇదికాకుండా ఏప్రిల్ నెలలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లోని చిన్న చిన్న పట్టణాల్లోని మహిళల కోసం డ్రైవింగ్ క్యాంప్స్‌ను నిర్వహించనున్నట్లు చెప్పింది పావని ఖండేల్‌వాల్. అన్నట్టు పావని రాయల్ ఎన్‌ఫీల్డ్ ‘బైకర్ని’ కూడా! బైకర్ని అంటే ఫీమేల్ బైకర్ అని.

చెట్టు నీడ

తిరిగితే తిరిగావు కానీ...

ఊరికి దూరంగా వున్న గురుకులం అది. చాలామంది పిల్లలు అందులో ఉండేవారు. వారికి ఒక గురువు పాఠాలు బోధించేవారు. పిల్లల్ని చాలా జాగ్రత్తగా చూసుకునేవారు.

అయితే, ఒక పిల్లాడు రోజూ రాత్రి లేచి, గోడ దూకి, పట్టణంలోకి తిరగడానికి వెళ్లేవాడు.

గదుల్ని పర్యవేక్షించడానికి వచ్చిన గురువు ఒక పిల్లాడు గోడ దూకి వెళ్లినట్టు గుర్తించాడు. అలాగే తాను వాడే ఒక ఎత్తైన స్టూలు కూడా లేకపోవడం గమనించాడు. లాంతరు వెలుగులో తిరిగి ఆ స్టూలు ఎక్కడుందో కనిపెట్టాడు గురువు. దాన్ని తీసేయించి, ఆ రాత్రి ఆ గోడ దగ్గరే నిల్చున్నాడు.

బయటికి పోయిన కుర్రాడు అర్ధరాత్రి దాటాక తిరిగివచ్చాడు. అక్కడ స్టూలు ఉందో లేదో గుర్తించకుండా, నిల్చున్న గురువు తల మీద కాలు మోపాడు. కిందికి దిగాక తను చేసింది చూసి ఒక్కసారి భయాశ్చర్యాలకు లోనయ్యాడు.

కాలు మోపిందానికి గురువు ఏ స్పందనా కనబరచకుండా, ‘నాన్నా, నువ్వు రాత్రిళ్లు తిరిగితే తిరిగావు. కానీ బయట బాగా చలిగావుంది. నీ ఆరోగ్యం జాగ్రత్త అని చెబుదామనే ఇంతసేపూ ఇక్కడ నిల్చున్నాను’ అన్నాడు.

పిల్లాడి ముఖంలో మార్పు కనబడింది. ఇంకంతే, అప్పట్నించీ ఆ గోడ దూకే పని మళ్లీ చేయలేదు.

లాంతరు వెలుగులో తిరిగి ఆ స్టూలు ఎక్కడుందో కనిపెట్టాడు గురువు. దాన్ని తీసేయించి, ఆ రాత్రి ఆ గోడ దగ్గరే నిల్చున్నాడు.

సినిమా
నల్లగొండ
శుక్రవారం
9-3-2018
సాక్షి ఫ్యామిలీ

స్క్రీన్ టెస్ట్





9 శ్రీదేవి, కమల్‌హాసన్ కలిసి ఎన్ని సినిమాల్లో నటించారో తెలుసా?
ఎ)15 బి)19 సి)23 డి)27

5 వెంకటేశ్ నటించిన 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రానికి దర్శకుడెవరు?
ఎ) త్రివిక్రమ్ శ్రీనివాస్ బి) కె. విజయభాస్కర్
సి) పి.వాసు డి) సురేశ్‌కృష్ణ





7 'మామ మంచు అల్లుడు కంచు' అనే సినిమా 2015 డిసెంబర్‌లో రిలీజైంది. మోహన్‌బాబు 23 సంవత్సరాల క్రితం నటించిన ఓ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందింది. ఏ చిత్రానికి ఈ సినిమా సీక్వెల్‌గా చెప్పగలరా?
ఎ) అల్లుడుగారు బి) అసెంబ్లీ రౌడీ
సి) అల్లరి మొగుడు డి) రౌడీగారి పెళ్లాం



13 అంతకుముందు చాలా సినిమాల్లో క్యారెక్టర్స్ చేసినప్పటికీ రామ్‌గోపాల్ వర్మ 'ఐస్‌క్రీమ్' సినిమా ద్వారా పేరు తెచ్చుకున్న నటి ఎవరు?
ఎ) అవికా గోర్ బి) తేజస్విని మడివాడ
సి) శ్రీముఖి డి) ఈషా రెబ్బా

15 నాగార్జున ట్విట్టర్ ఐడీ ఏంటో కనుక్కోండి ?
ఎ) ఐయామ్ నాగార్జున బి) నాగార్జున
సి) దిస్ ఈజ్ నాగార్జున డి) ఐయామ్ నాగ్

1 భూమిక చావ్లాతో నటించిన మొదటి తెలుగు హీరో ఎవరో తెలుసా?
ఎ) యన్టీఆర్ బి) మహేశ్ బాబు
సి) సుమంత్ డి) వెంకటేశ్

17 తెలుగు సినీ పరిశ్రమకు సంబంధించినంత వరకు 'నంది' అనేది చాలా ప్రతిష్ఠాత్మకమైన అవార్డు. ఈ అవార్డులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ సంవత్సరం నుండి ప్రారంభించిందో తెలుసా?
ఎ)1975 బి)1964
సి)1979 డి)1993

16 ఈ నటి అసలు పేరు సుజాత. అప్పటికే ఆ పేరుతో ఓ నటి ఉండటం వల్ల ఆమె స్క్రీన్ నేమ్ మారిపోయింది. ఆ నటి ఎవరో తెలుసా?
ఎ) జయసుధ బి) జయప్రద
సి) దివ్యవాణి డి) రంభ

14 అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'దసరాబుల్లోడు' చిత్రానికి దర్శకత్వం వహించిందెవరు?
ఎ) వి.మధుసూదనరావు బి) కె.వి.రెడ్డి
సి) వి.బి.రాజేంద్రప్రసాద్ డి) కె.విశ్వనాథ్





10 ప్రభాస్-అనుష్కల కాంబినేషన్లో ఇప్పటివరకు ఎన్ని సినిమాలు వచ్చాయో తెలుసా?
ఎ)7 బి)3 సి)5 డి)4

18 చిరంజీవి నటించిన 'పసివాడి ప్రాణం' చిత్రంలో 'పదహారేళ్ల వయసు పడి పడిలేచె మనసు' అనే పాట ఉంటుంది. ఇప్పుడు 'పడిపడి లేచె మనసు' అనే టైటిల్‌తో ఓ సినిమా రాబోతోంది. ఆ సినిమా హీరో ఎవరు?
ఎ) నాని బి) నిఖిల్
సి) నాగచైతన్య డి) శర్వానంద్

3 నాగార్జున నటించిన 'శివ' సినిమాకు మాటల రచయిత ఎవరో తెలుసా?
ఎ) యం.వీ.యస్.హరనాథరావు బి) శివనాగేశ్వరరావు
సి) తనికెళ్ల భరణి డి) సుద్దాల అశోక్‌తేజ

12 హీరోలు రానా, శర్వానంద్‌లకు ఈ ప్రముఖ హీరో స్కూల్‌మేట్. ఎవరా హీరో? కనుక్కోండి చూద్దాం?
ఎ) యన్టీఆర్ బి) రామ్‌చరణ్ సి) విజయ్ దేవరకొండ డి) అల్లరి నరేశ్

11 హృదయం ఎక్కడున్నది.. హృదయం ఎక్కడున్నది నీ చుట్టునే తిరుగుతున్నది... అనే పాటను కంపోజ్ చేసిన సంగీత దర్శకుడెవరో తెలుసా?
ఎ) దేవా బి) హారిస్ జయరాజ్
సి) యువన్ శంకర్ రాజా డి) విశాల్ శేఖర్

20 అక్కినేని, సావిత్రి నటించిన ఈ ఫోటో ఏ సినిమాలోనిదో కనుక్కోండి?
ఎ) మనుషులు మమతలు బి) మిస్సమ్మ
సి) గుండమ్మకథ డి) డాక్టర్ చక్రవర్తి



2 'మిస్టర్' సినిమా హీరో వరుణ్ తేజ్. ఆ సినిమాలో ఇద్దరు హీరోయిన్‌లు నటించారు. ఒక హీరోయిన్ లావణ్య త్రిపాఠి, మరో హీరోయిన్ ఎవరు?
ఎ) హెబ్బా పటేల్ బి) ప్రణీత సి) అమలాపాల్ డి) ఆండ్రియా



19 ఈ ఫోటోలోని ఇప్పటి హీరో ఎవరో కనుక్కోండి?
ఎ) శర్వానంద్
బి) కల్యాణ్‌రామ్
సి) అజిత్
డి) మాధవన్





8 ప్రముఖ యాంకర్ సుమ గతంలో ఓ ప్రముఖ దర్శకుని చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ఎవరా దర్శకుడు?
ఎ) కె.రాఘవేంద్రరావు
బి) దాసరి నారాయణరావు
సి) కోడి రామకృష్ణ
డి) ఎ. కోదండరామిరెడ్డి

6 నటి చార్మి ప్రస్తుతం హీరోయిన్‌గా కాకుండా ఓ ప్రముఖ దర్శకునితో కలిసి సినిమా ప్రొడక్షన్ కంపెనీని ప్రారంభించారు. ఆ కంపెనీ పేరేంటి?
ఎ) పూరిచార్మి క్రియేటివ్స్
బి) పూరి కనెక్ట్స్ సి) పీసీ కనెక్ట్స్
డి) పీసీ క్రియేట్స్



4 బాలీవుడ్ నటి విద్యాబాలన్‌కి ఈ సౌత్ హీరోయిన్ దగ్గర బంధువు. ఎవరామె?
ఎ) ప్రియమణి బి) లక్ష్మీరాయ్ సి) అంజలి డి) గౌతమి

సమాధానాలు
1) సి 2) ఎ 3) సి 4) ఎ
5) బి 6) సి 7) సి 8) బి 9) డి
10) డి 11) బి 12) బి 13) బి
14) సి 15) ఎ 16) ఎ)
17) బి 18) డి) 19) ఎ
20) ఎ

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

నిర్వహణ
శివ మల్లాల

సెల్ఫ్ చెక్

కలవరమా?

కలలు మీ గురించి చాలా విషయాలు చెబుతాయి తెలుసా? కలలు మనలో నిక్షిప్తమైన భావోద్వేగాల ఫలితం. మానసిక స్థితినే కాదు, చాలా సమస్యలకు పరిష్కారాలు చెబుతాయంటారు డ్రీమ్ ఎక్స్‌పర్ట్‌లు. కావాలంటే సెల్ఫ్ చెక్ చేసుకోండి.



1. నాలో నిగూఢమైన భావోద్వేగాలను కలలు ప్రతిఫలిస్తాయని నేననుకుంటాను.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. నాకొచ్చే కలలు సాధారణంగా మంచిగా, హాయిగా ఉంటాయి
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. నా కలల్లో ఎక్కువ వివరాలుంటాయి. ఎన్నో రంగులు కనిపిస్తాయి
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. ఒకే కల కొద్ది నెలల వ్యవధిలో మళ్లీమళ్లీ వస్తుంటుంది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. సాధారణంగా నాకు పీడకలలు వస్తుంటాయి. భయపెడుతుంటాయి. (ఏడాదిలో కనీసం నాలుగైదు సార్లు..)
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. ఉదయం లేవగానే రాత్రి నాకొచ్చిన కలల గురించి ఆలోచిస్తుంటాను.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. నా కలలు ఎక్కువగా చీకటిగా, అస్పష్టంగా ఉంటాయి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. ఒక్కోసారి నాకు సెక్స్ గురించి కలలు వస్తుంటాయి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
9. దేవుళ్ళూ, ఏవో తెలియని దివ్యలోకాల గురించి కలలు వస్తుంటాయి.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
10. నాకొచ్చే కలలు తర్వాత పెద్దగా గుర్తుండవు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

మీ సమాధానాల్లో ఎ కి 8 పాయింట్లు వస్తే మీరు మీ కలలు ఇచ్చే సందేశాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. స్థిరంగా, సంతృప్తిగా జీవనం సాగిస్తుంటారు. క్రియేటివ్‌గా ఉంటారు. మీకు సంబంధించిన అంశం గురించి మీ కలలు ఏవైనా సందేశాలు ఇస్తుండచ్చు. డ్రీమ్ డైరీలో వాటిని సమీక్షించుకోండి.

బి కి 8 పాయింట్లు వస్తే, కలల్ని మీరు పట్టించుకోరని అర్థం. మీరు ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని, ఆందోళన చెందుతున్నారనడానికి సూచన. తీరని కోరికలేవో ఉన్నాయని అర్థం.

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



ఆఅఅఅఆఆ....
ఆ...ఆఆఆఆ
భ్రమ అని తెలుసు భ్రమ అని తెలుసు
బతుకంటె బొమ్మల ఆట అని తెలుసు
ఆ..ఆఆఆ...
కత అని తెలుసు కత అని తెలుసు
కతలన్నీ కంచికే చేరుననీ తెలుసు
తెలుసు తెర తొలుగుతుందని
తెలుసు తెల్లారుతుందని
తెలుసు ఈ కట్టె పుట్టుక్కుమంటదని
తెలుసు ఈ మట్టి మట్టిలో కలిసిపోతదని
ఇన్నీ తెలిసి ఇరాకాటంలో పడిపోతావు
ఎందుకని
మాయ... మాయ... మా...యా...
తేలిపోయింది తెలిసిపోయింది
తెలియనిదేదో ఉందని మనసా
ఓ......ఓ....
తెలుసని ఎందరు చెబుతున్నా
అది ఉందో లేదో తేలని హంస
కళ్లు రెండు మూసెయ్యాలంట
మూడో కంటిని తెరవాలంట
మిన్ను మన్ను మిట్ట పల్లం ఒక్కటిగా
కనిపించాలంట
ఆడేవాడు ఆడించేవాడు ఏకపాత్రలని
ఎరగాలంట
ఆ.... ఎరుక వచ్చి రాగానే .... ఆ ఎరుక
వచ్చి రాగానే
ఆ.... ఎరుక వచ్చి రాగానే....
మాయం అయిపోతుందట మాయ...
ఆ... మాయా...
మాయా... మాయా.... మాయా...
ఓ... ఓ... ఓఒఒఓ...
ఆ... ఆ...
వేదం తెలుసు తైలమున్నదాకే దీపమను
వేదాంతం తెలుసు
శాస్త్రం తెలుసు శాశ్వతంగ ఉండేదెవ్వడీడ
లేడని తెలుసు
తెలుసు ఇది నీటి మూటని
తెలుసులే గాలిమేడని
తెలుసు ఈ బుడగ తప్పని పగిలిపోతదని
తెలుసు ఉట్టిపై ఉన్నదంత హుష్
కాకియని
అన్నీ తెలుసు అడుసులో పడి
దొర్లుతుంటావు దేనికని
మాయా... మాయా... మా...యా...

కట్‌చేయ్...దాచేయ్...

చిత్రం: జగద్గురు ఆదిశంకర, రచన: జె. కె. భారవి, సంగీతం: నాగ్ శ్రీవత్స
గానం: మైనంపాటి శ్రీరామచంద్ర

కాసుకో సుడోకు

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

			2		9	6		5
1		4		5		2		7
	2			4	7	9		1
		8					7	
		3				4		2
	1					5		
8		5	9	2			6	
7		1		6		8		9
2		9	8		3			

నిన్నటి జవాబు

పరి పరిశోధన

విటమిన్ - డి తో కేన్సర్ ముప్పు తక్కువ...

శరీరంలో విటమిన్ – డి ఎక్కువగా ఉండేలా చూసుకుంటే కాలేయ కేన్సర్‌తోపాటు పలు ఇతర కేన్సర్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయని జపాన్ శాస్త్రవేత్తలు జరిపిన తాజా అధ్యయనం ఒకటి స్పష్టం చేసింది. సూర్యరశ్మి ఆసరాతో శరీరంలో తయారయ్యే విటమిన్ – డి... క్యాల్షియం మోతాదులను నియంత్రించడం ద్వారా ఎముకలు, పళ్లను దృఢంగా ఉంచుతుందని ఇప్పటికే పలు పరిశోధనలు రుజువు చేశాయి. కేన్సర్ల విషయంలోనూ ఇది మేలు చేస్తుందని గతంలోనే కొన్ని వాదనలు ఉన్నప్పటికీ కచ్చితమైన రుజువులు లేకపోవడం వల్ల విస్తృత ప్రచారంలోకి రాలేదు. ఈ నేపథ్యంలో జపాన్‌కు చెందిన పబ్లిక్ హెల్త్ సెంటర్ శాస్త్రవేత్తలు దాదాపు 33 వేల మందిపై అధ్యయనం చేశారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, రక్తంలో విటమిన్ – డి మోతాదులను నమోదు చేసుకున్న తరువాత వీరిపై దీర్ఘకాల పరిశోధనలు మొదలుపెట్టారు. ఋతువులకు అనుగుణంగా విటమిన్ – డి మోతాదులో వచ్చే మార్పులనూ పరిగణలోకి తీసుకున్న శాస్త్రవేత్తలు దాదాపు 16 ఏళ్లపాటు పరిశీలనలు కొనసాగించారు. ఈ కాలంలో వీరిలో దాదాపు 3301 మందికి కేన్సర్ సోకింది. వయసు, వ్యాయామం చేసే అలవాటు, ధూమపానం, మద్యపానం వంటి అన్ని ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషించినప్పుడు సాధారణ స్థాయి కంటే ఎక్కువ విటమిన్ – డి ఉన్న వారికి కేన్సర్ సోకే అవకాశాలు 20 శాతం తక్కువగా ఉన్నట్లు తెలిసింది. కాలేయ కేన్సర్ విషయంలో ఇది 30 – 50 శాతం వరకూ ఉన్నట్లు తెలిసింది. ఊపిరితిత్తులు, ప్రోస్టేట్ కేన్సర్ల విషయంలో ప్రభావం పెద్దగా లేదు. మరిన్ని పరిశోధనల ద్వారా ఈ అంశాన్ని రూఢి చేసుకుంటే విటమిన్ –డి ని కేన్సర్ నిరోధక కార్యక్రమాల్లో వాడుకోవచ్చునని భావిస్తున్నారు.



ప్రోటాన్ బ్యాటరీలు వస్తున్నాయి...

అతితక్కువ స్థలంలో ఎక్కువ విద్యుత్తును నిల్వ చేసుకోగల బ్యాటరీలు అందుబాటులోకి వస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న లిథియం అయాన్ బ్యాటరీల సామర్థ్యం తక్కువైనా, ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల వీటినే వాడుతున్నారు. అయితే ఇకపై ఈ పరిస్థితి మారిపోనుంది. ఆస్ట్రేలియాలోని ఆర్ఎంఐటీ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ప్రోటాన్లతో పనిచేసే సరికొత్త బ్యాటరీని అభివృద్ధి చేయడం దీనికి కారణం. సోలార్ ప్యానెల్స్ ఉత్పత్తి చేసే విద్యుత్తును అక్కడికక్కడే సమర్థంగా నిల్వ చేసుకుని వాడుకోవడంతోపాటు విద్యుత్తు వాహనాలు మరింత ఎక్కువ దూరం ప్రయాణించేందుకూ ఈ కొత్త బ్యాటరీలు ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అన్నిటికీ మించి ప్రోటాన్ బ్యాటరీలు చాలా చౌకగా తయారుచేయవచ్చు. పర్యావరణానికి జరిగే నష్టం కూడా చాలా తక్కువ. బ్యాటరీలోకి విద్యుత్తు ప్రవహించినప్పుడు నీరు కాస్తా హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడిపోతుంది. కొన్ని ప్రోటాన్లూ విడుదలవుతాయి. ఇవి కాస్తా కార్బన్‌తో తయారైన ఎలక్ట్రోడ్‌కు అతుక్కుంటాయి. అవసరమైనప్పుడు ఇవే ప్రోటాన్లు విడిపోయి గాల్లోంచి ఆక్సిజన్‌ను తీసుకుని నీటిని తీసుకోవడం ద్వారా మళ్లీ ఎలక్ట్రాన్లను (విద్యుత్తు) విడుదల చేస్తాయి. ప్రస్తుతం తాము తయారు చేసిన నమూనా ప్రోటాన్ బ్యాటరీ లిథియం అయాన్ బ్యాటరీ స్థాయిలో విద్యుత్తును నిల్వ చేసుకోగలదని.. కొన్ని మార్పులు, చేర్పులతో సామర్థ్యాన్ని పెంచవచ్చునని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ప్రొఫెసర్ జాన్ ఆండ్రూస్ తెలిపారు.



రక్తపోటు పరీక్షలకు మెరుగైన స్మార్ట్‌ఫోన్ పద్ధతి!

స్మార్ట్‌ఫోన్లతో చేయగలిగిన పనుల్లో రక్తపోటు పరీక్షలు ఇప్పటికే చేరినప్పటికీ ఇదే పనిని మరింత కచ్చితత్వంతో చేసేందుకు మిషిగన్ స్టేట్ యూనివర్శిటీకి చెందిన ముక్కామల రామకృష్ణ ఓ వినూత్నమైన పద్ధతిని ఆవిష్కరించారు. ఆధునిక త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ సాయంతో, కొన్ని ఆప్టికల్ సెన్సర్లను ఉపయోగించి ప్రత్యేకమైన స్మార్ట్‌ఫోన్ కేస్‌ను తయారు చేశారు ఈయన. దీంతోపాటు ప్రత్యేకమైన ప్రదేశంలో ఉండే ఇంకో సెన్సర్‌ను వేలితో నొక్కితే చాలు.. రక్తపోటు వివరాలు స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి. వేలి ఒత్తిడికి ఆప్టికల సెన్సర్లు పనిచేయడం మొదలుపెడతాయని.. రక్తనాళాల్లో రక్తపోటు కారణంగా వచ్చే మార్పులను పరిశీలించడం ద్వారా రక్తపోటు ఎంత ఉందో నిర్ణయించి ఆ సమాచారాన్ని వైర్‌లెస్ పద్ధతిలో స్క్రీన్ పైకి పంపుతాయని రామకృష్ణ వివరించారు. ఇప్పటికే తాము ఈ స్మార్ట్ కేస్‌ను కొంతమందిపై పరీక్షించి మంచి ఫలితాలు సాధించామని చెప్పారు. అమెరికా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ సహకారంతో తయారైన ఈ కొత్త గాడ్జెట్ వైద్య రంగంలో మేలి మార్పులకు కారణమవుతుందని వైద్య నిపుణుల అంచనా.





ఫ్యాషన్

స్లిట్ స్టైల్‌తో చింపెయ్!

ఏదైనా పని గొప్పగా చేస్తే చింపేశారు అంటారు. వేసుకునే దుస్తులు కూడా అంతే గొప్పగా ఉంటే చింపేశారు.. అనరా! ఈ స్లిట్ ఫ్యాషన్ వేసెయ్.. చింపెయ్!

















'డ్రెస్ చాలా ట్రెడిషనల్‌గా ఉంది... కాస్త స్టైలిష్ లుక్ ఇస్తే బాగుండు ఎలా..' అనుకుంటున్నారా! చాలా సింపుల్. ఇలా ఒక స్లిట్ ఇచ్చి చూడండి. నేటి తరానికి బాగా నప్పే ఈ డిజైన్ సమ్మర్‌లో సౌకర్యంగానూ ఉంటుంది.

సంప్రదాయ టాప్‌కి స్టైలిష్ స్లిట్

పెళ్లికి వెళ్లాలంటే సంప్రదాయ దుస్తులు ముఖ్యంగా లెహంగా ధరించాల్సిందే అని పెద్దవాళ్లు పట్టు బడితే మీ స్టైల్‌కి ఒక అదనపు హంగును ఎలా చేర్చాలా అని పెద్దగా ప్రయాసపడనక్కర్లేదు. టాప్‌గా ధరించే ట్రెడిషనల్ కుర్తీ, ట్యునిక్ వంటి వాటికి ఇలా స్లిట్స్ ఇస్తే చాలు. మీ వార్డ్రోబ్‌లో ట్రెడిషనల్ స్లిట్ టాప్ ఒకటి చేర్చండి. అది బెనారస్ లేదా జరీ వర్క్‌తో ఉన్నది ఏదైనా ఎంచుకోండి. అయితే, టాప్–బాటమ్ ఎప్పుడూ కాంట్రాస్ట్ ఉండేలా జాగ్రత్తపడండి.

దేశీయ పట్టుకు వెస్ట్రన్ స్లిట్

బెనారస్, కంజీవరం వంటి పట్టు ఫ్యాబ్రిక్‌ను కూడా ఆధునికపు హంగులతో కొత్త లుక్ తీసుకురావచ్చు. లాంగ్ స్లిట్ కుర్తీకి బాటమ్ పార్ట్ జత చేయడంతో ట్రెడిషనల్ లుక్ వచ్చింది. ఓవరాల్‌గా చూస్తే పూర్తి వెస్ట్రన్ లాంగ్ గౌన్‌లా, దేశీయ పట్టు ఫ్యాబ్రిక్ అవడంతో సంప్రదాయపు సొబగులతో ఆకట్టుకుంటుంది.

సమ్మర్‌కి సరికొత్త స్లిట్

వేసవి కాలం సౌకర్యంగా లేని దుస్తులు ధరిస్తే చికాకు మరీ ఎక్కువ అవుతుంది. గెట్ టు గెదర్ వంటి పార్టీలకు స్టైలిష్‌గా అదే టైమ్‌లో కంఫర్ట్ అనిపించే డ్రెస్‌లో వెళ్లాలంటే ఇలాంటి స్పెషల్ స్లిట్ డ్రెస్ ఎంచుకుంటే చాలు. బాటమ్‌గా జీన్స్.. టాప్‌గా స్లిట్ లాంగ్ కుర్తీ ధరించండి.

వేదికల మీద వెలిగిపోయే స్లిట్

పెద్ద పెద్ద ఈవెంట్స్‌కి ఇలాంటి ఇండో వెస్టర్న్ డ్రెస్‌లు బాగా నప్పుతాయి. స్కర్ట్ మోడల్‌ని తలపించే ఫ్రిల్స్ బాటమ్ టాప్‌కి జత చేశారు. లాంగ్ స్లీవ్స్ ట్యూనిక్‌కి ముందు భాగంలో స్లిట్ ఇవ్వడంతో కుచ్చుల భాగం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. పూర్తి డ్రెస్ ఆధునికపు హంగులతో ఆకట్టుకుంటుంది.

సౌకర్యవంతమైన స్లిట్

క్యాజువల్ లుక్‌తో సౌకర్యంగా అనిపించే ఇలాంటి డ్రెస్సులు వేసవికి ప్రత్యేకతను తీసుకువస్తాయి. టు పీస్ ఫ్రాక్‌ను ఎంచుకోవాలి. టాప్ పీస్‌కి కుచ్చులున్న ముందు భాగంలో స్లిట్ ఇవ్వాలి. రెండు ఫ్లోరల్ ప్రింట్స్ అయినా కాంట్రాస్ట్ కాంబినేషన్స్ అవడంతో లుక్ స్టైలిష్‌గా మారిపోతుంది.

ఇలా మీరూ ప్రయత్నించవచ్చు. అది సంప్రదాయ దుస్తులైనా, వెస్ట్రన్ డ్రెస్ ఏదైనా స్లిట్ ఉంటే స్టైలిష్‌గా వెలిగిపోవచ్చు.

నిర్వహణ: **ఎన్.ఆర్.**

● సర్వహక్కులు

కన్యాదానం... కాదు సమంజసం

వస్తువును దానం చేస్తారు... కన్యను దానం చేయడం ఏమిటి? స్త్రీ ప్రాణం లేని వస్తువా దానం చేయడానికి? దానం పొందిన వస్తువు మీద సర్వహక్కులు దానగ్రహీతకు ఉంటాయి. స్త్రీ మీద సర్వహక్కులు ఆమెను పెళ్లాడిన పురుషుడు కలిగి ఉన్నాడని చెప్పడానికి సంకేతంగా ఈ తంతును వివాహంలో పెట్టారా? పెళ్లిలో స్త్రీ, పురుషులు ఇరువురు సమానమే. పరస్పర సహకారంతో వారు ముందుకు సాగాలి. కాని మగవాడిని అధికంగా స్త్రీని అల్పంగా చేసే కన్యాదానం పద్ధతి సరికాదని అంటున్నారు కలకత్తాకు చెందిన పురోహితురాలు నందిని భౌమిక్.



కలకత్తా నగరంలో నందిని భౌమిక్ పౌరోహిత్యం నిర్వహిస్తున్నారు. సాధారణంగా పౌరహిత్యం మగవారి చేతుల్లో ఉంటుంది. స్త్రీలు ఈ రంగంలో రాణించడం తక్కువ. కాని నందిని భౌమిక్ పట్టుదలగా ఈ రంగంలోకి వచ్చారు. వృత్తిరీత్యా జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో సంస్కృత శాఖ అధ్యాపకురాలుగా పని చేస్తున్న భౌమిక్ తనలాంటి భావాలు కలిగిన ఇద్దరు ముగ్గురు స్త్రీలతో కలిసి ఒక బృందంగా ఏర్పాటయ్యారు. రుమా రాయ్, సీమంతి బెనర్జీ, పైలమీ చక్రవర్తి... అనే ఈ ముగ్గురితో కలిసి నందిని నిర్వహించే పౌరహిత్య కార్యక్రమాలు ఫేమస్ అయ్యాయి. ఇటీవల ఈమె నిర్వహించిన ఒక వివాహం కూడా వార్తలకు ఎక్కింది.

కలకత్తాకు చెందిన అన్వితా జనార్దన్, అర్కా భట్టాచార్య ఫిబ్రవరి 24న వివాహం చేసుకున్నారు. నందిని పౌరోహిత్యం వహించారు. వరుడు భట్టాచార్యకు నందిని బృందమంటే అపారమైన గౌరవం. వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యాడు. తన పెళ్లి జరిపించమని కోరాడు. పెళ్లి జరిపిస్తున్న నందిని సంస్కృతంలో ఉన్న వివాహ మంత్రాలకు ఆంగ్ల, బెంగాలీ భాషలలో అర్థవివరణ ఇవ్వడం ఆహూతులను ఆకర్షించింది. అయితే ఈ పెళ్లిలో 'కన్యాదానం' తంతును తాను నిర్వహించబోవడం లేదని నందిని ప్రకటించి అందరినీ ఆలోచనలో పడేశారు. పురాతన హిందూ గ్రంథాలలో కన్యాదానం లేకుండానే వివాహ క్రతువు నడిచేదని ముఖ్యంగా ఋగ్వేదం ఈ విషయం రూఢీ పరిచిందని ఆమె తెలిపారు. స్త్రీ వస్తువు కాదని ఇంత ఆధునిక సమాజంలో ఆమెను దానంగా ఇవ్వడం, దానంగా తీసుకోవడం వెనుకబాటుతనానికి చిహ్నం అని చెప్పారు. వధువరులు నందిని మాటలకు సమ్మతించి కన్యాదానం తంతు లేకుండానే వివాహం చేసుకోవడం వార్తగా మారింది.

స్త్రీలు పౌరహిత్యం చేయడం ఏమిటని కలకత్తాలో కొంతమంది నొసలు చిట్లించినా ఆడవారు పౌరోహిత్యం వహించడం దోషం కాదని మరికొందరు పండితులు సమర్థన తెలిపారు.

మహిళల పౌరోహిత్యం గురించి వేదాలలో చాలా పెద్ద వేదాంత చర్చ జరిగిందని కూడా వారు తెలియచేశారు. మొత్తానికి నందిని బృందం స్త్రీల తరపున ఆలోచిస్తూ స్త్రీలకు అపసవ్యమైన తంతులను పరిహరిస్తూ శుభకార్యాలు నిర్వర్తించడం అందరినీ ఆకర్షిస్తోంది.

హోమియో కౌన్సెలింగ్స్

ఫ్యామిలీ డాక్టర్

ఫైబ్రాయిడ్స్ తగ్గుతాయా?

నా వయసు 40 ఏళ్లు. కొంతకాలంగా ఫైబ్రాయిడ్స్‌తో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే శస్త్రచికిత్స అవసరమనీ, అయితే భవిష్యత్తులో తిరగబెట్టవచ్చని అంటున్నారు. మళ్లీ రాకుండా హోమియో చికిత్సతో ఈ సమస్య పూర్తిగా తగ్గుతుందా?

– శ్రీదుర్గ, విజయవాడ

గర్భాశయంలో ఏర్పడే కణుతులను యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ అంటారు. ఇవి గర్భాశయంలో ఒకటిగా లేదా



చిన్న చిన్న నీటితిత్తుల్లా కొన్ని సెంటీమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

కారణాలు : ఫైబ్రాయిడ్స్ ఏ కారణం చేత ఏర్పడతాయనే విషయం పట్ల ఇంతవరకు స్పష్టత లేదు. కానీ కొన్ని హార్మోన్లు... ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల ప్రభావం వల్ల ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం ఎక్కువ. రుతుచక్ర సమయంలో, గర్భధారణ సమయంలో ఇవి ఎక్కువగా ఏర్పడతాయి. నెలసరి ఆగిపోయిన స్త్రీలలో ఈ హార్మోన్ల ఉత్పాదన చాలావరకు తగ్గడంతో పాటు ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది. స్థూలకాయం, వంశపారంపర్యత వంటి అంశాల వల్ల కూడా గర్భాశయ కణుతులు ఏర్పడతాయి.

లక్షణాలు : గర్భాశయ కణుతులు ఏర్పడ్డ ప్రదేశం, పరిణామం, సంఖ్యను బట్టి అవి ఏర్పడతాయి. అధిక రుతుస్రావం, రెండు రుతుచక్రాల మధ్య వ్యవధి ఎక్కువ రోజులు కొనసాగడం, పొత్తికడుపులో నొప్పి, నడుము నొప్పి, ఫైబ్రాయిడ్స్ వల్ల మూత్రాశయంపై ఒత్తిడి పడినట్లే తరచూ మూత్రానికి వెళ్లాలని అనిపిస్తూ ఉండటం, పేగులపై ఒత్తిడి పడితే మలబద్ధకం, కడుపుబ్బరం వంటి లక్షణాలను గమనించవచ్చు.

చికిత్స: మీరు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. జెనెటిక్ కన్‌స్టిట్యూషన్ పద్ధతి ద్వారా హోమియో విధానంలో యుటెరైన్ ఫైబ్రాయిడ్స్ సమస్యను సంపూర్ణంగా నయం చేయవచ్చు. ఈ చికిత్స ద్వారా గర్భాశయపు కణుతులను పూర్తిగా తొలగించడమే గాకుండా, శరీరంలోని హార్మోన్లను అసమతౌల్యతను సరిచేయడం వల్ల సమస్యను తేలిగ్గా పరిష్కరించవచ్చు.



డాక్టర్ శ్రీకాంత్ మొర్లావర్, సీఎండీ,
హోమియోకేర్ ఇంటర్నేషనల్, హైదరాబాద్

ఆపరేషన్ లేకుండా పైల్స్ నయం చేయవచ్చా?

నా వయసు 38 ఏళ్లు. మలవిసర్జన అవుతున్నప్పుడు రక్తం పడుతోంది. కొన్నిసార్లు నొప్పిగానూ ఉంటోంది. ఆపరేషన్ అవసరం అంటున్నారు. హోమియోలో చికిత్స ఏదైనా ఉందా?

– రమేష్‌బాబు, కందుకూరు

పైల్స్ చాలా సాధారణ సమస్య. మలవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి, రక్తస్రావం కావడం వంటి సమస్యలతో చాలామంది బాధపడుతూ ఉంటారు. దీనికి కారణం మొలలు (పైల్స్). మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి వల్ల ఈ సమస్యతో చాలా మంది బాధపడుతున్నారు. మలద్వారం వద్ద ఉన్న రక్తనాళాలపై ఒత్తిడి తీవ్రంగా ఉండటం వల్ల వాటిల్లో కొన్ని బొడిపెల్లా తయారవుతాయి. వాటినే పైల్స్ అంటారు. మల విసర్జన తర్వాత వీటి బాధ ఎక్కువగా ఉంటుంది.

లక్షణాలు : తీవ్రమైన నొప్పి, మంట, దురద ఉండి సూదులతో గుచ్చినట్లుగా



అనిపిస్తుంది. ఒకచోట కూర్చోలేరు. నిలబడలేరు.

రకాలు : ఇందులో ఇంటర్నల్ పైల్స్, ఎక్స్‌టర్నల్ పైల్స్ అని రెండు రకాలు ఉంటాయి. ఇంటర్నల్ పైల్స్ మలవిసర్జన మార్గంలోనే ఉంటాయి. ఎక్స్‌టర్నల్ పైల్స్ అంటే బయటకు వచ్చేవి. ఇవి బఠాణీగింజ అంత పరిమాణంలో గులాబీరంగులో మూడు లేదా నాలుగు గుత్తులుగా ఉంటాయి.

కారణాలు : ● మలబద్ధకం, తగినంత నీళ్లు తాగకపోవడం ● పొత్తికడుపు ఎక్కువ కాలం ఒత్తిడికి గురికావడం ● గర్భం ధరించిన స్త్రీలు కొందరు పైల్స్ బారిన పడుతుంటారు ● మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం ● ఎక్కువ సమయం పాటు నిలబడి ఉండటం ●మద్యం, హెపటైటిస్ వల్ల కాలేయం దెబ్బతిన్నవాళ్లలో కూడా పైల్స్ వచ్చే అవకాశాలు ఉంటాయి.

చికిత్స : హోమియో వైద్యవిధానంలో ఆపరేషన్ అవసరం లేకుండానే కేవలం మందులతోనే సమస్య నయమయ్యేలా చేయవచ్చు. పైల్స్ చికిత్స కోసం బ్రయోనియా, నక్స్‌వామికా, అల్యూమినా వంటి చాలా మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే రోగి వ్యక్తిగత లక్షణాలను బట్టి అనుభవజ్ఞులైన హోమియో డాక్టర్ల పర్యవేక్షణలోనే వీటిని వాడాల్సి ఉంటుంది.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

స్పాండిలోసిస్‌కు పరిష్కారం చెప్పండి

నా వయసు 39 ఏళ్లు. గత ఆర్నెల్ల నుంచి తీవ్రమైన మెడనొప్పి, నడుమునొప్పితో బాధపడుతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే స్పాండిలోసిస్ అంటున్నారు. మందులు వాడుతున్నా, నొప్పి తగ్గినట్టే తగ్గి మళ్లీ వస్తోంది. ఈ సమస్యకు హోమియోలో శాశ్వత పరిష్కారం ఉందా?

– **కె. రామారావు**, నల్లగొండ

ఎముకల అరుగుదల వల్ల వచ్చే ఒక రకమైన ఆర్థరైటిస్‌ను స్పాండిలోసిస్ అంటారు. ఇది మెడ భాగంలో



వస్తే సర్వైకల్ స్పాండిలోసిస్ అని, నడుము భాగంలో వస్తే లంబార్ స్పాండిలోసిస్ అని పేర్కొంటారు.

కారణాలు : ● కాళ్లు, చేతులతో ఉన్నట్లు వెన్నులో కూడా జాయింట్స్ ఉంటాయి. ఈ జాయింట్స్ అరుగుదల వల్ల నొప్పి రావచ్చు. ● జాయింట్స్‌లోని ద్రవం తగ్గడం వల్ల ● స్పైన్ దెబ్బతినడం వల్ల ● వెన్నుపూసల మధ్య నుంచి నరాలు శరీరంలో వ్యాపించడానికి ఉండే దారి సన్నబడి, నరాలపై ఒత్తిడి పడి నొప్పి వస్తుంది.

లక్షణాలు : ● సర్వైకల్ స్పాండిలోసిస్ : మెడనొప్పి, తలనొప్పి తల అటు–ఇటు తిప్పడం కష్టమవుతుంది. మెడ బిగుసుకుపోయినట్టుగా ఉంటుంది. నొప్పి మెడ నుంచి భుజాలు, చేతుల వరకు ఉంటుంది. ● లంబార్ స్పాండిలోసిస్ : నడుమునొప్పి, కొన్నిసార్లు నడుము నొప్పితో పాటు మెడ నొప్పి కూడా ఉంటుంది. నొప్పి నడుము నుంచి మొదలై పాదం వరకు వ్యాపిస్తుంది. దీనినే సయాటికా నొప్పి అంటారు. నరాలు ఒత్తిడికి గురైనప్పుడు అవి సప్లై అయ్యే చోటు మొద్దుబారడం, నడవడానిక్కూడా ఇబ్బందిపడటం వంటి సమస్యలు వస్తాయి.

నివారణ : వెన్నెముకకు సంబంధించిన వ్యాయామాలు చేయడం, మంచి పోషకాహారం తీసుకోవడం, క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం, ఒక్కసారిగా కూర్చోవడం లేదా నిల్చోవడం వంటివి చేయకపోవడం, దూరప్రాంతాలకు వాహనం నడపడం వంటివి చేయకపోవడం.

చికిత్స : రోగి శారీరక, మానసిక సమస్యలను పరిగణనలోకి తీసుకొని ఇచ్చే కాన్స్‌టిట్యూషనల్ చికిత్సతో వారిలోని రోగనిరోధక శక్తి క్రమంగా పెరిగి, సమస్య పూర్తిగా తగ్గుతుంది.



డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
9-3-2018

క్రేజీ కాంబినేషన్ రిపీట్



వెంకట్, రవిశంకర్, రవితేజ, శ్రీను వైట్ల, అనూ ఇమ్మాన్యుయేల్, నవీన్, చెర్రీ

మూడు హిట్స్ సాధించిన క్రేజీ కాంబినేషన్‌లో మరో కొత్త సినిమా రూపొందటానికి పదేళ్ల కాలం పట్టింది. రవితేజ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై శ్రీను వైట్ల దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మిస్తున్న సినిమా 'అమర్ అక్బర్ ఆంటోనీ'. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. ఆల్రెడీ రవితేజ, శ్రీను వైట్ల కాంబినేషన్‌లో 'నీకోసం, వెంకీ, దుబాయ్ శీను' చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే. 'అమర్ అక్బర్ ఆంటోనీ' చిత్రం ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి శ్రీను వైట్ల పెద్ద కుమార్తె ఆనంది వైట్ల క్లాప్ ఇవ్వగా, రెండవ కుమార్తె ఆద్య వైట్ల కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి శ్రీను వైట్ల గౌరవ దర్శకత్వం వహించారు. హీరో రవితేజ బౌండెడ్ స్క్రిప్ట్‌ను శ్రీను వైట్లకు అందించారు. ఈ సందర్భంగా శ్రీను వైట్ల మాట్లాడుతూ– ''అమర్ అక్బర్ ఆంటోనీ' కథకు గత ఏడాదే బీజం పడింది. పది నెలలు కష్టపడి ఈ సినిమా స్క్రిప్ట్‌ను కంప్లీట్ చేశా. సునీల్ ఈ సినిమాలో ఫుల్ లెంగ్త్ కామెడీ రోల్ చేస్తారు. నిన్నటి తరం కథానాయిక లయ, ఆమె కుమార్తె శ్లోక కూడా నటించనున్నారు. రవితేజ తనయుడు మహాధన్ కూడా ముఖ్య పాత్రలో కనిపిస్తాడు. ఎంటైర్ షూటింగ్‌ను యూఎస్‌లోనే కంప్లీట్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''మా బ్యానర్‌లో చాలా స్పెషల్ మూవీ ఇది. రవితేజ–శ్రీను వైట్ల క్రేజీ కాంబినేషన్‌లో సినిమా చేయడం ఆనందంగా ఉంది. థమన్ స్వరాలు సమకూర్చనున్నారు'' అని నిర్మాతలు అన్నారు.



సమంత, నాగచైతన్య

నాన్‌స్టాప్ లవ్ జర్నీ

దిల్ అంతా ఫుల్ ఖుషీతో ఎగ్జైట్ అవుతున్నారు సమంత. మరి.. భర్తతో సినిమా అంటే ఆ మాత్రం ఎగ్జైట్‌మెంట్ ఉంటుంది కదా. ఉమెన్స్ డే రోజున అనౌన్స్‌మెంట్ రావడం, అందులోనూ పెళ్లైన తర్వాత నాగచైతన్యతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నందుకు ఫుల్ హ్యాపీగా ఫీలవుతున్నారామె. నాగచైతన్య, సమంత జంటగా 'నిన్ను కోరి' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వంలో షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఓ చిత్రం నిర్మించనున్నారు. ఈ సినిమాకు 'ప్రేయసి' అనే టైటిల్ అనుకుంటున్నారట. ''సన్‌షైన్ పిక్చర్స్ పతాకంపై శివ దర్శకత్వంలో నా నెక్ట్స్ సినిమా రూపొందనుందని చెప్పడానికి చాలా హ్యాపీగా ఉంది. నా బెటరాఫ్ సమంతతో నటించబోతున్నాను. మరో లవ్ జర్నీ స్టార్ట్'' అని పేర్కొన్నారు నాగచైతన్య. ''రోలింగ్ గ్లోరీ. ఎగ్జైటెడ్.. ఎగ్జైటెడ్.. ఎగ్జైటెడ్. మూవీ విత్ హస్బెండ్'' అన్నారు సమంత. ''ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది'' అని నిర్మాతలు తెలిపారు. పెళ్లికి ముందు 'ఏమాయ చేసావె, 'ఆటోనగర్ సూర్య, మనం' చిత్రాలు చేసిన చై–సామ్ పెళ్లి తర్వాత సైన్ చేసిన ఫస్ట్ సినిమా ఇదే.

హలో గురు ప్రేమ కోసమే



త్రినాథరావు, అనుపమా పరమేశ్వరన్, రామ్, 'దిల్' రాజు, శిరీష్

లైఫ్‌లో లవ్ పార్ట్ సెపరేట్ గురూ! ఆ మజానే వేరు. అందుకే ప్రేమ కోసం ఎంత దాకా అయినా వెళ్లాలి. ఏం చేయడానికైనా తెగించాలి అంటున్నారు హీరో రామ్. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రామ్ హీరోగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు నిర్మిస్తున్న చిత్రం ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ చిత్రానికి 'హలో గురు ప్రేమకోసమే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ చదవగానే 'హలో గురూ ప్రేమకోసమే రోయ్ జీవితం..' అని 'నిర్ణయం'లో నాగార్జున సందడి చేసిన పాట గుర్తొస్తోంది కదూ. ఆ సంగతలా ఉంచితే.. 'ఉన్నది ఒక్కటే జిందగీ' సినిమా తర్వాత మరోసారి రామ్‌కు జంటగా ఈ సినిమాలో అనుపమా పరమేశ్వరన్ నటిస్తున్నారు. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వంశీ పైడిపల్లి క్లాప్ ఇవ్వగా, దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాతలు ఎర్నేని నవీన్, 'స్రవంతి' రవికిషోర్ స్క్రిప్ట్‌ను డైరెక్టర్‌కు అందించారు. దర్శకుడు హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ప్రకాశ్‌రాజ్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ''రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 12న స్టార్ట్ కానుంది. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు స్వరాలు సమకూర్చనున్నారు'' అని చిత్రబృందం అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కె.చక్రవర్తి.



శ్రీదేవి

ఎవరికీ తెలియని విషయాలతో...

శ్రీదేవి నాలుగేళ్ల వయసులో సినిమాల్లోకి వచ్చింది. 13 ఏళ్ల వయసులో హీరోయిన్ అయింది. చైల్డ్ ఆర్టిస్ట్ టు హీరోయిన్.. ఆమె కెరీర్ 50 ఏళ్లు. 'ఆల్ ఇండియా సూపర్ స్టార్'. హిందీ నిర్మాత బోనీ కపూర్‌ని పెళ్లి చేసుకున్నారు. ఇలాంటి విషయాలన్నీ అందరికీ తెలిసినవే. ఎవరికీ తెలియని విషయాలు చాలా ఉన్నాయి. అలాంటి అరుదైన విషయాలతో బోనీ కపూర్ ఓ డాక్యుమెంటరీ తీయడానికి ప్లాన్ చేస్తున్నారని సమాచారం. భార్య హఠాన్మరణాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నారని, ఆమె మరణం గురించి పలువురు పలు రకాలుగా మాట్లాడుకోవడం ఆయన్ను మరింత బాధపెడుతోందని సన్నిహితులు అంటున్నారు. భార్య గురించి ఎవరికీ తెలియని విశేషాలతో ఆయన తీయనున్న డాక్యుమెంటరీలో శ్రీదేవి జీవితంలోని కీలక వ్యక్తులు తమ అభిప్రాయాలు పంచుకుంటారని సమాచారమ్. జగదేక సుందరి కెరీర్‌లో చెప్పుకోదగ్గ చిత్రాల్లో ఒకటైన 'మిస్టర్ ఇండియా' దర్శకుడు శేఖర్ కపూర్ ఈ డాక్యుమెంటరీని తెరకెక్కించనున్నారట. కచ్చితంగా ఈ చిత్రం కోసం శ్రీదేవి అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తారు. బోనీ నుంచి ఎప్పుడు అధికారిక ప్రకటన వస్తుందో చూడాలి.

అవును.. నిజమే!



ఇలియానా

''అవును... నిజమే. 'రైడ్' మూవీకి అజయ్ నన్ను రిఫర్ చేశాడు. 'ముబారక్' సినిమాలో నా కో–స్టార్ అర్జున్ కపూర్ కూడా ఓ సినిమా స్క్రిప్ట్‌ను పరిశీలించమన్నాడు. ఏదైనా నాకు నచ్చితేనే చేస్తా. అయినా వరుసగా రెండు సినిమాలు ఒక హీరో పక్కన చేస్తే చాలు.. ఏవేవో పుకార్లు పుట్టిస్తుంటారు. అవన్నీ నిజం కావు'' అంటున్నారు ఇలియానా. ఇంతకీ మేటర్ ఏంటంటే... బాలీవుడ్ హీరో అజయ్ దేవగణ్ సరసన 2016లో 'బాద్‌షాహో', ఈ ఏడాది ఈ నెలలో రిలీజ్ కానున్న 'రైడ్' చిత్రాల్లో కథానాయిక నటించారు ఇలియానా. ప్రస్తుతం ఇంద్రకుమార్ దర్శకత్వంలో 'ధమాల్' ఫ్రాంచైజీ 'టోటల్ ధమాల్ 3'లో నటిస్తున్నారు అజయ్. ఈ సినిమాలో ఇలియానా ఓ ముఖ్య పాత్ర పోషించేలా అజయ్ పావులు కదుపుతున్నారని వార్తలు గుప్పుమన్నాయి. ఈ విషయంపై ఇలియానా స్పందిస్తూ– ''టోటల్ ధమాల్' చిత్రంలో నటించమని నన్నెవరూ సంప్రదించలేదు. ఈ సినిమాకి అజయ్ నన్ను రికమండ్ చేశాడని వస్తున్న వార్తలు నిజం కావు. ఇలాంటివి విన్నప్పుడు ఫన్నీగా ఉంటుంది. ప్రచారంలో ఉన్నట్లుగా అజయ్‌తో నాకెలాంటి సంబంధం లేదు. ఒకరి గురించి ఇలాంటి మాటలు ఎలా మాట్లాడతారో అర్థం కావడం లేదు'' అని పేర్కొన్నారు.

ఎవరూ నచ్చలేదు!



విజయ్ దేవరకొండ

అవును.. లిస్ట్‌లో ఉన్నవాళ్లు ఎవరూ నచ్చలేదు. అందుకే విజయ్ దేవరకొండ సింపుల్‌గా నోటా అనేశారు. అంటే.. ఏంటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులు నచ్చకపోతే 'నన్ ఆఫ్ ది ఎబౌ' అనే అప్షన్ ఒకటుంటుంది. అదే నోటా. ఆ బటన్ నొక్కితే చాలు.. ఆ ఓటర్ ఓటు ఎవరికీ పడదు. ఇంతకీ ఎన్నికలు రావడానికి ఇంకా చాలా టైముంది కదా. ఇప్పుడు నోటా గురించి చెప్పడం, అది కూడా విజయ్ దేవరకొండ ఓటు వేసినట్లు వేలు చూపడం ఏంటీ అనుకుంటున్నారా? మరేం లేదు. విజయ్ దేవరకొండ, మెహరీన్ జంటగా 'ఇంకొక్కడు' ఫేమ్ ఆనంద్ శంకర్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న చిత్రానికి 'నోటా' అనే టైటిల్‌ని ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: సి.ఎస్. శ్యామ్, కెమెరా: శాంత, ఆర్ట్: కిరణ్.

మగవాళ్లు చేయలేనివి చేయడానికే...

...అంటున్నారు నిత్యామీనన్. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ఈ విధంగా అన్నారు. జనరల్‌గా ''ఆడవాళ్లు ఎందులోనూ తక్కువ కాదు.. మగవాళ్లతో సమానం. మగవాళ్లు చేసే ఉద్యోగాలు ఆడవాళ్లు కూడా చేయగలుగుతారు''.. ఇలాంటి మాటలను మనం మహిళా దినోత్సవం సందర్భంగా వింటుంటాం. అయితే నిత్యామీనన్ డిఫరెంట్‌గా చెప్పారు. ''మన తరానికి చెందినవాళ్లం మగవాళ్లు చేసే పనులు మనం కూడా చేయగలం అని నిరూపించుకోవడంలో బిజీగా ఉంటున్నాం. మన అధికారాన్ని మనం కోల్పోతున్నట్లుగా ఫీలవుతున్నాం. అయితే నేను చెప్పేదేంటంటే.. మగవాళ్లు చేసే అన్ని పనులు చేయడానికి ఆడవాళ్లు పుట్టలేదు. మగవాళ్లు చేయలేనివి చేయడానికే ఆడవాళ్లు సృష్టించబడ్డారు'' అని నిత్యామీనన్ పేర్కొన్నారు. అవును కదా.. ఎప్పుడూ మగవాళ్లకు సమానంగా ఉండాలని చాలామంది ఆలోచిస్తారు కానీ, ఇంకో మెట్టు పైన ఉండాలని ఎందుకు ఆలోచించరు? నిత్యామీనన్ చెప్పినట్లుగా మగవాళ్లు చేయగలవి కాకుండా చేయలేనివి చేయగలమని ఆలోచించడం వల్ల ఇంకో మెట్టు పైన ఉన్నట్లే కదా. అన్నట్లు.. పై మాటలు చెప్పాక, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు నిత్యామీనన్.



నిత్యామీనన్

కోటికొక్కడు



సుదీప్

కన్నడ స్టార్, 'ఈగ' ఫేమ్ సుదీప్, నిత్యామీనన్ జంటగా కేయస్ రవికుమార్ దర్శకత్వంలో కన్నడ, తమిళ్ భాషల్లో రూపొందిన చిత్రం 'కోటిగొబ్బ–2'. ఈ సినిమాను దుహర మూవీస్ పతాకంపై నిర్మాత కల్యాణ్ ధూళిపాళ్ల 'కోటికొక్కడు' అనే టైటిల్‌తో తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కల్యాణ్ మాట్లాడుతూ– ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రీసెంట్‌గా 'రచయిత' సినిమాను నిర్మించాను. మంచి అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చిపెట్టింది. రెండోది మాస్ కమర్షియల్ మూవీ చేయాలనుకుంటున్న టైమ్‌లో 'కోటిగొబ్బ–2' చుశాను. నాకు బాగా నచ్చింది. తమిళ్, కన్నడ భాషల్లో ఆల్మోస్ట్ 120కోట్లకుపైగా కలెక్ట్ చేసింది. తెలుగులో కూడా కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందన్న నమ్మకం ఉంది'' అన్నారు. ''సుదీప్ చేసిన బెస్ట్ మూవీస్‌లో 'కోటికొక్కడు' పెద్ద హిట్ సాధించింది. 'రచయిత' చిత్రంతో మంచి నిర్మాతగా కల్యాణ్ పేరు తెచ్చుకున్నాడు. అతను రిలీజ్ చేస్తున్న ఈ సినిమా కూడా హిట్ సాధించాలి'' అన్నారు దర్శకుడు సముద్ర. ''కల్యాణ్ మంచి అభిరుచి ఉన్న నిర్మాత మాత్రమే కాదు ప్యాషన్ ఉన్న నిర్మాత కూడా. కేయస్ రవికుమార్ పెద్ద హీరోలతో సినిమాలు చేశారు. సుదీప్ యాక్టింగ్ సూపర్. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు ఎస్వీఆర్ మీడియా శోభారాణి. ప్రకాశ్‌రాజ్, నాజర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: డి. ఇమ్మాన్.

మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'అమృత' చిత్రంలో అమృతగా నటించిన చిన్నారి గుర్తుందా? ఆ పాప అసలు పేరు కీర్తన. నటుడు పార్తీబన్, నటి సీత కూతురు. కీర్తనకి ఇప్పుడు పాతికేళ్ల వయసు. ఎడిటర్ శ్రీకర ప్రసాద్ తనయుడు, దర్శకుడు అక్షయ్‌ని కీర్తన గురువారం పెళ్లాడింది. నూతన వధూవరులను ఆశీర్వదించడానికి సూపర్ స్టార్ రజనీకాంత్ హాజరయ్యారు.



కొత్త విషయాలు నేర్చుకున్నా

''ఒక కాన్సెప్ట్‌తో సినిమా చేశాం. ఆడియన్స్‌కు కనెక్ట్ అయితే హ్యాపీ. లేకపోతే నా ఐడియాలజీని పరిశీలించుకుని, తప్పులను దిద్దుకుని మంచి సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తాను. అందుకే ఈరోజు సినిమా రిలీజ్ అవుతున్నా నాకు ఆత్రుత, భయం లేవు. ఈ చిత్రం విడుదల ఆలస్యం అయినందుకు బాధగా లేదు. 'ఏ మంత్రం వేశావె' సినిమా జర్నీలో కొత్త విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు దర్శకుడు శ్రీధర్ మర్రి. విజయ్ దేవరకొండ, శివానీ సింగ్ జంటగా శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ సమర్పణలో రూపొందిన 'ఏ మంత్రం వేశావె' సినిమా ఈ రోజు విడుదల కానుంది. శ్రీధర్ మాట్లాడుతూ– ''ఈ రోజుల్లో మనం టెక్నాలజీని కంట్రోల్ చేస్తున్నామా? లేక టెక్నాలజీ మనల్ని కంట్రోల్ చేస్తుందా? అనే పాయింట్‌పై రూపొందించిన చిత్రమిది. గేమ్‌కు ఎడిక్టై ఉన్న క్యారెక్టర్‌లో హీరో విజయ్ కనిపిస్తారు. అలాంటి వ్యక్తి నార్మల్ లైఫ్‌లోకి ఎలా వచ్చాడన్నదే కథాంశం. 'పెళ్లి చూపులు' సినిమాకు ముందే ఈ కథను విజయ్ దేవరకొండకు చెప్పాను. సినిమాపై నమ్మకంతో శివకుమార్‌గారు వైడ్‌గా రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.



శ్రీధర్ మర్రి

నీకై ఎదురు చూస్తుంటాలే!

అంజలి, ఆండ్రియా, వసంత్ ముఖ్య తారలుగా రామ్ దర్శకత్వంలో రూపొంది, తమిళ్‌లో విజయవంతమైన చిత్రం 'తారామణి'. జె.ఎస్.కె ఫిల్మ్ కార్పొరేషన్ సమర్పణలో డీవీ సినీ క్రియేషన్స్ పతాకంపై డి. వెంకటేశ్ అదే టైటిల్‌తో తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలోని 'చేతులు చాచి.. యుగములు వేచి, నీకై ఎదురు చూస్తుంటాలే..' అనే పాటను సంగీతదర్శకురాలు, గాయని ఎం.ఎం. శ్రీలేఖ విడుదల చేశారు. శ్రీలేఖ మాట్లాడుతూ– ''తెలుగులో ఈ సినిమాను విడుదల చేయడం చాలా హ్యాపీగా ఉంది. డైరెక్టర్ రామ్ చాలా బాగా తీశారు. వెంకటేశ్‌గారు స్ట్రైట్ మూవీస్ తీసి, సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''లేడీ ఆడియన్స్‌కు బాగా రీచ్ అవుతుందనే శ్రీలేఖగారితో ఈ పాటను రిలీజ్ చేయించాం. తమిళ్‌లో మంచి కలెక్షన్స్‌ను రాబట్టిన ఈ సినిమా తెలుగులో అంత కంటే పెద్ద హిట్ సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు డి. వెంకటేశ్.




డి. వెంకటేశ్, శ్రీలేఖ

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2018

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), యూజీసీతో కలసి నిర్వహించే 'సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2018' నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో పరిశోధనలకు జేఆర్ఎఫ్, లెక్చరర్‌షిప్‌నకు అర్హత లభిస్తుంది. సంబంధిత విభాగాలను బట్టి కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ-50 శాతం) మార్కులతో ఎంఎస్సీ/ఇంటెగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్/బీఎస్ (నాలుగేళ్లు)/బీఈ/బీటెక్/ బీఫార్మా/ఎంబీబీఎస్/బీఎస్సీ (ఆనర్స్)/ఇంటెగ్రేటెడ్ ఎంఎస్-పీహెచ్‌డీ/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు. వయసు.. 2018, జనవరి 1 నాటికి జేఆర్ఎఫ్ అభ్యర్థులకు 28 ఏళ్లు మించకూడదు. లెక్చరర్‌షిప్‌నకు వయోపరిమితి లేదు.
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ మార్చి 26, 2018.
పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.csirhrdg.res.in



ప్రవేశాలు

ఎన్ఐటీల్లో.. ఎంసీఏకు నిమ్‌సెట్

దేశంలో ఇంజనీరింగ్ విద్యకు పెట్టింది పేరు.. ఐఐటీలు. అలాగే మేనేజ్‌మెంట్ కోర్సులు అనగానే గుర్తొచ్చేది ఐఐఎంలు. మరి ఎంసీఏ కోర్సుకు ప్రముఖ విద్యాసంస్థలు ఏవంటే.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లు అనే సమాధానం వస్తుంది. దేశవ్యాప్తంగా 30కి పైగా ఎన్ఐటీలు ఉండగా.. 11 మాత్రమే ఎంసీఏ కోర్సును అందిస్తున్నాయి. ఐటీ రంగంలో స్థిరపడాలనుకుంటున్న వారికి ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సులు చేస్తే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. ఇందుకు విద్యార్థులు రాయాల్సిన ప్రవేశ పరీక్ష.. నిమ్‌సెట్ (నిట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్). 2018–19 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే నిమ్‌సెట్‌కు ఎన్ఐటీ సూరత్‌కల్ (కర్ణాటక) ప్రకటన విడుదల చేసింది.

నిమ్‌సెట్‌తో ప్రయోజనాలు

- నిమ్‌సెట్‌తో 11 నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీల్లో ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్)లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో నిట్–వరంగల్ ఒకటి.
- సాఫ్ట్‌వేర్ నిపుణుడిగా స్థిరపడాలనుకునే వారికి మంచి ప్రత్యామ్నాయం ఎంసీఏ.
- ఎన్ఐటీల్లో ఎంసీఏ పూర్తిచేసిన వారు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది.
- **అర్హత:** మ్యాథ్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా 60 శాతం మార్కులతో బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్/బీసీఏ/బీఐటీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల సంఖ్య 805

ఎంసీఏ కోర్సు అందిస్తున్న 11 ఎన్ఐటీల్లో మొత్తం 805 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీట్లన్నీ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన అఖిల భారత స్థాయిలో భర్తీ చేస్తారు. రాష్ట్ర కోటాలో ప్రత్యేకంగా ఎలాంటి సీట్లు ఉండవు. ఎన్ఐటీ వరంగల్‌లో 46 సీట్లు, అగర్తలా–40, అలహాబాద్–93, భోపాల్–92, కాలికట్–46, దుర్గాపూర్–30, జంషెడ్‌పూర్–92, కురుక్షేత్ర–60, రాయ్‌పూర్–92, సూరత్కల్–92, తిరుచిరాపల్లి–92, కురుక్షేత్ర–30 (సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులు) సీట్లు ఉన్నాయి.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 31 మార్చి, 2018
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2200; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.1100.
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్:** మే 14 నుంచి మే 25 వరకు.
- **పరీక్ష తేదీ:** 27 మే, 2018 (ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు).
- **ఫలితాల వెల్లడి:** 6 జూన్, 2018
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం:** వరంగల్
- **వెబ్‌సైట్:** www.nimcet.in

పరీక్ష విధానం

- మల్టిపుల్ చాయిస్ విధానంలో రాత పరీక్ష ఉంటుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది. ప్రవేశ పరీక్షలో కనబర్చే ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు ర్యాంకులు కేటాయిస్తారు.
- పరీక్షలో నాలుగు విభాగాల్లో మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి. గణితం–50, అనలిటికల్ ఎబిలిటీ–లాజికల్ రీజనింగ్–40, కంప్యూటర్ అవేర్‌నెస్–10, జనరల్ ఇంగ్లిష్- 20 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు.
- ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు ప్రశ్నకు 1 మార్కు కోత ఉంటుంది.

ప్రిపరేషన్

- **మ్యాథమెటిక్స్:** సెట్ థియరీ, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఆల్జీబ్రా, కో–ఆర్డినేట్‌జామెట్రీ, క్యాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగ్నోమెట్రీ వంటి అంశాలను సిలబస్‌లో పొందుపరిచారు. ఈ సిలబస్ అంతా ఇంటర్‌లో ఉన్నదే కాబట్టి విద్యార్థులు ఇంటర్ పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. ఇక ఇది జాతీయ స్థాయి పరీక్ష. అప్లికేషన్ ఓరియెంటెడ్‌గా ప్రశ్నలు ఉంటాయి. ప్రాక్టీస్ బాగా చేస్తే మంచి మార్కులు పొందవచ్చు. అకాడమీ పుస్తకాలు చదివితే సన్నద్ధత లభిస్తుంది.
- **అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్:** డేటా అనాలిసిస్, కోడింగ్–డీకోడింగ్, సీక్వెన్సెస్ అండ్ సిరీస్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ సెక్షన్ పూర్తిగా అభ్యర్థుల విశ్లేషణ నైపుణ్యాన్ని పరీక్షిస్తాయి.
- **జనరల్ ఇంగ్లిష్:** కాంప్రెహెన్షన్, బేసిక్ గ్రామర్, వొకాబ్యులరీపై ప్రశ్నలు అడుగుతారు. వర్డ్ పవర్, సినానిమ్స్, యాంటోనిమ్స్, టెక్నికల్ రైటింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **కంప్యూటర్ అవేర్‌నెస్:** బేసిక్స్ నాలెడ్జ్‌ను పరీక్షించేలా ప్రశ్నలు వస్తాయి. కంప్యూటర్ బేసిక్స్‌తోపాటు డేటా రిప్రజెంటేషన్ అంశాలపై దృష్టిసారించాలి. ఇంటీజర్స్, ఫ్రాక్షన్స్, బైనరీ–అర్థమెటిక్ ఆపరేషన్స్ కూడా ముఖ్యమైనవే.

డిగ్రీతో కొలువు
జీతం రూ.50 వేలు
ఢిల్లీ పోలీసు, సీఏపీఎఫ్ఎస్‌లో ఉద్యోగాలు



కేంద్ర సాయుధ బలగాలు, ఢిల్లీ పోలీస్ శాఖలో ఎస్ఐ, ఏఎస్ఐ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం 1223 ఎస్ఐ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. సీఐఎస్ఎఫ్‌లోని ఎస్ఐ, ఏఎస్ఐ ఖాళీలను తర్వాత వెల్లడిస్తారు. ఈ ఉద్యోగాలను పొందడం ద్వారా దేశసేవ చేసే అవకాశంతోపాటు ఉన్నత కెరీర్‌ను సొంతం చేసుకునేందుకు వీలవుతుంది. రూ.50 వేలకు తక్కువ కాకుండా వేతనం అందుకోవచ్చు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

భర్తీచేసే ఉద్యోగాలు

- ఢిల్లీ పోలీస్ విభాగంలో పురుషులకు 97, మహిళలకు 53 ఎస్ఐ పోస్టులు ఉన్నాయి.
- సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్ఎస్) విభాగంలో పురుషులకు 1035, మహిళలకు 38 ఎస్ఐ పోస్టులు అందుబాటులో ఉన్నాయి.
- సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లో సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ ఉంటాయి.

అర్హతలు

జాబ్ ఇన్ఫో

- ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. 2018, ఆగస్టు 1 నాటికి డిగ్రీ పూర్తి చేయబోయే వారూ అర్హులే. వీటితోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలి.
- 2018, ఆగస్టు 1 నాటికి వయసు 20–25 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయోపరిమితిలో ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంది. ఢిల్లీ పోలీస్‌లోని ఎస్ఐ పోస్టులకు దరఖాస్తు చేసుకునే పురుష అభ్యర్థులకు డ్రైవింగ్ లైసెన్స్ (లైట్ మోటార్ వెహికల్) తప్పనిసరి.

శారీరక ప్రమాణాలు

- **ఎస్టీ పురుషులకు:** ఎత్తు– 162.5 సెం.మీ., ఛాతీ–77 సెం.మీ, గాలి పీల్చినప్పుడు– 82 సెం.మీ.
- **ఇతర కేటగిరీల పురుషులకు:** ఎత్తు– 170 సెం.మీ., ఛాతీ– 80 సెం.మీ., గాలి పీల్చినప్పుడు– 85 సెం.మీ.
- **ఎస్టీ మహిళలకు:** ఎత్తు 154 సెం.మీ. ఉండాలి.
- **ఇతర కేటగిరీల మహిళలకు:** ఎత్తు 157 సెం.మీ. ఉండాలి.
- **బరువు:** ఎత్తుకు తగిన బరువు ఉండాలి.

పీఈటీ

పురుష అభ్యర్థులకు..
- 16 సెకన్లలో 100 మీటర్ల పరుగు.
- 6.5 నిమిషాల్లో 1.6 కి.మీ. దూరం పరుగు.
- లాంగ్‌జంప్–3.65 మీటర్లు (మూడు అవకాశాల్లో).
- హైజంప్–1.2 మీటర్లు (మూడు అవకాశాల్లో).
- షాట్‌పుట్ (16 ఎల్‌బీఎస్)– 4.5 మీటర్లు (మూడు అవకాశాల్లో).

మహిళా అభ్యర్థులకు...
- 18 సెకన్లలో 100 మీటర్లు పరుగు.
- 4 నిమిషాల్లో 800 మీటర్లు.
- లాంగ్‌జంప్–2.7 మీటర్లు (మూడు అవకాశాల్లో).
- హైజంప్– 0.9 మీటర్లు (మూడు అవకాశాల్లో).

ఎంపిక విధానం

పోస్టుల భర్తీలో భాగంగా కంప్యూటర్ ఆధారిత టెస్టులు, దేహ దారుఢ్య పరీక్షలు, మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు. మొదట ఆన్‌లైన్‌లో పేపర్–1 పరీక్ష ఉంటుంది. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్టులు/ఫిజికల్ స్టాండర్డ్ టెస్టులు (పీఎస్‌టీ) ఉంటాయి. ఇందులోనూ అర్హత సాధిస్తే మరో కంప్యూటర్ ఆధారిత పరీక్ష పేపర్–2 ఉంటుంది. పేపర్–1, 2లో పొందే మార్కుల ఆధారంగా తుది జాబితా రూపొందిస్తారు. అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన, మెడికల్ టెస్టులు ఉంటాయి. ఈ దశలు దాటిన తర్వాత మెరిట్ జాబితా ప్రాతిపదికన, అభ్యర్థుల ప్రాధాన్యాల మేరకు డిపార్ట్‌మెంట్ కేటాయిస్తారు.

వేతనాలు

గ్రూప్–బీ, సీ విభాగాలకు చెందిన ఈ పోస్టులకు ఎంపికైతే మంచి వేతనాలు లభిస్తాయి. సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు లెవెల్–6 పేస్కేలు ప్రకారం– రూ.35,400–రూ.1,12,400 వేతనం అందుతుంది. అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్ పోస్టులకు లెవెల్–5 పేస్కేలు ప్రకారం– రూ.29,200–రూ.92,300 వేతనం ఉంటుంది. ఇతర అలవెన్సులూ ఇస్తారు.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018.
- **దరఖాస్తు రుసుం:** రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.
- **పేపర్ 1 పరీక్ష తేదీలు:** 2018, జూన్ 4 నుంచి జూన్ 10 వరకు.
- **పేపర్ 2 పరీక్ష:** 2018, డిసెంబర్ 1.
- **వెబ్‌సైట్:** www.ssc.nic.in

సన్నద్ధత

- కంప్యూటర్ ఆధారిత పరీక్షలో రెండు పేపర్లుంటాయి. ఒక్కో పేపరుకు 200 మార్కులు. పేపర్–1లో 50 మార్కులు ఇంగ్లిష్‌కు కేటాయించారు. పేపర్–2లో పూర్తిగా ఇంగ్లిష్ మాత్రమే ఉంటుంది. కాబట్టి ఇంగ్లిష్ సెక్షన్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి.
- పేపర్–1లో ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్‌తోపాటు జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్–జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాలు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 50 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం 2 గంటలు. పేపర్–2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్–కాంప్రెహెన్షన్ నుంచి 200 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష సమయం 2 గంటలు. పేపర్–1, 2లలో నెగెటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు కోత విధిస్తారు.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్:** వొకాబ్యులరీ, గ్రామర్, రీడింగ్ కాంప్రెహెన్షన్ విభాగాలకు సమ ప్రాధాన్యం లభిస్తుంది. పరీక్ష ముఖ్య ఉద్దేశం.. ఇంగ్లిష్‌ను అర్థం చేసుకోవడం, బేసిక్ రైటింగ్ స్కిల్స్‌ను పరీక్షించడం. పేపర్–1, 2ల సిలబస్ ఒకేలా ఉంటుంది. రీడింగ్ కాంప్రెహెన్షన్ (ఆర్‌సీ)లో నీతి కథలు, ఎకానమీ, ఆర్థిక సంబంధ ఎస్సేలు, సామాజిక సమస్యలపై ప్యాసేజీలు వస్తున్నాయి. ఇవి అభ్యర్థి ఇంగ్లిష్ భాషను ఏ మేరకు అర్థం చేసుకుంటున్నాడు, క్రిటికల్‌గా ఇచ్చిన సమాచారాన్ని ఎలా విశ్లేషించుకోగలుగుతున్నాడు తదితర అంశాలను పరీక్షించేలా ఉంటాయి. ఆర్‌సీలో రాణించడానికి రీడింగ్ స్కిల్స్ అలవరచుకోవాలి. రోజూ ఏదైనా ఒక ప్రామాణిక ఇంగ్లిష్ దినపత్రికను చదివితే మంచి ఫలితాలు ఉంటాయి. వొకాబ్యులరీ పరంగా సినానిమ్స్, ఆంటోనిమ్స్, స్పెల్లింగ్ ఎర్రర్స్ తదితరాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అభ్యర్థులు ఎక్కువగా దృష్టిసారించాల్సిన ముఖ్యమైన విభాగం గ్రామర్. స్పాటింగ్ ద ఎర్రర్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, సెంటెన్స్ అరేంజ్‌మెంట్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, డైరెక్ట్/ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్ తదితర విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. గ్రామర్ రూల్స్ తెలుసుకొని, వాటి అప్లికేషన్ ఆధారిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. వొకాబ్యులరీ పార్ట్‌పై పట్టు సాధించేందుకు కృషిచేయాలి.
- **జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్:** ఈ విభాగంలో వెర్బల్, నాన్ వెర్బల్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. ప్రశ్నల క్లిష్టత స్థాయి సులువుగా ఉంటుంది. దీనిలో సిరీస్ (నంబర్/ఆల్ఫా న్యూమరిక్) విభాగం నుంచి ఎక్కువ ప్రశ్నలు రావడానికి ఆస్కారముంది. అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాయిజమ్, మాట్రిక్స్, దిశలు, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్, డీకోడింగ్ తదితర అంశాలు అధ్యయనం చేయాలి.
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ఇందులో సింపుల్ ఇంట్రెస్ట్, కాంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, శాతాలు, త్రికోణమితి, ఆల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్ అధ్యాయాలు ముఖ్యమైనవి. అభ్యర్థులు తొలుత బేసిక్స్‌పై పట్టు సాధించాలి. ప్రిపరేషన్ క్రమంలో సులువైన చాప్టర్లతో ప్రారంభించి, కఠినమైన సెక్షన్లకు వెళ్లాలి. ఎస్ఎస్‌సీ నిర్వహించే పరీక్షల్లో చాలావరకు గతంలో వచ్చిన తరహాలోనే (మోడల్) ప్రశ్నలు పునరావృతమవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రీవియస్ పేపర్లను తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** ఇందులో హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, జనరల్ సైన్స్, స్టాండర్డ్ జీకే, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. సోషల్ స్టడీస్, జనరల్ సైన్స్ విభాగాల నుంచి ఎక్కువ ప్రశ్నలు రావడానికి అవకాశం ఉంటుంది. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, ప్రీవియస్ క్వశ్చన్ పేపర్స్ ప్రిపరేషన్‌కు ఉపయోగపడతాయి.

ఫోర్బ్స్ ప్రపంచ సంపన్నుల జాబితా

ఫోర్బ్స్ మ్యాగజైన్ 2018 సంవత్సరానికి ప్రపంచ శ్రీమంతుల జాబితాను మార్చి 6న ప్రకటించింది. ఈ జాబితాలో మొత్తం 2,208 మంది బిలియనీర్లకు స్థానం లభించింది. దీన్ని 2018, ఫిబ్రవరి 9 నాటి షేర్ల ధరలను పరిగణనలోకి తీసుకొని రూపొందించారు. 2017లో 7.7 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న బిలియనీర్ల సంపద.. ఈ ఏడాది 9.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది.


జెఫ్ బెజోస్

- 2018 ప్రపంచ సంపన్నుల జాబితాలో అగ్రస్థానాన్ని తొలిసారిగా అమెజాన్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జెఫ్ బెజోస్ దక్కించుకున్నారు. ఆయన సంపద 112 బిలియన్ డాలర్లు. గత 24 ఏళ్లలో 18 ఏళ్లపాటు మొదటిస్థానంలో ఉన్న మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ రెండోస్థానానికి పడిపోయారు. ఆయన సంపద 91.2 బిలియన్ డాలర్లు.

టాప్ టెన్ బిలియనీర్లు

	పేరు	దేశం	కంపెనీ
1.	జెఫ్ బెజోస్	అమెరికా	అమెజాన్
2.	బిల్‌గేట్స్	అమెరికా	మైక్రోసాఫ్ట్
3.	వారెన్ బఫెట్	అమెరికా	బెర్క్‌షైర్‌హతవే
4.	బెర్నార్డ్ అర్నాల్ట్	ఫ్రాన్స్	ఎల్‌వీఎంహెచ్
5.	మార్క్ జుకర్‌బర్గ్	అమెరికా	ఫేస్‌బుక్
6.	అమాన్సియో ఒర్టెగా	స్పెయిన్	జారా
7.	కార్లోస్ స్లిమ్ హేలూ	మెక్సికో	టెల్‌మెక్స్
8.	చార్లెస్ కోచ్	అమెరికా	కోచ్ ఇండస్ట్రీస్
9.	డేవిడ్ కోచ్	అమెరికా	కోచ్ ఇండస్ట్రీస్
10.	లారీ ఎల్లిసన్	అమెరికా	ఒరాకిల్

- ఫోర్బ్స్ 2018 జాబితాలో 119 మంది భారతీయులకు చోటు దక్కింది. ఇందులో 18 మంది కొత్తవారు ఉన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 40.1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2,60,622 కోట్లు) సంపదతో ప్రపంచ సంపన్నుల జాబితాలో 19వ స్థానంలో నిలిచారు. వరుసగా 11వ ఏడాది ముకేశ్ అంబానీ అత్యంత ధనవంతుడైన భారతీయుడిగా కొనసాగుతున్నారు.

టాప్ టెన్ భారతీయ సంపన్నులు

	పేరు	ప్రపంచ ర్యాంక్
1.	ముకేశ్ అంబానీ	19
2.	అజీమ్ ప్రేమ్‌జీ	58
3.	లక్ష్మీ మిట్టల్	62
4.	శివ్‌నాడార్	98
5.	దిలీప్ సంఘ్వీ	115
6.	కుమార్ మంగళం బిర్లా	127
7.	ఉదయ్ కోటక్	143
8.	రాధాకిషన్ దమానీ	151
9.	గౌతమ్ అదానీ	154
10.	సైరస్ పూనావాలా	170

- 2018 ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో 256 మహిళా బిలియనీర్లు ఉన్నారు. అలైస్ వాల్టన్ ప్రపంచంలోనే అత్యంత సంపన్న మహిళ. ఈమె వాల్‌మార్ట్ వ్యవస్థాపకుడు శామ్ వాల్టన్ కుమార్తె. అలైస్ సంపద విలువ 46 బిలియన్ డాలర్లు.
- ఈ జాబితాలో 8 మంది భారతీయ మహిళలు ఉన్నారు. 8.8 బిలియన్ డాలర్ల సంపదతో సావిత్రి జిందాల్ భారత్‌లో అత్యంత సంపన్న మహిళగా నిలిచారు. ఆమెకు ఫోర్బ్స్ జాబితాలో 176వ ర్యాంక్ లభించింది. తర్వాతి స్థానాల్లో కిరణ్ మజుందార్ షా (629), స్మితా గోద్రెజ్ (822), లీనా తివారీ (1020), వినోద్ రాయ్ గుప్తా (1103), అను ఆగా (1650), షీలా గౌతమ్ (1,999), మధు కపూర్ (1,999) ఉన్నారు.
- ఫోర్బ్స్ జాబితాలో ఇద్దరు తెలుగు వారికి చోటు దక్కింది. అరబిందో ఫార్మా వ్యవస్థాపకుడు పి.వి.రాంప్రసాద్ రెడ్డి (965), దివీస్ ఛైర్మన్ దివి మురళి (1070) ఈ జాబితాలో ఉన్నారు.

లారెస్ అవార్డులు

కాంపిటీటివ్ గైడెన్స్
కరెంట్ అఫైర్స్



2017 సంవత్సరానికి లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డులను 2018, ఫిబ్రవరి 27న మొనాకోలో ప్రకటించారు. గతేడాది రెండు గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలిచిన రోజర్ ఫెదరర్‌కు రెండు లారెస్ పురస్కారాలు దక్కాయి. దీంతో ఇప్పటి వరకు అత్యధికంగా ఆరు లారెస్ పురస్కారాలు గెలుచుకున్న క్రీడాకారుడిగా చరిత్రకెక్కాడు.

- **స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ద ఇయర్**– రోజర్ ఫెదరర్(టెన్నిస్).
- **స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్** – సెరెనా విలియమ్స్ (టెన్నిస్).
- **కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్**– రోజర్ ఫెదరర్ (టెన్నిస్).
- **బ్రేక్‌త్రూ ఆఫ్ ద ఇయర్**– సెర్జియో గార్సియా (గోల్ఫ్).
- **స్పోర్ట్స్‌పర్సన్ ఆఫ్ ద ఇయర్ విత్ ఏ డిస్ఎబిలిటీ** – మార్సెల్ హగ్ (అథ్లెటిక్స్).
- **టీమ్ ఆఫ్ ద ఇయర్**–మెర్సిడెస్(మోటార్ రేసింగ్)
- **లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్** – ఎడ్విన్ మోసెస్ (అథ్లెటిక్స్).



ఎన్.విజయేందర్‌రెడ్డి
విజయేందర్ అకాడమీ
హైదరాబాద్.

ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ భోపాల్‌లో 11 ఖాళీలు

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. 11 బోధనేతర ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు–ఖాళీలు:** డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ (డీఎంఎస్)–6; పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్‌వో)–1; అకౌంట్స్ ఆఫీసర్ (ఏవో)–2; లా ఆఫీసర్–1; సీనియర్ డైటీషియన్ (అసిస్టెంట్ ఫుడ్ మేనేజర్)–1. వేతనశ్రేణి: రూ.15,600–రూ.39,100. పోస్టును బట్టి గ్రేడ్ పే వేర్వేరుగా ఉంటుంది.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను బట్టి ఎంబీబీఎస్+ఎండీ/ఎంహెచ్ఏ/ఎండీ/ఎంఎస్/పీజీ/డిప్లొమా (పబ్లిక్ రిలేషన్స్/కార్పొరేట్ కమ్యూనికేషన్/జర్నలిజం/మాస్ కమ్యూనికేషన్)/లా డిగ్రీ/ఎంఎస్సీ (హోమ్‌సైన్స్–ఫుడ్ అండ్ న్యూట్రిషన్)/ఎంఎస్సీ (క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటీటిక్స్/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్ డైటీటిక్స్/ఫుడ్ సర్వీస్ మేనేజ్‌మెంట్ అండ్ డైటీటిక్స్). అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** డీఎంఎస్, సీనియర్ డైటీషియన్‌కు 21–40 ఏళ్ల లోపు; పీఆర్‌వో, లా ఆఫీసర్‌కు 30–45; అకౌంట్స్ ఆఫీసర్‌కు 21–35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 4, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 11, 2018.
- **వెబ్‌సైట్:** www.aimsbhopal.edu.in

సాక్షి బిజినెస్
శుక్రవారం 9-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌	నిఫ్టీ
318 ▲	88 ▲
33,352	10,243

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్‌	7,412	▲	15
డోజోన్స్‌	24,810	▲	9
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,203	▲	45
డాక్స్‌	12,356	▲	110
షాంఘై	3,289	▲	18
నికాయ్‌	21,368	▲	115

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	65.69	65.82
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	91.64	91.82
€	యూరో	ఎస్‌బీఐ	81.78	81.95
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	62.18	62.30
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	51.73	51.83
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	50.15	50.24
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	15.71	18.61
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	16.08	18.80
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	7.26	11.77

హైదరాబాద్‌లో 'హెలీ' ట్యాక్సీ



సీప్లేన్‌ సర్వీసులు సైతం

- ఆసక్తి కనబరుస్తున్న పవన్‌ హన్స్‌
- సంస్థ సీఎండీ బి.పి.శర్మ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: భాగ్యనగరిలో హెలీ ట్యాక్సీ సర్వీసులు సాకారం కానున్నాయి. భారత్‌లో హెలికాప్టర్‌ సర్వీసులందిస్తున్న ప్రభుత్వ రంగ దిగ్గజం పవన్‌ హన్స్‌ ఈ సేవల్ని ప్రారంభించనుంది. తొలుత హైదరాబాద్‌ నుంచి శంషాబాద్‌ విమానాశ్రయానికి హెలీ ట్యాక్సీ నడుపుతారు. డిమాండ్‌ ఉంటే నగరంలోనే ప్రధాన ప్రాంతాల మధ్య కూడా ట్యాక్సీ సర్వీసులు అందించేందుకు పవన్‌ హన్స్‌ సిద్ధంగా ఉన్నట్లు సంస్థ సీఎండీ బి.పి.శర్మ వెల్లడించారు. ఇక్కడ ప్రారంభమైన ఏవియేషన్‌ సదస్సులో ఆయన మీడియాతో మాట్లాడారు. హెలీ ట్యాక్సీ కోసం స్థానిక ప్రభుత్వ సంస్థ నుంచి ప్రతిపాదన వచ్చిందని చెబుతూ... హెలిపోర్టులను మాత్రం ప్రభుత్వమే ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

దక్షిణాదిలో అడుగుపెడతాం..

పవన్‌ హన్స్‌ ప్రస్తుతం ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో 42 హెలికాప్టర్లతో సేవలందిస్తోంది. దక్షిణాదిన అడుగుపెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని శర్మ వెల్లడించారు. 'భారత్‌లో సీప్లేన్‌ సేవలు ప్రారంభించేందుకు ప్రణాళికలు రెడీ చేశాం. కేంద్ర ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తోంది. నీళ్లపైనా, భూమి మీద కూడా దిగేందుకు సీప్లేన్స్‌ అనువైనవి. దేశవ్యాప్తంగా ఎన్నో సరస్సులున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌పైనా దృష్టిపెట్టాం. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌ అనువుగా ఉంటే ఈ సర్వీసులు ప్రారంభిస్తాం. హెలీ ట్యాక్సీ కింద టికెట్‌ ధర కనీసం రూ.2,500 ఉండొచ్చు' అని వివరించారు. కంపెనీ త్వరలో ఢిల్లీ–ఆగ్రా మార్గంలో హెలీ రెస్క్యూ సేవలు అందించనుంది.

100 హెలికాప్టర్లు సమకూర్చుకుంటాం..

హెలికాప్టర్ల సర్వీసులకు దేశంలో మంచి డిమాండ్‌ ఉందని శర్మ చెప్పారు. '2025 నాటికి మొత్తం 100 హెలికాప్టర్లు సమకూర్చుకుంటాం. కొత్త హెలికాప్టర్లు, సీప్లేన్స్‌ కొనుగోలుకు, పాతవి ఆధునీకరణ, విస్తరణకు వచ్చే 10 ఏళ్లలో రూ.4,000 కోట్లు వెచ్చించాలని నిర్ణయించాం. 21 రాష్ట్రాల్లో పవన్‌ హన్స్‌ విస్తరించింది. ఉడాన్‌ రెండో దశలో 111 రూట్లను దక్కించుకున్నాం. తద్వారా కొత్తగా 22 ప్రాంతాల్లో అడుగుపెడతాం. విస్తరణకు కావాల్సిన నిధుల కోసం వ్యూహాత్మక భాగస్వామి వేటలో ఉన్నాం. వాటా విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని సంస్థ ఆధునీకరణకు వెచ్చిస్తాం' అని వివరించారు.

భారత్‌కు 2,100 విమానాలు

ఇదీ... వచ్చే 20 ఏళ్లలో డిమాండ్‌: బోయింగ్‌



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: రానున్న 20 ఏళ్లలో భారత్‌లో కొత్తగా 2,100 విమానాలు అడుగుపెడతాయని బోయింగ్‌ అంచనా వేస్తోంది. వీటిలో చిన్నపాటి ఎయిర్‌క్రాఫ్ట్‌లు 85 శాతం ఉంటాయని బోయింగ్‌ కమర్షియల్‌ ఎయిర్‌ప్లేన్స్‌ ఆసియా పసిఫిక్, భారత్‌ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ దినేశ్‌ కేస్కర్‌ చెప్పారు. 'భారత్‌లో విమాన ప్రయాణికుల సంఖ్య 2017లో 20 శాతం వృద్ధితో 11.67 కోట్లుంది. ప్రపంచ సగటు వృద్ధి 7.3 శాతమే. దీనిని బట్టి భారత మార్కెట్‌ ఏ స్థాయిలో ఉందో గమనించవచ్చు. అయిదేళ్లుగా ఇక్కడ ప్యాసింజర్‌ ట్రాఫిక్‌ గణనీయ వృద్ధిని నమోదు చేస్తోంది. 2018లో దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య 13.5 కోట్లను దాటుతుంది. భారత మార్కెట్‌ వృద్ధి విషయంలో ఇప్పటి వరకు బోయింగ్‌ అంచనాలు ఎప్పుడూ తప్పు కాలేదు. అంచనాలను మించి ఇక్కడ కొత్త విమానాలు అడుగుపెట్టాయి' అని వెల్లడించారు.

లో కాస్ట్‌ క్యారియర్లదే..: భారత్‌లో లో కాస్ట్‌ క్యారియర్లదే హవా అని బోయింగ్‌ అభిప్రాయపడింది. 'నలుగురు ప్రయాణికుల్లో ముగ్గురు లో కాస్ట్‌ విమానాల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడున్న ఫ్లైట్స్‌లో 60% లో కాస్ట్‌ క్యారియర్లే. 2037 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ అవతరిస్తుంది. ప్రభుత్వ విధానాల సరళీకరణ, మధ్య తరగతి కుటుంబాలు పెరుగుతుండటంతో విమానయాన రంగం వృద్ధి బాటలో ఉంది. అయితే ఇందుకు తగ్గట్టుగా మౌలిక వసతులకు ప్రభుత్వం నిధులు వెచ్చించాలి. 2016 ప్రారంభం నుంచి ఇంధన ధరలు 81% పెరిగాయి. తక్కువ టికెట్‌ ధరలు, విమానాలు ఎక్కువ ప్రయాణికులతో నడవడం వంటి కారణాలతో కంపెనీలు లాభాలను ఆర్జించగలుగుతున్నాయి' అని దినేశ్‌ వెల్లడించారు.

విజయవంతంగా 'ఉడాన్‌'

మరిన్ని చిన్న నగరాలకు విమాన సర్వీసులు

- సంసిద్ధంగా ఉన్న విమానయాన సంస్థలు
- ఏవియేషన్‌ సెక్రటరీ ఆర్‌.ఎన్‌.చౌబే



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చౌబే

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: చిన్న నగరాలకు విమాన సర్వీసులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉడాన్‌ స్కీమ్‌ విజయవంతమైందని పౌర విమానయాన శాఖ పేర్కొంది. మరిన్ని పట్టణాలను అనుసంధానించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభ్యర్థనలు వెల్లువెత్తుతున్నాయని సివిల్‌ ఏవియేషన్‌ సెక్రటరీ ఆర్‌.ఎన్‌.చౌబే చెప్పారు. వింగ్స్‌ ఇండియా–2018లో భాగంగా గురువారమిక్కడ ఆయన వివిధ విమానయాన సంస్థల సీఈవోలతో సమావేశమైన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ''మరిన్ని ఎయిర్‌పోర్టుల ఆధునీకరణ చేపట్టాల్సిందిగా విమానయాన సంస్థలు కోరాయి. పరిశ్రమకు అవసరమైన మానవ వనరులను అందించేందుకు చర్యలు చేపట్టాలని కంపెనీలు అభ్యర్థించాయి. దేశంలో 15 రోజులకు ఒక కొత్త ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తోంది'' అని వివరించారు.

విదేశాలకు ఉడాన్‌ దన్ను..

ఉడాన్‌ను ఆసరాగా చేసుకుని భారత్‌ నుంచి ఆసియాన్‌ దేశాలకు విమాన సర్వీసులు విస్తరించేందుకు అస్సాం ప్రభుత్వం ముందుకు వచ్చిందని, మూడేళ్లపాటు వైమానిక సంస్థలకు ఏటా రూ.100 కోట్ల నిధులు సమకూర్చేందుకు అస్సాం ప్రభుత్వం ప్రతిపాదించిందని చౌబే తెలిపారు. 'వచ్చే అయిదారేళ్లలో భారత్‌కు 8–10 వేల మంది పైలట్లు అవసరమవుతారు. మూడేళ్లుగా దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య 20 శాతం వృద్ధి చెందింది. ఈ ఏడాది ఇది 17 శాతం ఉంటుంది. విమానాశ్రయాల విస్తరణకు వచ్చే నాలుగేళ్లలో రూ.18,000 కోట్లు వెచ్చించనున్నాం' అని వెల్లడించారు. చేతి నిండా డబ్బులున్న సంస్థలు మాత్రమే ఈ రంగంలో నిలదొక్కుకుంటాయని ఎయిర్‌ కోస్టాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నిధులుంటేనే విమానయాన రంగంలో ప్రవేశించాలని హితవు పలికారు.

వాటాల ఉపసంహరణ..

ఎయిర్‌ ఇండియాలో వాటాల ఉపసంహకరణకై కొద్ది రోజుల్లో ఆసక్తి వ్యక్తీకరణకు కంపెనీలను ఆహ్వానిస్తామని సివిల్‌ ఏవియేషన్‌ సెక్రటరీ వెల్లడించారు. అలాగే పవన్‌ హన్స్‌లో సైతం వాటా విక్రయిస్తున్నామని చెప్పారు. దీనికోసం ఆసక్తి వ్యక్తీకరణకు మరోసారి ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు.

భారత్‌కు రావడం 'అసాధ్యం'

నా పాస్‌పోర్టు రద్దు చేశారు

- అనారోగ్యం కారణంగా ప్రయాణం చేయలేను
- సీబీఐకి గీతాంజలి జెమ్స్‌ ప్రమోటర్‌ చోక్సీ ఈ–మెయిల్‌



న్యూఢిల్లీ: పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో నిందితుడైన గీతాంజలి జెమ్స్‌ ప్రమోటర్‌ మెహుల్‌ చోక్సీ తాజాగా సీబీఐకి లేఖ రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో విచారణలో సహకరించడానికి తాను భారత్‌ తిరిగి రావడం 'అసాధ్యం' అని ఆయన పేర్కొన్నారు. దీనికి ఇప్పటికే తన పాస్‌పోర్టు రద్దు కావడం ఒక కారణం కాగా.. అనారోగ్య సమస్యల వల్ల ప్రయాణం చేయలేకపోవడం మరో కారణమని చోక్సీ వివరించారు. పీఎన్‌బీని రూ. 12,700 కోట్లకు పైగా మోసం చేసిన వ్యవహారంలో వజ్రాభరణాల వ్యాపారి నీరవ్‌ మోదీ, చోక్సీ విదేశాలకు పరారైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణకు రావాలంటూ సీబీఐ పంపిన నోటీసులకు ఏడు పేజీల ఈ–మెయిల్‌లో చోక్సీ సుదీర్ఘ వివరణనిచ్చారు. 'పాస్‌పోర్ట్‌ చట్టం కింద రీజనల్‌ పాస్‌పోర్ట్‌ ఆఫీస్‌ నా పాస్‌పోర్ట్‌ను రద్దు చేసింది. దీంతో నేను భారత్‌కి రావడం అసాధ్యంగా మారింది. అంతే తప్ప విచారణకు హాజరయ్యే విషయంలో నేనెలాంటి షరతులు విధించడం లేదని మనవి చేసుకుంటున్నాను' అని చోక్సీ ఈ–మెయిల్‌లో పేర్కొన్నారు.

'భారత్‌ భద్రతకు ముప్పు' అనే కారణంతో తన పాస్‌పోర్ట్‌ సస్పెండ్‌ చేస్తున్నట్లు ఫిబ్రవరి 16న తనకు పాస్‌పోర్ట్‌ ఆఫీస్‌ నుంచి ఈ–మెయిల్‌ వచ్చిందని చోక్సీ వెల్లడించారు. తన వల్ల దేశానికి ఏం ముప్పు ఉందన్నది, పాస్‌పోర్ట్‌ను ఎందుకు రద్దు చేస్తున్నదీ పూర్తి వివరణేదీ అందులో లేదని తెలియజేశారు. మరోవైపు, 'అనారోగ్య సమస్య వల్ల కూడా నేను ప్రస్తుతం ప్రయాణం చేసే పరిస్థితి లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో గుండె సంబంధ చికిత్స జరిగింది. అయితే, కిడ్నీ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున మొత్తం చికిత్స ఒకేసారి పూర్తి చేసే పరిస్థితి లేదు. దీంతో ఈ చికిత్స ప్రక్రియ ఇంకా మిగిలి ఉంది. ఈ కారణాల వల్ల నేను కనీసం నాలుగు నుంచి ఆరు నెలల పాటు ప్రయాణించడానికి లేదు. పైపెచ్చు ఒకవేళ నేనిప్పుడు అరెస్టయిన పక్షంలో ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్సకు నిరాకరించి, ప్రభుత్వాసుపత్రిలోనే ట్రీట్‌మెంట్‌ ఇచ్చే అవకాశం ఉంది. దీంతో నాకు సరైన చికిత్స లభించకపోవచ్చు'' అని చోక్సీ పేర్కొన్నారు.

ప్రొవిజనింగ్‌కు ఏడాది వ్యవధి..

రూ. 12,700 కోట్ల రుణ కుంభకోణానికి సంబంధించి ప్రొవిజనింగ్‌ చేసుకునేందుకు పీఎన్‌బీకి రిజర్వ్‌ బ్యాంక్‌ దాదాపు నాలుగు త్రైమాసికాల (ఏడాది) వ్యవధినిచ్చే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కేటాయింపులపై రిజర్వ్‌ బ్యాంక్‌ అభిప్రాయం కోరుతూ పీఎన్‌బీ ఇప్పటికే లేఖ రాసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సాధారణంగా లోన్‌ ఫ్రాడ్‌ కేసుల్లో కేటాయింపులపై స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉన్నప్పటికీ.. ఇది అసాధారణ సందర్భం కావడంతో పీఎన్‌బీ ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించాయి. మరోవైపు, పీఎన్‌బీ స్కామ్‌ పరిమాణం మరింతగా పెరగకపోవచ్చని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి సుభాష్‌ చంద్ర గర్గ్‌ పేర్కొన్నారు.

15 నుంచి బంధన్‌ బ్యాంక్‌ ఐపీఓ

ధరల శ్రేణి రూ.370–375 ● ఇష్యూ పరిమాణం రూ.4,473 కోట్లు



ముంబై: కోల్‌కతా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రైవేట్‌ రంగ బంధన్‌ బ్యాంక్‌ ఇనీషియల్‌ పబ్లిక్‌ ఆఫర్‌ (ఐపీఓ) ఈ నెల 15న ప్రారంభం కానుంది. ఈ నెల 19న ముగిసే ఈ ఐపీఓకు ధరల శ్రేణిని రూ.370–375గా నిర్ణయించినట్లు బ్యాంక్‌ తెలిపింది. ఐపీఓ ద్వారా బంధన్‌ బ్యాంక్‌ రూ.4,430–రూ.4,473 కోట్లు సమీకరిస్తుందని అంచనా. భారత బ్యాంకింగ్‌ రంగంలో ఇదే అతి పెద్ద ఐపీఓ కానుంది. ఈ ఐపీఓలో భాగంగా 11.92 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. దీంట్లో 9.76 కోట్లు తాజా షేర్లు కాగా, మిగిలినవి ఈ బ్యాంక్‌లో వాటాలున్న రెండు సంస్థలవి. ఆఫర్‌ ఫర్‌ సేల్‌ (ఓఎఫ్‌ఎస్‌) విధానంలో ప్రపంచబ్యాంక్‌ నియంత్రణలోని ఐఎఫ్‌సీ 1,40,50,780 షేర్లను, ఐఎఫ్‌సీ ఎఫ్‌ఐజీ ఇన్వెస్ట్‌మెంట్‌ కంపెనీ 75,65,804 షేర్లను విక్రయిస్తాయి. కనీసం 40 షేర్లకు దరఖాస్తు చేయాలి. ఈ ఐపీఓకు మర్చంట్‌ బ్యాంకర్లుగా కోటక్‌ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్‌ క్యాపిటల్, గోల్డ్‌మన్‌ శాక్స్, జేఎమ్‌ ఫైనాన్షియల్, జేపీ మోర్గాన్‌లు వ్యవహరిస్తున్నాయి.

2015 నుంచి బ్యాంకింగ్‌ కార్యకలాపాలు...

ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మూలధన అవసరాల కోసం వినియోగిస్తామని బంధన్‌ బ్యాంక్‌ వ్యవస్థాపకుడు, ఎండీ, చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ కూడా అయిన చంద్ర శేఖర్‌ ఘోష్‌ వెల్లడించారు. 2014, ఏప్రిల్‌లో ఆర్‌బీఐ నుంచి బ్యాంకింగ్‌ లైసెన్స్‌ పొందామని, 2015, ఆగస్టులో బ్యాంకింగ్‌ కార్యకలాపాలు ప్రారంభించామని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌ చివరినాటికి తమ డిపాజిట్లు రూ.25,293 కోట్లుగా, అడ్వాన్స్‌లు రూ.24,463 కోట్లుగా ఉన్నాయన్నారు. కార్పొరేట్‌ రంగ రుణాలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వబోమని, సూక్ష్మ రుణాలు, ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ రుణాలకే అధిక ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. గత ఏడాది సెప్టెంబర్‌ నాటికి బంధన్‌బ్యాంక్‌కు 840 బ్రాంచ్‌లు, 383 ఏటీఎమ్‌లు ఉన్నాయి. 70 శాతానికి పైగా బ్రాంచీలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి.

రేపు సాక్షి మైత్రి ఇన్వెస్టర్ల క్లబ్‌ సదస్సు

SAKSHI మైత్రి Investors Club

హైదరాబాద్: స్టాక్‌ మార్కెట్‌ పెట్టుబడి అవకాశాలు, మ్యూచువల్‌ ఫండ్ల పెట్టుబడులు తదితర అంశాలపై సాక్షి మైత్రి ఇన్వెస్టర్ల క్లబ్‌ రేపు (శనివారం) ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సీడీఎస్‌ఎల్, కార్వీ స్టాక్‌ బ్రోకింగ్‌ సంస్థల సహకారంతో ఈ సదస్సును కొత్తపేటలోని సురభి ఇలైట్‌లో నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమం రాత్రి 8 గంటల వరకూ కొనసాగుతుంది. ఈ సదస్సుకు హాజరు కావాలనుకునేవాళ్లు 9505555020 నంబర్‌కు ఫోన్‌ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. సదస్సులో సెంట్రల్‌ డిపాజిటరీ సర్వీసెస్‌(ఇండియా) రీజనల్‌ మేనేజర్‌ శివ ప్రసాద్‌ వెనిశెట్టి, కార్వీ స్టాక్‌ బ్రోకింగ్‌ జోనల్‌ బ్రోకింగ్‌ హెడ్‌ ఎస్‌.వెంకట శ్రీనివాస రెడ్డి, కార్వీ స్టాక్‌ బ్రోకింగ్‌ టెక్నికల్‌ రీసెర్చ్‌ హెడ్‌ జంబు కుమార్‌ జైన్‌ ఇన్వెస్టర్లకు తగు సలహాలిస్తారు.

మాల్టాలో విజయ్‌ మాల్యా విహారనౌక జప్తు



లండన్: బ్యాంకులకు రుణాల ఎగవేత ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త విజయ్‌ మాల్యాకి చెందిన విహార నౌక 'ఇండియన్‌ ఎంప్రెస్‌'ను మాల్టాలో ట్రేడ్‌ యూనియన్‌ స్వాధీనం చేసుకుంది. నౌక నిర్వహణ వ్యయాలు, సిబ్బందికి జీతభత్యాలు దాదాపు పది లక్షల డాలర్ల మేర మాల్యా బకాయి పడటంతో నాటిలస్‌ ఇంటర్నేషనల్‌ సంస్థ ఈ నౌకను తమ అధీనంలోకి తీసుకున్నట్లు తెలిపింది. గతేడాది సెప్టెంబర్‌ నుంచి దీని వైపు చూడటం మానేసిన మాల్యా... జీతభత్యాల గురించి సిబ్బంది చేసిన అభ్యర్థనలను కూడా పట్టించుకోవడం లేదని, దీంతో నౌక స్వాధీనం చేసుకోవాల్సి వచ్చిందని నాటిలస్‌ తెలిపింది. విలాసవంతమైన ఈ విహార నౌకను 2006లో కొనుగోలు చేసిన మాల్యా.. లక్షల డాలర్లు వెచ్చించి దానికి మరిన్ని హంగులు తీర్చిదిద్దారు. 40 మంది పైగా సిబ్బంది దీనిలో పనిచేస్తుండగా.. వీరిలో కొందరు భారతీయులూ ఉన్నారు.

భూషణ్‌ స్టీల్‌ మాకు రూ.900 కోట్లివ్వాలి

వసూలు కోసం ఎన్‌సీఎల్‌టీకి ఎల్‌ అండ్‌ టీ



న్యూఢిల్లీ: నిర్మాణరంగ దిగ్గజ కంపెనీ లార్సన్‌ అండ్‌ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) భూషణ్‌ స్టీల్‌ నుంచి బకాయిల వసూలు కోసం జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ) ఆశ్రయించింది. దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న భూషణ్‌ స్టీల్‌ నుంచి తనకు రావాల్సిన బకాయిలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది. క్యాపిటల్‌ గూడ్స్‌ను సరఫరా చేసినందుకు సంస్థ నుంచి తమకు రూ.900 కోట్లు రావాల్సి ఉందని ఎల్‌ అండ్‌ టీ న్యాయవాది ట్రిబ్యునల్‌ను కోరారు. తమను సెక్యూర్డ్‌ క్రెడిటర్‌గా గుర్తించాలని కోరారు. దీనిపై అభిప్రాయం తెలియజేయాలని దివాలా పరిష్కార నిపుణులను ట్రిబ్యునల్‌ ఆదేశించింది. భూషణ్‌ స్టీల్‌లో నియంత్రిత వాటా కొనుగోలుకు తాము అధిక బిడ్డర్‌గా నిలిచినట్టు టాటా స్టీల్‌ ప్రకటించిన నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడం గమనార్హం.

చైర్మన్‌ని ప్రశ్నించిన ఎస్‌ఎఫ్‌ఐవో: రూ.1,000 కోట్ల నిధుల స్వాహా ఆరోపణలకు సంబంధించి భూషణ్‌ స్టీల్‌ చైర్మన్‌ బ్రిజ్‌ భూషణ్‌ సింఘాల్‌ని సీరియస్‌ ఫ్రాడ్‌ ఇన్వెస్టిగేషన్‌ ఆఫీస్‌ (ఎస్‌ఎఫ్‌ఐవో) గురువారం ప్రశ్నించింది. ఎస్‌ఎఫ్‌ఐవో గతేడాది నుంచి కంపెనీలో నిధుల మళ్లింపు ఆరోపణలపై విచారణ జరుపుతోంది. భూషణ్‌ స్టీల్‌ దాదాపు రూ. 44,000 కోట్ల మేర బ్యాంకులకు బాకీ పడింది. మొండిబాకీలు భారీగా పేరుకుపోయిన 12 కంపెనీలపై దివాలా చర్యలు తీసుకోవాలంటూ బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించిన సంస్థల్లో ఇది కూడా ఉంది.

అనుబంధ కంపెనీలు అదుర్స్‌!!

ఆదాయాల్లో మాతృ కంపెనీలను మించిన జోరు


- ముందు వరుసలో మారుతీ, హెచ్‌యూఎల్‌
- సుజుకీ విలువ మారుతీకన్నా 50 శాతం తక్కువ
- యూనిలీవర్‌లో 28%కి చేరిన హెచ్‌యూఎల్‌

సాక్షి, బిజినెస్‌ విభాగం

'ముందొచ్చిన చెవులకన్నా... వెనకొచ్చిన కొమ్ములు వాడి' అంటుంటారు. ఇది కొన్ని అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలకు అచ్చంగా సరిపోతుంది. ఎందుకంటే గడిచిన ఐదారేళ్లుగా ఇవి మెల్లగా బండి లాగిస్తుండగా... వాటి భారత అనుబంధ కంపెనీలు మాత్రం లాభాల మోత మోగిస్తున్నాయి. ఆదాయం, నికర లాభాల పరంగా ఇవి మాతృ కంపెనీలనే మించిపోతున్నాయి. హెచ్‌యూఎల్, సుజుకీ, సీమెన్స్, ఏబీబీ, కాల్గేట్‌ పామోలివ్‌... తదితర ఎమ్‌ఎన్‌సీల భారత అనుబంధ కంపెనీలు మంచి జోరుమీదున్నాయి. ప్రధానంగా మారుతీ సుజుకీ, హిందుస్తాన్‌ యూనిలీవర్‌లు మంచి పనితీరు కనబరుస్తున్నాయి.

మారుతీ... ఇదో రికార్డు!

దేశంలో వివిధ బహుళజాతి సంస్థలకు చెందిన దాదాపు 52 కంపెనీలు లిస్టయ్యాయి. వాటి మార్కెట్‌ విలువ గడిచిన ఐదేళ్లలో 120 శాతం పెరిగింది. ఇదే కాలంలో సదరు మాతృసంస్థల మార్కెట్‌ విలువ 10 శాతం మాత్రమే పెరిగింది. 2013 నాటికి ఇక్కడ లిస్టయిన అనుబంధ సంస్థల మార్కెట్‌ విలువ తమ మాతృసంస్థల విలువలో 3.1 శాతమే కాగా... ఐదేళ్లలో ఏకంగా ఇది 6.3 శాతానికి చేరింది. ప్రధానంగా మారుతీ సుజుకీ, హెచ్‌యూఎల్‌ ఈ జోరుకు కారణమని చెప్పాలి. మారుతీ మార్కెట్‌ విలువ మాతృ కంపెనీ జపాన్‌కు చెందిన సుజుకీ కార్పొరేషన్‌ కంటే 50%ఎక్కువ కావటం గమనార్హం. ఇక యూనిలీవర్‌ మొత్తం మార్కెట్‌ విలువలో హెచ్‌యూఎల్‌ మార్కెట్‌ విలువ 28 శాతానికి సమానం.



అనుబంధ కంపెనీలదే అధికాదాయం

భారత్‌తో సహా అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు మంచి జోరుమీదున్నాయి. ఎంఎన్‌సీల భారత అనుబంధ కంపెనీలు కన్స్యూమర్‌ సెగ్మెంట్లో దాదాపు అగ్రస్థానంలో ఉండటం వల్లే ఇవి ఎక్కువ ర్యాలీ చేశాయని ఎమ్‌కే గ్లోబల్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ రీసెర్చ్‌ హెడ్‌ ధనుంజయ్‌ సిన్హా చెప్పారు. ఐదేళ్ల కిందట... భారత్‌లో లిస్టయిన 47 అనుబంధ కంపెనీల ఆదాయాలు వాటి మాతృ కంపెనీల ఆదాయాల్లో 2 శాతంగా ఉండేవి. ఇప్పుడు ఈ వాటా 2.4 శాతానికి పెరిగింది. లాభాల్లోనూ ఈ వాటా 1.8 నుంచి 2.4 శాతానికి పెరిగింది.

ఆ సమస్యలు లేకుంటే...!

లేమాన్‌ పతనంతో మొదలైన ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటానికి భారత్‌ కంటే అభివృద్ధి చెందిన దేశాలకే అధిక సమయం పట్టింది. ఇది ఎమ్‌ఎన్‌సీల భారత అనుబంధ కంపెనీలకు కలిసొచ్చింది. ప్రస్తుతం అభివృద్ధి చెందిన దేశాల్లోని మాతృ కంపెనీల ఆదాయం, నికర లాభం ఒక అంకె వృద్ధిని మాత్రమే చూస్తుండగా... భారత్‌లోని వీటి అనుబంధ కంపెనీలు రెండంకెల వృద్ధిని సాధిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఈ అంతర్జాతీయ కంపెనీల ఆదాయాలు 0.3 శాతం పడిపోగా... అదే సమయంలో వాటి భారత అనుబంధ కంపెనీలు ఆదాయాలు 13 శాతం పెరిగాయి. నికర లాభాలు అక్కడ 4 శాతం తగ్గగా... ఇక్కడ 31 శాతం ఎగిశాయి. పెద్ద కరెన్సీ నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు వంటి అడ్డంకులు లేకపోతే ఈ భారత అనుబంధ కంపెనీల జోరు మరింతగా పెరిగేదని నిపుణులంటున్నారు.

కొన్ని అంతర్జాతీయ దిగ్గజాల భారత అనుబంధ కంపెనీలివీ...

- మారుతీ సుజుకీ
- హిందుస్థాన్‌ యూనిలివర్‌
- నెస్లే ఇండియా
- సీమెన్స్‌ ఇండియా
- ఏబీబీ ఇండియా
- అబాట్‌ ఇండియా
- కమిన్స్‌ ఇండియా
- అక్జో నోబుల్‌ ఇండియా
- వర్ల్‌పూల్‌ ఇండియా
- జిల్లెట్‌ ఇండియా
- పీ అండ్‌ జీ హైజిన్‌ అండ్‌ హెల్త్‌కేర్‌
- గ్లాక్సో స్మిత్‌లైన్‌ ఫార్మా
- గ్లాక్సో స్మిత్‌లైన్‌ కన్స్యూమర్‌ హెల్త్‌కేర్‌

మార్కెట్లకు ర్యాలీ... 'రిలీఫ్'

కొన్ని దేశాలకు సుంకాల మినహాయింపు!

- తగ్గిన వాణిజ్య యుద్ధాల భయం
- పెరిగిన ప్రపంచ మార్కెట్లు
- పీఎస్ బ్యాంక్ షేర్లలో షార్ట్ కవరింగ్
- ఇటీవల పడ్డ షేర్లలో వేల్యూ బయింగ్
- ఇంట్రాడేలో 407 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- 318 పాయింట్ల లాభంతో 33,352 వద్ద ముగింపు
- 88 పాయింట్లు పెరిగి 10,243కు నిఫ్టీ



వరుసగా ఆరు ట్రేడింగ్ సెషన్లు నష్టాలు చూసిన స్టాక్ మార్కెట్... గురువారం కాస్త రికవరీ అయింది. సుంకాల విధింపులో కొన్ని దేశాలకు అమెరికా మినహాయింపులు ఇవ్వనున్నదన్న వార్తలలో ప్రపంచ మార్కెట్లు పెరగడం కలిసివచ్చింది. ఇటీవలి వరుస ఆరు రోజుల నష్టాల కారణంగా ధరలు బాగా తగ్గి ఆకర్షణీయంగా ఉన్న షేర్లలో కొనుగోళ్లు జరగడం (వేల్యూ బయింగ్) సానుకూల ప్రభావం చూపించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రుణ కుంభకోణం నేపథ్యంలో బాగా నష్టపోయిన ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లలో ట్రేడింగ్ చివర్లో షార్ట్ కవరింగ్ చోటు చేసుకోవడం స్టాక్ సూచీలను లాభాల బాట పట్టించింది. ప్రధాన స్టాక్ సూచీలు చెరో ఒక శాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 318 పాయింట్లు పెరిగి 33,352 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 88 పాయింట్లు వృద్ధి చెంది 10,243 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల జోరుతో ఇంట్రాడేలో 407 పాయింట్ల లాభంతో 33,440 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. బ్యాంక్, వాహన, ఐటీ షేర్లలో కొనుగోళ్లు బాగా జరిగాయి. నిఫ్టీ 10,200 పాయింట్లపైకి ఎగబాకింది. ఇంట్రాడేలో 116 పాయింట్ల లాభంతో 10,270 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. గత ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,413 పాయింట్లు పతనమైంది. గత ఆరు రోజుల నష్టాల నుంచి మార్కెట్ రికవరీ అయిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లలో షార్ట్ కవరింగ్ చోటు చేసుకోవడం ర్యాలీకి తోడ్పాటునందించిందని పేర్కొన్నారు. ఇది సాంకేతికంగా పెరుగుదల మాత్రమేనని, ఈ ర్యాలీ కొనసాగడం కష్టమేనని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ సందేహం వ్యక్తం చేశారు. వచ్చే వారం వెలువడే ఐఐపీ, ద్రవ్యోల్బణ గణాంకాలను బట్టి ఇన్వెస్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

ఎస్‌బీఐ 4 శాతం అప్..

ఎస్‌బీఐ 4 శాతం లాభపడి రూ.257 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో బాగా పెరిగిన షేర్ ఇదే. ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఏషియన్ పెయింట్స్, ఎల్ అండ్ టీ, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, పవర్ గ్రిడ్, హీరో మోటొకార్ప్, బజాజ్ ఆటో షేర్లు 2 శాతం వరకూ లాభపడ్డాయి. ఇక నష్టపోయిన షేర్ల విషయానికొస్తే, సన్ ఫార్మా, యస్ బ్యాంక్, టీసీఎస్, టాటా మోటార్స్, కోటక్ బ్యాంక్, ఓఎన్‌జీసీలు క్షీణించాయి.

భూషణ్ స్టీల్ 16 శాతం అప్...

దివాలా ప్రక్రియలో ఉన్న భూషణ్ స్టీల్‌ను కొనుగోలు చేయడానికి అత్యధిక బిడ్ కోట్ చేసిన కంపెనీగా టాటా స్టీల్ నిలిచిందని వెల్లడి కావడంతో భూషణ్ స్టీల్ షేర్ 16 శాతం లాభపడి రూ. 47 వద్ద ముగిసింది. మరోవైపు టాటా స్టీల్ షేర్ 2 శాతం నష్టపోయింది. ఉక్కు, అల్యూమినియం షేర్లు లాభపడ్డాయి. నాల్కో,హిందుస్తాన్ జింక్ షేర్లు 2 శాతం వరకూ పెరిగాయి. జిందాల్ స్టీల్, ఎన్ఎండీసీ, సెయిల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కంపెనీలు 1 శాతం వరకూ లాభపడ్డాయి.

ఏడాది కనిష్టానికి టాటా మోటార్స్..

మార్కెట్‌లో రిలీఫ్ ర్యాలీ చోటు చేసుకున్నప్పటికీ, టాటా మోటార్స్‌తో సహా బీఎస్ఈ 500 సూచీలో 49 షేర్లు ఇంట్రాడేలో తాజా ఏడాది కనిష్ట స్థాయిలను తాకాయి. లుపిన్, ఆర్‌బీఎల్ బ్యాంక్, కజారియా సిరామిక్స్, బాష్, గ్లాక్సో స్మిత్‌లైన్ ఫార్మా, అదానీ పవర్, ఆర్ఈసీ, సీమెన్స్, పీఎఫ్‌సీ ఈ జాబితాలో ఉన్నాయి. వేల్యూ బయింగ్, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరిగినప్పటికీ, ఇంట్రాడేలో 14 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్ షేర్లు కూడా తాజా ఏడాది కనిష్టాన్ని తాకాయి. కర్ణాటక బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, కెనరా బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, లక్ష్మీ విలాస్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, విజయ బ్యాంక్‌లు ఈ జాబితాలో ఉన్నాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,998
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	30,327
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	16,78,923
ఎఫ్ఐఐ	-365
డీఐఐ	675

తొలగిన వాణిజ్య యుద్ధాల భయాలు

అమెరికాకు దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు విధించనున్నామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించడంతో ఇటీవల ప్రపంచ మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ సుంకాల నుంచి మెక్సికో, కెనడాలతో పాటు మరికొన్ని దేశాలకు మినహాయింపులు లభించే అవకాశాలున్నయని వార్తలు వచ్చాయి. దీంతో వాణిజ్య యుద్ధాలు చెలరేగుతాయేమోనన్న ఆందోళనలు తగ్గాయి. దీంతో ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, యూరప్ మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. ప్రపంచ మార్కెట్లు పెరగడం మన మార్కెట్‌కు ఉత్తేజాన్నిచ్చింది.

భారత్‌లో మాక్సిస్ టైర్స్ తొలి ప్లాంటు

రూ.2,640 కోట్లతో గుజరాత్‌లో ఏర్పాటు



సనంద్: తైవాన్‌కు చెందిన మాక్సిస్ టైర్స్ అనుబంధ సంస్థ 'మాక్సిస్ రబ్బర్ ఇండియా' తాజాగా భారత్‌లో తన తొలి మ్యానుఫాక్చరింగ్ ప్లాంటును ప్రారంభించింది. రూ.2,640 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్‌తో గుజరాత్‌లోని సనంద్‌లో ఈ ప్లాంటు ఏర్పాటు చేసింది. ప్లాంటులో రోజుకు 20,000 టూవీలర్ టైర్లను, 40,000 ట్యూబ్స్‌ను తయారు చేయవచ్చని కంపెనీ అధికార ప్రతినిధి జియా సియోవో లియు తెలిపారు. 106 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంటును గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ప్రారంభించారు. కాగా మాక్సిస్ టైర్స్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద టూవీలర్ టైర్ల తయారీ కంపెనీ.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 20 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 11 నెలల కాలంలో (ఏప్రిల్ -ఫిబ్రవరి) ప్రత్యక్ష పన్ను వసూళ్లు 19.5 శాతం వృద్ధి చెంది రూ.7.44 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు అధికంగా ఉండటమే దీనికి కారణం. ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.10.5 లక్షల కోట్ల ఆదాయం సాధించాలనే లక్ష్యాన్ని విధించుకోగా, 11 నెలల్లో 74.3 శాతం మేర సమకూరింది. స్థూల వసూళ్లు (రిఫండ్‌లు చెల్లించక ముందు) రూ.8.83 లక్షల కోట్లు కావడం గమనార్హం. ఇందులో ఫిబ్రవరి వరకు చేసిన రిఫండ్‌లు రూ.1.39 లక్షల కోట్లుగా ఉన్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. కార్పొరేట్ పన్నుల ద్వారా ఆదాయంలో నికర వృద్ధి 19.7 శాతంగా కాగా, వ్యక్తిగత ఆదాయపన్నుల ద్వారా సమకూరిన ఆదాయంలో వృద్ధి 18.6 శాతం ఉంది.

ఔషధ పరిశోధనపై సీఎస్ఐఆర్‌తో లుపిన్ ఒప్పందం

ముంబై: ప్రముఖ ఫార్మా కంపెనీ లుపిన్ బయోసిమిలర్ మోనోక్లోనల్ యాంటీబోడీ థెరప్యూటిక్ (ఎంఏబీ) ఔషధ అభివృద్ధి ప్రక్రియపై పరిశోధనలు నిర్వహించేందుకు సీఎస్ఐఆర్‌కు చెందిన పుణేలోని నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ, ఢిల్లీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలతో ఒప్పందం చేసుకుంది. ఎంఏబీ ఔషధాల తయారీకి ప్యూరిఫికేషన్ ప్రాసెస్ అభివృద్ధిపై ఈ సంస్థలు ఉమ్మడిగా పరిశోధనలు నిర్వహిస్తాయి. పరిశ్రమ, సీఎస్ఐఆర్ సంస్థ మధ్య ముందస్తు పరిశోధన సహకారంతో మంచి ఫలితాలు లభిస్తాయని లుపిన్ ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేసింది.

అప్పుల కుప్పలు... ఈ పవర్ ప్రాజెక్టులు

జాబితాలో ల్యాంకో, జీఎంఆర్, జీవీకే కూడా



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా దాదాపు 34 విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు భారీ రుణాల భారంతో సతమతమవుతున్నాయి. వీటిలో ల్యాంకోకి చెందిన ప్రాజెక్టులు 4, జీఎంఆర్ ఎనర్జీకి చెందినవి మూడు, జీవీకే ఇండస్ట్రీస్ ప్రాజెక్టు ఒకటి ఉన్నాయి. విద్యుత్ రంగంలో తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న/నిరర్థక ఆస్తులుగా మారిన ప్రాజెక్టులపై పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో స్టాండింగ్ కమిటీ (విద్యుత్ రంగం) ఈ విషయాలు పొందుపర్చింది. 2017 జూన్ నాటికి ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం వీటి విలువ సుమారు రూ. 1.74 లక్షల కోట్లుగా ఉంది. అదానీ, ఎస్సార్, జేపీ ప్రాజెక్టులు కూడా వీటిలో ఉన్నాయి. నివేదిక ప్రకారం ల్యాంకోకి చెందిన అమర్ కంటక్ ప్రాజెక్టు రుణ బకాయి రూ.8,782 కోట్లు, అన్‌పారా (రూ. 3,071 కోట్లు), విదర్భ (రూ. 4,762 కోట్లు), బాబంధ్ రుణాలు రూ. 6,976 కోట్లు మేర ఉన్నాయి. అటు జీఎంఆర్ ఎనర్జీ వరోరా ప్రాజెక్టు రుణభారం రూ. 2,905 కోట్లు, రాయ్‌ఖేడా (రూ. 8,174 కోట్లు), కమలాంగా ప్రాజెక్టు రుణం రూ. 4,100 కోట్లుగా ఉంది. జీవీకే ఇండస్ట్రీస్‌కి చెందిన గోయిండ్వాల్ సాహెబ్ ప్రాజెక్టు బకాయిలు రూ. 3,523 కోట్ల మేర ఉన్నాయి. కేఎస్‌కే మహానది పవర్ కంపెనీకి చెందిన అకల్తారా ప్రాజెక్టు రుణభారం ఏకంగా రూ. 17,194 కోట్లు ఉంది. అదానీ గ్రూప్, జేపీ గ్రూప్‌కి చెందిన కొన్ని ప్రాజెక్టుల రుణ బాకీలు రూ. 11,000 కోట్ల పైగా ఉన్నాయి.

ఎయిర్‌టెల్‌లో టెలినార్ విలీనానికి లైన్ క్లియర్



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్‌లో టెలినార్ విలీన ప్రతిపాదనకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోద ముద్ర వేసింది. ఇందుకు సంబంధించిన విలీన పథకానికి కొన్ని షరతులతో అనుమతినిచ్చింది. ఇప్పటికే ఈ ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, స్టాక్ ఎక్స్చేంజీలు బీఎస్ఈ.. ఎన్ఎస్ఈల నుంచి అనుమతులు దక్కగా .. టెలికం శాఖ నుంచి ఆమోద ముద్ర లభించాల్సి ఉంది. గతేడాది ఫిబ్రవరిలో రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ సహా ఏడు సర్కిల్స్‌లో టెలినార్ ఇండియా కార్యకలాపాలను ఎయిర్‌టెల్ కొనుగోలు చేస్తుంది. దీంతో టెలినార్ ఇండియా ఆస్తులు, యూజర్లు అంతా ఎయిర్‌టెల్ ఖాతాలోకి చేరతారు.

ఫిబ్రవరిలో తగ్గిన ఫండ్ల ఆస్తులు

అరకొరగానే ఫండ్లలో పెట్టుబడులు ● డెట్ ఫండ్ల నుంచి ఉపసంహరణ: యాంఫీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ల ఆస్తులు గత నెలలో రూ.21,000 కోట్ల మేర తగ్గాయి. డెట్ సెగ్మెంట్ నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవటం, ఫండ్లలో పెట్టుబడులు తగ్గడం వంటి కారణాల వల్ల ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ స్థాయిలో మ్యూచువల్ ఫండ్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) తగ్గాయని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(యాంఫీ) తెలియజేసింది. యాంఫీ తాజా గణాంకాల ప్రకారం..,

- భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 42 మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్వహణ ఆస్తులు ఈ ఏడాది జనవరిలో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.22.41 లక్షల కోట్లకు పెరిగాయి.
- ఇక ఫిబ్రవరిలో ఫండ్ల నిర్వహణ ఆస్తులు రూ.21,000 కోట్లు తగ్గి రూ.22.2 లక్షల కోట్లకు చేరాయి.
- వివిధ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు గత నెలలో తగ్గాయి. ఈ ఏడాది జనవరిలో రూ.1.06 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ల పెట్టుబడులు ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.12,000 కోట్లకు పడిపోయాయి.
- ఇన్‌కమ్ ఫండ్స్ నుంచి రూ.9,800 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది.
- గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) నుంచి రూ.94 కోట్ల పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు.

మైక్రోసాఫ్ట్, అపోలో హాస్పిటల్స్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ప్రముఖ హెల్త్‌కేర్ రంగ కంపెనీ అపోలో హాస్పిటల్స్ తాజాగా గుండె సంబంధిత వ్యాధుల్లో అధునాతన టెక్నాలజీ వినియోగానికి చేతులు కలిపాయి. కార్డియాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫోకస్డ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి ఇవి కలిసి పనిచేస్తాయి. గుండె వ్యాధులకు సంబంధించి రోగికున్న ప్రమాదాన్ని ముందే అంచనా వేయడానికి, అలాగే డాక్టర్లకు వ్యాధి ట్రీట్‌మెంట్‌కు అవసరమైన సాయమందించేందుకు కొత్త మెషీన్ లెర్నింగ్ విధానాలను ఇవి అభివృద్ధి చేస్తాయి. ఈ టెక్నాలజీలు... గుండె సంబంధిత వ్యాధులను మెరుగ్గా అంచనా వేయడానికి, నివారించడానికి దోహదపడతాయని అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి పేర్కొన్నారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,635	▼	70
బంగారం (99.5, 10గ్రా)	30,485	▼	70
వెండి (కిలో)	38,360	▼	375
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,150	▼	100
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,610	▼	100
బంగారం (22 క్యారెట్లు)	29,150	▼	100
వెండి (కిలో)	41,500	▼	300
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,400	▼	50
బంగారం (22 క్యారెట్లు)	29,030	▼	90
వెండి (కిలో)	39,700	▼	300
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	31,180	▼	135
బంగారం (22 క్యారెట్లు)	29,150	▼	130
వెండి (కిలో)	41,700		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,500	▼	50
బంగారం (22 క్యారెట్లు)	29,200	▼	100
వెండి(కిలో)	39,600	▼	300
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,520	▼	100
బంగారం (22 క్యారెట్లు)	29,150	▼	100
వెండి (కిలో)	39,500	▼	300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.19 (రాత్రి 11.00కు)	$61.15 (బుధవారం ముగింపు)
బ్రెంట్	63.66 (రాత్రి 11.00కు)	$64.34 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 09-3-2018

విశాఖ	335-00
చిత్తూరు	378-00
వరంగల్	347-00
ముంబై	390-00
చెన్నై	385-00
విజయవాడ	328-00
గోదావరి	328-00
నమక్కల్	370-00
08-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.05
బెంగళూరు	375-00
కోల్‌కతా	368-00
ఢిల్లీ	340-00

డాలర్‌తో 25 పైసలు క్షీణించిన రూపాయి

ముంబై: డాలర్‌తో రూపాయి మారకం విలువ గురువారం ఫారెక్స్ మార్కెట్లో 25 పైసలు కోల్పోయి 65.14 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిగుమతి సుంకాల పెంపు నిర్ణయం వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందన్న అనిశ్చితి డాలర్‌కు డిమాండ్ పెంచింది. దిగుమతిదారులు, బ్యాంకుల కొనుగోళ్లతో డాలర్ పుంజుకోగా, రూపాయి బలహీనపడింది. గడిచిన మూడు రోజుల్లో రూపాయి 28 పైసలు లాభపడగా, ఒక్కరోజే ఆ మేర తుడిచిపెట్టుకుపోయింది. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాల ప్రభావంతో ఇతర ఆసియా కరెన్సీలు సైతం డాలర్‌తో నష్టపోవడం గమనార్హం.

ఈక్విటాస్‌కు 10 లక్షల జరిమానా

ముంబై: ముందస్తు అనుమతులు లేకుండా మ్యూచువల్ ఫండ్స్, బీమా పాలసీలు మొదలైనవి విక్రయిస్తున్నందుకు ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు (ఎస్ఎఫ్‌బీ) రిజర్వ్ బ్యాంక్ రూ.10 లక్షల జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి లైసెన్సు నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎందుకు చర్యలు తీసుకోరాదో తెలపాలంటూ జనవరి 18న ఆర్‌బీఐ షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై బ్యాంకు వివరణనిచ్చినప్పటికీ.. ఆరోపణలకు ఆధారాలు ఉండటంతో మార్చి 1న జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఈ-వే బిల్లు నిబంధనలు సరళతరం

న్యూఢిల్లీ: సరుకు రవాణాతోపాటు ఉత్పత్తుల విలువ లెక్కింపును సులభతరం చేసే దిశగా ఈ-వే బిల్లు నిబంధనలను కేంద్రం సరళతరం చేసింది. రూ.50,000 పైగా విలువ చేసే సరుకులను రాష్ట్రాల మధ్య రవాణా చేసేందుకు ఏప్రిల్ 1 నుంచి ఎలక్ట్రానిక్ వే (ఈ-వే) బిల్లు తప్పనిసరి కానున్న సంగతి తెలిసిందే. తాజా మార్పుల ప్రకారం 50 కి.మీ. పరిధిలోపల జరిగే సరుకు రవాణాకు సంబంధించి వాహనాల వివరాలను పొందుపర్చనక్కర్లేదు. ఇప్పటిదాకా ఇది 10 కి.మీ.గా ఉంది. అలాగే, పన్ను పరిధిలోకి రాని ఉత్పత్తులతో పాటు ఇతర ఉత్పత్తులను కూడా రవాణా చేస్తున్న పక్షంలో పన్నులు వర్తించే ఉత్పత్తుల విలువనే ఈ-బిల్లు విషయంలో పరిగణనలోకి తీసుకుంటారు. ఇక ఈ-వే బిల్లు కాల వ్యవధిని కూడా ఇరవై నాలుగు గంటలు కాకుండా వే-బిల్లును జనరేట్ చేసిన మరుసటి రోజు అర్ధరాత్రి దాకా ఉండేలా నిబంధనలు సవరించారు. అంతర్ రాష్ట్ర సరుకు రవాణాలో ప్రధాన తయారీ సంస్థతో పాటు జాబ్ వర్కర్ కూడా ఈ-వే బిల్లు జనరేట్ చేసే వెసులుబాటు కల్పించారు.

మహిళా వ్యాపారవేత్తలకు ప్రత్యేక ప్లాట్‌ఫామ్

న్యూఢిల్లీ: దేశంలో మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు నీతి ఆయోగ్ తాజాగా ఒక ప్రత్యేకమైన ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. 'ఉమెన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్' (డబ్ల్యూఈపీ) ద్వారా ఉమెన్ ఎంట్రప్రెన్యూర్లు వారి ఆలోచనలకు కార్యరూపం దాల్చుకోవచ్చని, వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవచ్చని నీతిఆయోగ్ తెలిపింది. నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. డబ్ల్యూఈపీ ద్వారా మహిళా వ్యాపారవేత్తలు నెట్‌వర్క్‌ను విస్తరించుకోవచ్చని, భాగస్వామ్యలు కుదుర్చుకోవచ్చని, అలాగే ఇతర సహాయ సహకారాలు, మద్దతు పొందొచ్చని అమితాబ్ కాంత్ తెలిపారు. డబ్ల్యూఈపీతో షాప్‌క్లూస్.కామ్, నాస్కామ్, సీఐఐ, ఫిక్కీ, సిడ్బి, ఫేస్‌బుక్, క్రిసిల్ వంటి పలు సంస్థలు కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు.

వ్యాపారాల్లో మహిళా నాయకత్వం పెరుగుతోంది

గ్రాంట్ థార్న్‌టన్ నివేదిక




న్యూఢిల్లీ: భారతీయ కంపెనీల్లో నాయకత్వ స్థానాల్లో మహిళల సంఖ్య పెరుగుతోందని తాజా నివేదిక పేర్కొంది. లింగ సమానత్వానికి సంబంధించి భారత్ ర్యాంకింగ్ ఇంకా అట్టడుగునే ఉన్నప్పటికీ, క్రమంగా మెరుగుపడుతోందని తెలిపింది. అత్యున్నత స్థానాల్లో మహిళలు 2018లో 20 శాతానికి పెరిగారని గ్రాంట్ థార్న్‌టన్ 'వ్యాపారాల్లో మహిళలు: ప్రగతి దిశగా విధానాలు' పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2017లో ఈ పరిమాణం 17 శాతంగా ఉంది. ఇక 2014లో 14 శాతం మాత్రమే. గతేడాది జూలై-డిసెంబర్ మధ్య 35 దేశాల్లో మధ్య స్థాయి వ్యాపార సంస్థలకు చెందిన దాదాపు 4,995 మంది సీఈఓలు, ఎండీలు, ఇతరత్రా సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి తీసుకున్న అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను తయారు చేసింది. ఇప్పటికీ తమ సంస్థల్లో నాయకత్వ స్థానాల్లో మహిళలు లేరని సర్వేల్లో పాల్గొన్న 30 శాతం భారతీయ ఎగ్జిక్యూటివ్‌లు చెప్పడం గమనార్హం. భారత్‌లో వ్యాపారాలను నడిపిస్తున్న మహిళల సంఖ్య పెరుగుతోందని. అయితే, ఈ పెరుగుదల చాలా నెమ్మదిగా ఉందని గ్రాంట్ థార్న్‌టన్ అడ్వయిజరీకి చెందిన కవితా మాథుర్ పేర్కొన్నారు. దేశీ వ్యాపార సంస్థల్లో స్త్రీ, పురుష సమానత్వానికి సంబంధించిన విధానాలు మెరుగ్గానే ఉన్నాయని నివేదిక అభిప్రాయపడింది. భారత్‌లోని దాదాపు 64 శాతం వ్యాపార సంస్థలు ఒకే పనికి సంబంధించి మహిళలు, పురుషులకు సమాన వేతనాలను ఇస్తున్నాయని.. అదేవిధంగా నియామకాల్లో కూడా 55 శాతం సంస్థలు వివక్షకు తావులేని విధానాలను అనుసరిస్తున్నాయని వివరించింది. కాగా, నాయకత్వ స్థానాల్లో మహిళలకు సంబంధించి సమానత్వాన్ని తీసుకురావాలంటే ప్రభుత్వం చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సర్వేలో పాల్గొన్న 57 శాతం భారతీయ వ్యాపార సంస్థలు పేర్కొన్నాయి.

ఆర్‌కామ్ పిటిషన్‌ను కొట్టేసిన బోంబే హైకోర్టు

ముంబై: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు బోంబే హైకోర్టులో చుక్కెదురైంది. ఆర్‌కామ్ ఆస్తుల విక్రయం లేదా బదిలీని నిలిపివేస్తూ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఈ నెల 5న ఆదేశాలు జారీ చేయగా, వాటిని సవాల్ చేస్తూ కంపెనీ బోంబే హైకోర్టును ఆశ్రయించింది. ఆర్‌కామ్ నుంచి రూ.1,012 కోట్ల బకాయిలను వసూలు చేసుకునే విషయంలో ఎక్విప్‌మెంట్ సంస్థ ఎరిక్సన్ ట్రిబ్యునల్‌కు వెళ్లడంతో ఆర్‌కామ్‌కు వ్యతిరేకంగా ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా, హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తామని ఆర్‌కామ్ ప్రతినిధి తెలిపారు.

నష్టాల్లో ఉన్న డిస్కంలకు రుణాలివ్వకండి

ఆర్ఈసీ, పీఎఫ్‌సీలకు మంత్రి ఆర్కే సింగ్ ఆదేశం



న్యూఢిల్లీ: తీవ్ర నష్టాల్లో ఉన్న డిస్కంలు, వాటిని తగ్గించుకునే ప్రణాళికతో ముందుకు రానంత వరకు వాటికి రుణాలను మంజూరు చేయవద్దని గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఈసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)లను కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి ఆర్.కె.సింగ్ ఆదేశించారు. ఆర్ఈసీ, పీఎఫ్‌సీ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. రుణం ఇచ్చే ముందు డిస్కంలు నిబంధనలకు కట్టుబడి ఉన్నాయా, లేదా అన్నది చాలా జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. చాలా వరకు విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కంలు) సరఫరా, పంపిణీ (టీ అండ్‌డీ) పరంగా ఎక్కువ నష్టాలను ఎదుర్కొంటున్నాయని, వాటికి రుణాలు ఇస్తే తిరిగి చెల్లించడం కష్టతరమని సింగ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నష్టాలను నిర్ణీత కాలంలోపు (రెండేళ్లకు మించకుండా) తగ్గించుకునేందుకు ప్రణాళిక రూపొందించుకునే వరకు వాటికి రుణాలు ఇవ్వొద్దని కోరారు.

వొడాఫోన్, ఐడియాలకు లాభం

టెలికం రిలీఫ్ ప్యాకేజీపై డాయిష్ బ్యాంక్ నివేదిక

న్యూఢిల్లీ: స్పెక్ట్రమ్ చెల్లింపుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు వల్ల అన్నింటికంటే ఐడియా- వొడాఫోన్ విలీన కంపెనీకే అధిక ప్రయోజనం అందిస్తుందని డాయిష్ బ్యాంక్ తాజా నివేదిక వెల్లడించింది. వేలంలో స్పెక్ట్రమ్‌ను పొందిన టెలికం కంపెనీలు చెల్లింపులకు మరింత గడువునివ్వడం, స్పెక్ట్రమ్ పరిమితులను సడలించడం, తదితర అనుకూల నిర్ణయాలతో కూడిన రిలీఫ్ ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలపిన విషయం తెలిసిందే. స్పెక్ట్రమ్ చెల్లింపుల కాలాన్ని ప్రస్తుతమున్న పదేళ్ల కాలం నుంచి పదహారేళ్లకు పొడిగించడం వల్ల వొడాఫోన్-ఐడియా విలీన కంపెనీకి బాగా ప్రయోజనం కలుగుతుందని డాయిష్ బ్యాంక్ పేర్కొంది. ఈ విలీన కంపెనీకి స్పెక్ట్రమ్ వార్షిక ఇన్‌స్టాల్‌మెంట్ 30 శాతం మేర తగ్గుతుందని తెలిపింది. అంతేకాకుండా స్పెక్ట్రమ్ పరిమితులను పెంచడం కూడా ఈ విలీన కంపెనీకి ప్రయోజనకరమని పేర్కొంది. మరోవైపు స్పెక్ట్రమ్ చెల్లింపులకు మరింత గడువునివ్వడం వల్ల టెలికం కంపెనీల ఫ్రీ క్యాష్ ఫ్లోస్‌కు ఒకింత ఊరటనిస్తుందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. స్పెక్ట్రమ్ పరిమితిని పెంచడంవల్ల విలీనాలకు ఊతం లభిస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ వివరించింది.

రాయల్ ఎన్‌ఫీల్డ్.. సెకండ్‌హ్యాండ్ బైక్‌లు

చెన్నైలో వింటేజ్ స్టోర్ ఏర్పాటు



చెన్నై: ఐషర్ మోటార్స్‌కు చెందిన టూవీలర్ విభాగం 'రాయల్ ఎన్‌ఫీల్డ్' తాజాగా సెకండ్ హ్యాండ్ మోటార్‌సైకిల్ విభాగంలోకి అడుగు పెట్టింది. 'వింటేజ్' పేరుతో చెన్నైలో తొలి స్టోర్‌ను ప్రారంభించింది. ఈ కార్యకలాపాలను దేశవ్యాప్తంగా విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. 'సెకండ్‌హ్యాండ్, రిఫర్బిష్డ్ బైక్స్‌కు డిమాండుంది. అందుకే వింటేజ్ స్టోర్‌ను ఏర్పాటు చేశాం' అని రాయల్ ఎన్‌ఫీల్డ్ (ఇండియా బిజినెస్) హెడ్ షాజి కోషి తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 10 వింటేజ్ స్టోర్ల ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఈ స్టోర్లలో కేవలం రాయల్ ఎన్‌ఫీల్డ్ బ్యాడ్జ్ కలిగిన మోటార్‌సైకిల్స్ మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. ప్రి-ఓన్డ్, రిఫర్బిష్డ్, రిస్టోర్డ్ అనే మూడు రకాల విభాగాల్లో ఈ బైక్స్‌ను విక్రయిస్తామని తెలిపారు. 'ప్రతి మోటార్‌సైకిల్‌కు 92 పాయింట్ క్వాలిటీ చెకప్ నిర్వహిస్తాం. బైక్ కొనుగోలు తర్వాత సర్వీస్ అందిస్తాం. అలాగే మోటార్ ఇన్సూరెన్స్ సదుపాయం కూడా కల్పిస్తాం' అని పేర్కొన్నారు.

కెన్‌ఫిన్ హోమ్స్‌తో కెనరా హెచ్ఎస్‌బీసీ ఓబీసీ లైఫ్ జట్టు

న్యూఢిల్లీ: గృహ రుణాలు అందించే కెన్‌ఫిన్ హోమ్స్‌తో కెనరా హెచ్ఎస్‌బీసీ ఓబీసీ లైఫ్ ఇన్సూరెన్స్ చేతులు కలిపింది. మూడేళ్ల కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందం చేసుకుంది. దీనికింద కెన్‌ఫిన్ హోమ్స్ నుంచి గృహ రుణాలు తీసుకునే కస్టమర్లకు బీమా పాలసీలను ఆఫర్ చేస్తుంది. అన్ని రకాల పాలసీలు కెన్‌ఫిన్ హోమ్స్ కస్టమర్లకు అందుబాటులో ఉంటాయని కెనరా హెచ్ఎస్‌బీసీ ఓబీసీ లైఫ్ ఇన్సూరెన్స్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	387.95	376.95
AMBUJA CEME	236.25	235.2
ASIAN PAINT	1127.6	1107.25
AXIS BANK L	520.55	512.65
BAJAJ AUTO	2923.9	2903.9
BAJAJ FINAN	1628.05	1618.35
BHARTI AIRT	401.3	403.2
BOSCH LIMIT	18094.8	17848.25
BHARAT PETR	442.2	443.4
CIPLA LTD	578	580.2
COAL INDIA	305.5	306.95
EICHER MOTO	27711.85	27528.15
GAIL (INDIA	436.45	440.75
HCL TECHNOL	950.65	949.55
HDFC LTD	1798.75	1761.75
HDFC BANK L	1852.85	1832.6
HERO MOTOCO	3586.7	3554.4
HINDALCO I	222.7	224.45
HINDUSTAN P	360.55	357.8
HINDUSTAN U	1293.15	1293.85
INDIABULLS	1206.35	1196.25
ICICI BANK	296.95	286.7
INDUSIND BA	1694.15	1704.25
BHARTI INFR	331.2	329.45
INFOSYS LIM	1156.65	1144.1
INDIAN OIL	382.1	379.4
ITC LTD	258.85	259.9
KOTAK MAHIN	1082.3	1085.1
LARSEN & TO	1283.8	1263.3
LUPIN LIMIT	771.15	761.75
MAHINDRA &	726.65	707.8
MARUTI SUZU	8729.35	8679.1
NTPC LTD	165.3	163.5
OIL AND NAT	180.15	181.5
POWER GRID	195.4	193.35
RELIANCE IN	911.45	889.75
STATE BANK	256.8	246.65
SUN PHARMAC	514.6	524.85
TATA MOTORS	345.15	347.8
TATA STEEL	635.9	647.7
TATA CONSUL	3003.95	3027.45
TECH MAHIND	607.2	609.05
ULTRATECH C	4119.9	4113.45
UPL LIMITED	710.8	702
VEDANTA LIM	308.4	309.35
WIPRO LTD	285.2	285.35
YES BANK LI	308.55	311.95
ZEE ENTERTA	563.5	565.1
నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ		
ABB INDIA L	1425.75	1435.55
ACC LIMITED	1544.95	1575.2
ASHOK LEYLA	144.15	141.25
BAJAJ FINSE	4864.6	4836.15
BANK OF BAR	134.35	132.6
BHARAT ELEC	147.25	148.35
BHEL	86.1	85.45
BRITANNIA I	4848.4	4884.7
CADILA HEAL	388.9	381.3
COLGATE PAL	1037.05	1046.2
CONTAINER C	1250.6	1252.95
CUMMINS IND	783.4	778.6
DABUR INDIA	325.05	323.4
DLF LIMITED	218.4	215.45
AVENUE SUPE	1293.15	1298.8
EMAMI LIMIT	1090.5	1103.8
GLAXOSMITHK	2286.25	2291.95
GLENMARK PH	552.95	559.3
GODREJ CONS	1067.1	1090.7
GLAXOSMITHK	6590	6643.45
HAVELLS IND	502.55	501.2
HINDUSTAN Z	313.85	308.75
ICICI PRU L	388.3	381.65
IDEA CELLUL	79.65	79.7
INTERGLOBE	1288.95	1278
JSW STEEL L	289.25	289.5
LIC HOUSING	484.1	490.95
MARICO LIMI	303.3	305.5
UNITED SPIR	3001.7	3069.9
MOTHERSON S	316.25	309.2
MRF LTD	70204.4	70249.2
NHPC LTD	26.7	26.6
NMDC LTD.	124.05	123.85
ORACLE FIN	3871.45	3829.6
OIL INDIA L	326.55	336.55
PIRAMAL ENT	2331.5	2297.45
PETRONET LN	235.4	235.4
POWER FIN C	91.9	95.3
P&G HYGIENE	9291.3	9284.05
PIDILITE IN	872.25	871.3
PUNJAB NATI	96.65	95.5
RURAL ELEC	125.7	135.65
STEEL AUTHO	74.3	73.75
SHREE CEMEN	16098.7	16180.1
SIEMENS LTD	1102.1	1092.55
SHRIRAM TRA	1326.25	1325.05
SUN TV NETW	898.4	890.55
TATA POWER	79.9	79.2
TITAN COMPA	817.7	814.85
TORRENT PHA	1317.8	1329.4

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
Alphageo	773.95	779.3
Alu Flouride	108.85	108.45
Amar Raja Bat	794	773
And Bank	39.5	39.35
And Cemen	10.74	10.27
And Paper	289.45	293.95
And Petro	54.95	52.35
Anjani Portl	181.9	182
Aries Agro Ltd	181.45	190.75
Aurobindo Ph	588.95	592.75
Avantel Soft	529.55	528.2
Avanti Feeds	2329.55	2369.3
AvonOrg	9.6	10.05
BN Rathi Sec	39.5	38.2
Balaji Amin	602	591.5
Bambino Agro	242.7	235.45
Baron Info	0.32	0.33
Bartronics	12	12.49
Bhagira Chem	284.8	287.25
Bhagya Nag	48.8	50.8
Bhagya Wood	25.7	24.5
Brilliant Sec	9.16	9.62
CIL Securi	26.45	26.65
Color Chip	36.65	37.2
Combat Drugs	27	27.4
Cont Coffee	293.45	294.45
CoroFert	521.95	536.65
Cosboard Ind	35.15	36.05
Country Club	13.25	13.36
Cubex Tub	24.95	25.5
Cybermate	2.8	2.85
DR Reddy	2145.5	2148.45
Danlaw Tec	70	69.55
DecCement	545	547.35
Divi's Lab	999.25	991.05
Divya Granit	92	90.1
Dolphin Medi	1.13	1.12
Dredgin Corp	661.25	664.8
Empee Sugars	3.91	4.11
Everest Org	140.15	138.45
Fortune Info	71.85	73.65
Four Soft	74.95	74.5
GMR Ferro	3.05	3.25
GMR Infra	17.35	17.35
GVK Power	14	14.25
Gati Corpn	100.95	102.35
Gayatri Proj	205.1	204.7
Gayatri Sugrs	9.77	9.64
Gennex Lab	3.86	3.86
GodavDru	34.45	33.55
Goldstn Tele	197.5	197
Goldstone Tech	13.4	13.43
Granules (I)	108.5	108.05
HBL Nife Pow	51.1	51.7
HYDIndus	1640	1639.65
Heritage Food	689	670.95
HindFlurocarb	10.5	10.9
ICSA Ltd	3.1	3.1
IDL Industrs	530.95	531.95
IKF Soft	0.63	0.64
IQMS Soft	15.85	16.1
IVRCL Infras	4.14	3.96
Incap	86	85.2
IndoNationl	821.25	837.95
Infotech En	622.75	626
Innaredy Com	3.1	3.1
Invinex Lab	120	120
JSTL	42.5	44.7
KCP LTD	116.7	116.2
KNR Constructio	296	291.85
Kabsons Indu	7.8	7.43
KakatiCem	263.5	271.25
KakatiTex	2.4	2.5
Kallam Spg	31.25	31.05
Karan Woo-sn	1.91	1.9
Kernex Micro	38.3	39.1
Krebs Bio	199.65	190.15
LGS Global	5.15	5.1
LancoIndus	322	316.7
Lokesh Mach	61	60.95
Lotus Choc	51.95	50
MIC Elec	5.99	6.23
Madhucon Proje	24.95	25.65
Maytas Infra	36.65	38.5
Mold-tek	54.55	57.05
Moldtek Plastic	309	319
Moschip Semi	29.85	30.15
NCLInd	207.65	204.9
NETTLINX	74.8	74.15
NMDC Ltd	124.35	123.4
NagarAgrich	38.3	38.9
NagarConst	120.1	118.6
Natco Pharma	717.15	722.65
Nava Bh Ventur	145	146.25
Neha Inter	6.98	6.72
Neocure Ther	3.43	3.61
Neuland Lab	700.55	695.4
Nihar Info Glo	12.6	13.25
Nile	734	767.7
Oil Country	38.9	39.1
Padmalaya Tele	3.99	4.2
Panyam Cemen	42.95	41.5
PennInd	54	54.6
Phytochem I	61.8	61.5
Pitti Lamin	87.1	87.65
Pokarna	197	196.35
Prajay Engs	12.64	12.04
PremiExpl	364.1	365.9
Prism Cement	119.65	115.75
Ragsan Petro	62	62.5
Rain Industries	381.9	367.3
Raj Packagin	35	33.95
Ram Informat	40.5	39
Reg.Ceramic	5.65	5.42
Restile Cer	6.65	6.97
Roopa Indus	14.9	14.94
SS Organics	8.4	8
Sagar Cem	921.25	937.05
Samkrg Pist	284.25	289.85
Sampre Nutri	55	54.5
SangInd	112.6	109.35
Satvah. Ispat	20.8	21.95
Saven Techno	26.35	25.55
Softsol	33.35	35
South Bio Tech	2.92	2.92
South Magnes	24	23.75
SrRayAlk	52.85	52.2
Srinivasa Ship	60.7	60
Sujana Metal	1.35	1.35
Sujana Towers	3.74	3.74
Sujana Univers	0.85	0.89
Surana Strip	2.23	2.13
Surana Tele	5	5.09
Suryachakra Pow	0.9	0.89
Suryalata Sp	139.9	135.15
Suryava Spin	6.35	6.09
SuvarCem	130.8	127.95
Suven Pharma	173.7	177.25
TCI Finance	27.05	26.9
Taj Gvk Hotel	153.75	157.15
Tanla Solutions	33.7	34.6
Trans Biotek	2.47	2.59
Transport Co	269	269.95
Usher Agro	5.57	5.75
VBC Ferro	37.35	39
VST Indus	2925	2942.2
Vajra Gran	2.47	2.57
Vamshi Rubb	49.9	48.8
Viceroy Hotels	14.25	14.45
VijayTextil	51	49.9
Vimta Labs	200	195.85
Virat Crane	55.75	55.2
Virinchi Con	108	109.85
VisakaInd	657.5	662.3
Vision Tech	1.42	1.43
Vista Pharma	44	43.7
Vivimed Labs	70.5	69.35
ZenoTech Lab	38.75	40.5

కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ బూటకం

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా ధ్వజం

- బీజేపీ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు ఎత్తుగడ అని మండిపాటు
- ప్రధాని మోదీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపణ
- ప్రజలు ప్రశ్నిస్తారనే సీఎం కొత్త నినాదం ఎత్తుకున్నారని విమర్శ

సాక్షిప్రతినిధి, కరీంనగర్/ సిద్దిపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడుతున్న థర్డ్‌ఫ్రంట్ నాటకం ఓ బూటకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా ధ్వజమెత్తారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చని కేసీఆర్, డిసెంబర్‌లో జరిగే ఎన్నికలకు వెళ్తే ప్రజలు నిలదీస్తారని భావించి వారిని తప్పు దోవ పట్టించేందుకు ఫ్రంట్ పేరుతో కొత్త నాటకానికి తెర తీశారని అన్నారు. ప్రధాని మోదీ వ్యతిరేక ఓటు బ్యాంకును చీల్చేందుకే కేసీఆర్ ఈ ఎత్తుగడ వేశారని ఆరోపించారు. మోదీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని బయటికి మాత్రం వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్ర ముగింపు సభ గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో, అనంతరం రాత్రి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరిగింది. హుజూరాబాద్‌లో జరిగిన సభలో కుంతియా మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నేతలు కలసికట్టుగా పనిచేయాలన్నారు. టీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని, ప్రజలను సెంటిమెంట్‌తో వంచించారని.. కేవలం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే లబ్ధి చేకూరిందని అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కలసికట్టుగా పని చేయాలని అన్నారు.

విలాసవంతమైన జీవితంలో కేసీఆర్ కుటుంబం: ఉత్తమ్

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, థర్డ్ ఫ్రంట్ పేరుతో సీఎం కేసీఆర్ నాటకాలు ఆడుతున్నారని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ బస్సుయాత్రకి ఎవరూ రావడం లేదని కేసీఆర్ అంటున్నారని, ఆయన మాటలకు హుజూరాబాద్‌లో సభే సమాధానం చెబుతుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం విలాసవంతమైన జీవితం గడుపుతోందన్నారు. డిసెంబర్‌లో ఎన్నికలు వస్తున్నందునే మే నెలలో వ్యవసాయ పెట్టుబడి ఇస్తానని కేసీఆర్ ప్రకటించారని వెల్లడించారు. వ్యవసాయ పెట్టుబడి కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే అని పేర్కొన్నారు. 2019లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు ప్రజల అవసరాలు తీర్చేలా ఉండాలని.. అయితే టీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం అప్రజాస్వామిక పరిపాలన సాగిస్తోందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క అన్నారు.

ఈటలకు జైలు తప్పదు: రేవంత్

ఆదర్శాలను వల్లించే హుజూరాబాద్ ఎమ్మెల్యే, మంత్రి ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్థిక, పౌరసరఫరాల శాఖలో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని, కోట్ల రూపాయలను ఈటల అక్రమంగా సంపాదించుకున్నారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈటల రాజేందర్ టార్గెట్‌గా ఆయన ఘాటైన ఆరోపణలు చేశారు. కస్టమ్ మిల్లింగ్ కింద రైసుమిల్లర్లకు రా రైసుకు క్వింటాల్‌కు రూ.15లు, బాయిల్డ్‌కు క్వింటాల్‌కు రూ.25 చెల్లించాల్సి ఉండగా, రూ.30, రూ.50లకు పెంచి రూ.70 కోట్ల అదనపు భారం పడేలా చేశారని, ఇందులో పెద్దమొత్తంలో చేతులు మారాయని అన్నారు. రవాణా, ఇతర ఖర్చుల కింద మిల్లర్లకు రూ.270 కోట్లు చెల్లించారని, ఇందులోనూ పెద్ద మొత్తంలో లంచంగా తీసుకోగా, ఆడిట్ అభ్యంతరాలతో బయటపడిందన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరిట రూ.కోట్ల కుంభకోణం జరిగితే.. ఆర్థికశాఖ మంత్రి గుడ్డిగా సంతకం చేసిన మంత్రి ఈటల రాజేందర్.. కేసీఆర్ అక్రమాలలో కీలకపాత్రధారని రేవంత్ విమర్శించారు. కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని, ఆయన వెంట ఈటల కూడా వెళ్లక తప్పదని అన్నారు. ఈ సభలో కాంగ్రెస్ ముఖ్యనేతలు షబ్బీర్ అలీ, వీహెచ్, జీవన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, బలరాం నాయక్, గండ్ర తదితరులు పాల్గొన్నారు.




గురువారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా. వేదికపై ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు. పాల్గొన్న ప్రజలు

మహిళా మంత్రులు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ: ఉత్తమ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మహిళా మంత్రులు లేని కేబినేట్ దేశంలో ఎక్కడైనా ఉందంటే అది తెలంగాణేనని, కేసీఆర్ కేబినెట్‌లో ఒక్క మహిళకూ ప్రాతినిధ్యం లేకపోవడం సిగ్గుచేటని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో గురువారం ఆయన మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. కేసీఆర్‌కు రెండుకోట్ల మంది మహిళల్లో ఒక్కరూ కేబినెట్‌లోకి వచ్చేందుకు అర్హులుగా కనిపించలేదా? అని ప్రశ్నించారు. తమ పాలనలో మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని గుర్తుచేశారు. ఉక్కు మహిళ సోనియా దృఢ సంకల్పంతోనే తెలంగాణ వచ్చిందని చెప్పారు. రాష్ట్రం ఇవ్వడం తప్పన్నట్లుగా మోదీ మాట్లాడినా.. టీఆర్‌ఎస్ ఎంపీలుగానీ.. కేసీఆర్‌గానీ నోరు మెదపలేదని మండిపడ్డారు. ఎంపీగా ఉన్న సీఎం కూతురు కవిత కూడా స్పందించలేదని విమర్శించారు. నాలుగేళ్లుగా మోదీని సమర్థిస్తూ వచ్చిన కేసీఆర్.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ఉత్తమ్ ప్రశ్నించారు.

బడ్జెట్ సమావేశాల తర్వాత మలివిడత బస్సుయాత్ర

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం మలివిడత బస్సుయాత్ర చేపడుతామని ఉత్తమ్ తెలిపారు. డిసెంబర్లోనే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, తమ సర్వే ప్రకారం తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆరు లక్షల మహిళా సంఘాలకు రూ.లక్ష చొప్పున రివాల్వింగ్ ఫండ్ ఇస్తామన్నారు. మీడియాను మేనేజ్ చేస్తూ కేసీఆర్ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు.



గురువారం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో ఆదివాసీ మహిళ పోరుగర్జనలో మాట్లాడుతున్న తుడుందెబ్బ అధ్యక్షుడు సోయం బాపురావ్

లడాయి ఆగదు: బాపురావ్

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్

గుడిహత్నూర్ (బోథ్): సహనం నశించాకే ఉద్యమం పురుడు పోసుకుందని.. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు లడాయి ఆగదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావ్ స్పష్టం చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ మహిళ పోరుగర్జన సభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధంగా లంబాడాలు అనుభవిస్తున్న ఎస్టీ హోదా నుంచి వారిని తొలగించేంత వరకు ఈ ఉద్యమం ఆగదన్నారు. ఉద్యమంలో ఆదివాసీ మహిళలు కీలక పాత్ర పోషించాలన్నారు. లంబాడాలు ఎస్టీలు కాదని రుజువు పత్రాలతో నివేదించినా నేటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. లంబాడాలకు ఇది వరకు ఇచ్చిన ఎస్టీ ధ్రువీకరణ, ఏజెన్సీ పత్రాలు వెంటనే రద్దు చేస్తూ నకిలీ ధృవీకరణ పత్రాలతో ఉద్యోగం పొందిన వారిని జైలుకు తరలించాలని, అలాగే డీఎస్సీ రాసిన ఆదివాసీ మహిళ అభ్యర్థులందరికీ వెంటనే ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఆదివాసీ ప్రొఫెసర్లు, మహిళలు, వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ సంఘాల నేతలు హాజరయ్యారు.

విభజన హామీలను అమలు చేయాలి




చాడ వెంకట్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ మహబూబ్‌నగర్ జిల్లా మహాసభల సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఓ ప్రాజెక్టుకు జాతీయ హోదా కలిఏంచడం, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, నిమ్స్‌కు నిధులు, హైకోర్టు విభజన వంటి అనేక అంశాలను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారం, హామీల అమలులో జాప్యంపై బీజేపీ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. త్రిపురలో అతి తక్కువ ఓట్ల తేడాతో గెలుపొందిన బీజేపీ.. మహనీయుల విగ్రహాల ధ్వంసానికి పూనుకోవడం గర్హనీయమన్నారు. కాగా, సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయబోతున్న ఫ్రంట్ విధి విధానాలను ప్రకటించాలని.. ఏ పార్టీని సంప్రదించకుండానే ఫ్రంట్ ప్రకటన చేయడం సరికాదని వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్



సంగారెడ్డి రూరల్: రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా కంది శివారులో నిర్మించనున్న పార్టీ జిల్లా కార్యాలయానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేస్తున్నామని, ఇప్పటికే 24 వేల కమిటీలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ సర్కార్ విఫలమైందన్నారు. కేంద్రం అందజేస్తున్న నిధులను రాష్ట్రం దారి మళ్లిస్తోందని ఆయన ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కేసీఆర్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని, రైతు సమన్వయ సమితుల పేరిట డబ్బు వృథా చేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కప్పిపుచ్చుకునేందుకే థర్డ్‌ఫ్రంట్ నాటకం ఆడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మహిళను రక్షణశాఖ మంత్రిని చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసాల బుచ్చిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్, రాష్ట్ర నాయకులు నందీశ్వర్‌గౌడ్, ఆకుల రాజయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో అగ్ని ప్రమాదం

చెలరేగిన మంటలు.. కాలిబూడిదైన వృక్షాలు



మామునూరు: ఖిలావరంగల్ మండలం మామునూరు విమానాశ్రయంలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో విమానాశ్రయ పర్యవేక్షక సిబ్బంది, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. మామునూరు విమానాశ్రయం వెనుక భాగంలో ఎక్కువగా ఇటుక బట్టీలు, ఆ పక్కనే రైసు మిల్లులు, పశుపరిశోధన క్షేత్రానికి సంబంధించిన డైరీఫామ్‌లు ఉన్నాయి. వీటి నుంచి ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు వచ్చి ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో పడి ఏపుగా పెరిగిన గడ్డికి మంటలు అంటుకున్నాయి. దీంతో మంటలు చెలరేగుతూ భారీ వృక్షాలు సైతం కాలిబుడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు ఆరు గంటల పాటు శ్రమించి కొంత మేరకు మంటలను అదుపులోకి తెచ్చారు.

నిట్‌లో అట్టహాసంగా స్ప్రింగ్‌స్ప్రీ ప్రారంభం



కాజీపేట అర్బన్: కాజీపేటలోని జాతీయ సాంకేతిక కళాశాల (నిట్)లో గురువారం స్ప్రింగ్ స్ప్రీ–2018 వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విభిన్న సంప్రదాయాలు, సంస్కృతులకు వేదికగా వసంతోత్సవం నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి స్ప్రింగ్ స్ప్రీ వంటి వేడుకలు దోహదం చేస్తాయన్నారు. నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు మాట్లాడుతూ. విద్యార్థులే నిర్వాహకులుగా ప్రతి ఏడాది వార్షిక కల్చరల్ ఫెస్ట్‌గా స్ప్రింగ్‌స్ప్రీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేందుకు ఏకత్వగా నామకరణం చేసినట్లు వెల్లడించారు. మూడు రోజులపాటు 50కి పైగా ఈవెంట్లు, తొలిరోజు క్యాంపస్ క్వీన్ పేరిట ఫ్యాషన్ షో, రెండో రోజు రాక్ సింగర్ సోనా మోహపాత్రా, మూడో రోజు ఇండియన్ ఐడల్ విజేత సింగర్ రేవంత్ ప్రదర్శలు ఉంటాయని వివరించారు. భారతదేశంలోని సుమారు వంద కళాశాలల నుంచి పదివేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. వేడుక ప్రారంభోత్సవంలో హ్యాపీ డేస్, స్వామీరారా ఫేం సినీ హీరో నిఖిల్‌తో పాటు తన కిరాక్ టీంతో పాల్గొని అలరించాడు.

ఉనికి కోసమే కాంగ్రెస్ ఆరాటం

బస్సు యాత్ర కాదది.. తుస్సు యాత్ర : హరీశ్

- ‘పేకాట ముదుపులు’మరిచారా?
- గజ్వేల్‌లో సీఎం మినీ క్యాంపు కార్యాలయం ప్రారంభం



గురువారం గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్. చిత్రంలోప్రభాకర్ రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరచిపోతుండటంతో కేవలం ఉనికిని కాపాడుకోవడానికే ఆ పార్టీ నేతలు బస్సు యాత్ర చేస్తున్నారని, అయితే ఎక్కడా ప్రజల నుంచి స్పందన లేక అది తుస్సు యాత్రగా మారిందని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గురువారం ఆయన గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మినీ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. వాస్తుపూజ, హోమం తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడారు. ఇన్నేండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ఏనాడూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిందిలేదన్నారు. ఎండాకాలం వచ్చిందంటే ఎక్కడికక్కడ మహిళలు బిందెలతో నాయకులను అడ్డుకునే పరిస్థితి ఉండేదని, 7 గంటల కరెంటు అని చెప్పినా... రెండు గంటలు కూడా సక్రమంగా రాక పొలాలు ఎండిపోయి కడుపుమండిన రైతులు ధర్నాలు, ఆందోళనలతో కాలం గడపాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. నేడు ‘మిషన్ భగీరథ’ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేసి పంటలు ఎండిపోకుండా కాపాడుతున్నామని, చెప్పారు. చెరువులు, కుంటల పునరుద్ధరణకు నిధులడిగితే రూపాయి కూడా ఇచ్చే పరిస్థితి గతంలో లేదన్నారు. చెరువుల అభివృద్ధికి రూ.15వేల కోట్లు ఖర్చు చేస్తే.. ఒక్క ఉమ్మడి మెదక్ జిల్లాలోనే రూ.వెయ్యికోట్లతో ‘మిషన్ కాకతీయ’పథకం ద్వారా చెరువులు, కుంటలు బాగు చేశామన్నారు.

రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం

కాంగ్రెస్ పాలనలోని పెండింగ్ ప్రాజెక్టులను నేడు రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి నీళ్లిస్తున్న విషయాన్ని ప్రజలు చూస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. గతంలో ఇష్టానుసారంగా నడిచే పేకాట క్లబ్బులను ప్రోత్సహించి నెలనెలా కోట్లు దండుకున్న చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాం లో గుడుంబా, కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులను ప్రోత్సహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పీడీ యాక్ట్ ప్రయోగించి వాటిని ఉక్కుపాదంతో అణచివేస్తున్నామని చెప్పారు. దశాబ్దాల కాలంగా దేశంలో సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్, బీజేపీ కృషి చేయలేదన్నారు. రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడంలోనూ కేంద్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు ఈ నేపథ్యంలోనే దేశ రాజకీయాల్లో మార్పు రావాలని కేసీఆర్ కోరుకుంటున్నారన్నారు.

‘గడ్డి’ మేశారు..!

- యాదాద్రి దేవస్థానం గోశాల పశుగ్రాసంలో రూ.17 లక్షల కుంభకోణం
- ఏడుగురు అధికారులకు మెమోలు జారీ



యాదగిరికొండ: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గోశాలలో పశుగ్రాసం కుంభకోణం చోటు చేసుకుంది. కాంట్రాక్టర్, కొందరు అధికారులు కుమ్మక్కై సుమారు రూ.17 లక్షలు స్వాహా చేశారు. ఐదేళ్లుగా జరుగుతున్న ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దేవస్థానం గోశాలలో ప్రస్తుతం ఆవులు, ఎడ్లు కలిపి 97 వరకు ఉన్నాయి. వీటికి మేతకోసం తుర్కపల్లికి చెందిన నర్సింహ గడ్డి సరఫరా కాంట్రాక్టు తీసుకున్నాడు. పచ్చిగడ్డి టన్నుకు రూ.1,850, ఎండుగడ్డి టన్నుకు రూ.4,100 చొప్పున సరఫరా చేస్తున్నాడు. గత ఏడాది బాల్‌రెడ్డి అనే అధికారి దేవస్థానం సూపరింటెండెంట్‌గా వచ్చేనాటికి రికార్డుల్లో ఉన్న లెక్కల ప్రకారం గోశాలలో 2,600 కిలోల ఎండు గడ్డి ఉండాలి. కానీ, 600 కేజీలు మాత్రమే ఉంది. వాస్తవానికి గోశాలలోని గడ్డి నిల్వ చేసే షెడ్డు సామర్థ్యం సుమారు 600 కిలోలు మాత్రమే ఉంటుంది. కానీ, రిజిస్టర్‌లో 2,600 కేజీలుగా నమోదు చేయడంతో ఆయనకు అనుమానం వచ్చింది. ప్రతిసారీ గోశాలకు ట్రాక్టర్లలో తరలిస్తున్న ఎండు గడ్డికి, వాస్తవంగా రావాల్సిన గడ్డికి పొంతన లేకపోవడం, అధికారులు మంజూలు చేసే బిల్లుల్లో కూడా తేడాలు ఉండడంతో ఆయన ఈ విషయంపై దేవస్థానం ఈఓ గీతారెడ్డికి గతనెల 2న ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఓ కమిటీ ద్వారా విచారణ జరిపించగా ఈ విషయం వెలుగుచూసింది. కమిటీ నివేదిక మేరకు ఈఓ ఈ వ్యవహారంతో సంబంధం ఉందని భావిస్తున్న బలరాంసింగ్ యాదవ్, శివకుమార్, రామారావు, రామారావునాయక్, సంద్ర మల్లేశ్, బాల్‌రెడ్డి, శంకర్‌నాయక్ అనే ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఈఓ గీతారెడ్డి తెలిపారు.

నరకంలోంచి బయటపడ్డాం

గల్ఫ్ బాధితుల గోడు

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ. లక్షలు దండుకుని హింసించారు
- కంపెనీల పేరుతో ఏజెంట్ల మోసం
- కామారెడ్డికి చేరిన 14 మంది గల్ఫ్ బాధితులు
- మరో 50 మందికి పైగా గల్ఫ్‌లోనే..



కామారెడ్డి చేరిన గల్ఫ్‌బాధితులు

కామారెడ్డి క్రైం: గల్ఫ్‌లో మనోళ్ల గోస అంతాఇంత కాదు. ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి ఏజెంట్లు లక్షల రూపాయలు వసూలు చేశారు. తీరా అక్కడి వెళ్లాక నరకం చూపించారు. వెట్టిచాకిరి చేయించడం.. డబ్బులడిగితే పాకిస్తానీలతో కొట్టించడం లాంటి చిత్రహింసలకు గురి చేశారు. చివరికి అక్కడి ఓ సీఐడీ అధికారి పుణ్యమా అంటూ ఆ నరక కూపం నుంచి కొంత మంది ప్రాణాలతో బయట పడ్డారు. తెలంగాణలోని నాలుగు జిల్లాలకు చెందిన 70 మంది బాధితుల్లో 14 మంది గురువారం కామారెడ్డికి చేరుకున్నారు. గల్ఫ్ ఏజెంట్లు, దుబాయ్‌లో వెలుస్తున్న ఇక్కడి వారి కంపెనీల ఉచ్చులో పడి ఇప్పటికీ మరో 30 మంది జైలులో, మరో 25 మంది క్యాంపుల్లో బిక్కుబిక్కుమంటు గడుపుతున్నారని ఇక్కడికి చేరిన బాధితులు చెబుతున్నారు. వారికి జరిగిన మోసాలు, గాయాలు, నష్టాలు గుర్తు చేసుకుంటు కంటతడి పెట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

అసలేం జరిగిందంటే..

కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న ఓ గల్ఫ్ ఏజెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిరిసిల్ల, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు చెందిన యువకులను నమ్మబలికాడు. ఏడాది కాలంలో సుమారు 70 మంది వరకు దుబాయ్‌లోని షార్జాఅలీముసా ప్రాంతానికి పంపించారు. కంపెనీ వీసాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.80 వేల నుంచి లక్ష వరకు వసూలు చేశారు. ఏసీ భవనాల్లో క్లీనింగ్ సెక్షన్‌లో పని ఉందంటూ నమ్మబలికారు. అక్కడకు వెళ్లాక ఏడారి ప్రాంతంలోని ఓ క్యాంపులో ఉంచారు. రకరకాల కంపెనీల పేరుతో లేబర్ పనికి ఉదయాన్నే వచ్చి తీసుకెళ్లే వారు. భవన నిర్మాణ పనులు, ఎండలో బస్తాలు మోయించడం, కార్పెంటర్, హెల్పర్ లాంటి పనులు చేయించారు. నెలకు రూ.25 వేల జీతం ఉంటుందని చెప్పి, అక్కడికి వెళ్లాక ఒక్క రూపాయి ఇవ్వలేదు. కనీసం నీళ్లు, కరెంట్ సౌకర్యం కూడా లేని గదిలో వదిలేశారని బాధితులు వాపోయారు. గురువారం కామారెడ్డికి తిరిగి వచ్చిన వారిలో జిల్లాలోని ఆయా గ్రామాలకు చెందిన బీరయ్య (ఎర్రపహాడ్) బాబు (ఎల్లారెడ్డి), రమేశ్, శంకర్(గౌరారం), రత్నం, చిక్కపల్లి రాజు, సాయిలు, ఖాసీం (కామారెడ్డి) కుమార్ (పోచంపాడ్), విజయ్ (నార్సింగి), తిరుపతి (సిరిసిల్లా), సుదర్శన్ (నిజామాబాద్), క్రమోద్దిన్ (సిద్దిపేట), సలీమ్ (వరంగల్) ఉన్నారు. వీరంతా అప్పుల పాలయ్యామని లబోదిబోమంటున్నారు.

అక్కడి అధికారి చొరవతో..

ఐదు నెలల పాటు కష్టాలు భరించిన 70 మంది బాధితులు బయట పడేందుకు ఒక్కటయ్యారు. షార్జా అలీముసాలో మూడు కిలోమీటర్ల మేర ఈ నెల 3వ తేదీ అందరూ కలసి ర్యాలీ నిర్వహించారు. పోలీసులు, మిలిటరీ వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఓ సీఐడీ అధికారి కంపెనీ ప్రతినిధులను పిలిపించగా.. వీరందరిని విడతల వారీగా స్వస్థలాలకు పంపిస్తామని వారు హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి వారిని క్యాంపునకు తీసుకువెళ్లి రాత్రి 12 గంటల తర్వాత తలుపులు వేసి దాడి చేశారు. 14 మందికి టికెట్లు బుక్ చేయించి కట్టుబట్టలతో పంపించారు. 14 మంది హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గురువారం ఉదయం దిగారు. కామారెడ్డిలోని వారి స్నేహితులు వాహనాల్లో వెళ్లి ఎయిర్‌పోర్టు నుంచి తీసుకువచ్చారు. నరకం నుంచి బయటపడ్డామని, అప్పుల పాలయ్యామని బాధితులు వాపోయారు. కామారెడ్డి నుంచి తమ సొంత స్థలాలకు గురువారం పయనమయ్యారు. అక్కడి జైళ్లలో, క్యాంపులో మిగిలి పోయిన కార్మికులను, తోటి వారిని స్వదేశానికి తీసుకురావడానికి అధికారులు, నాయకులు కృషి చేయాలని వారు కోరుతున్నారు. స్థానిక నాయకుడు పైల కృష్ణారెడ్డి వారికి భోజనాలు చేయించి విషయాన్ని కాంగ్రెస్ నేత షబ్బీర్‌అలీ దృష్టికి తీసుకువెళ్లారు. మిగతా వారందరిని సురక్షితంగా రప్పించేందుకు అవసరమైతే అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతానని షబ్బీర్‌అలీ హామీ ఇచ్చినట్లు కృష్ణారెడ్డి తెలిపారు.

పాకిస్తానీలతో కొట్టించారు..

ఆరు నెలలు గడుస్తున్నా జీతాలు ఇవ్వరేమిటని ప్రశ్నించిన వారిని అక్కడి కంపెనీ ప్రతినిధులైన మన ప్రాంతం వారే పాకిస్తానీలను పిలిపించి చిత్రహింసలకు గురిచేసే వారని బాధితులు వాపోయారు. పెట్టింది తినాలి, చెప్పిన పని చేయాలే తప్ప ఎదురు మాట్లాడకూడదని దాడులు చేసే వారని చెప్పారు. నానా హింసలు భరించి చివరకు బయటపడ్డామన్నారు.

పాఠశాల విద్యార్థుల కోసం కాల్‌సెంటర్

సాక్షి, హైదరాబాద్: పరీక్షల సమయంలో ఒత్తిడిని జయించేందుకు, పరీక్షలపై సలహాలు, కెరీర్, ఇతర విద్యా సంబంధిత విషయాలను తెలుసుకునేందుకు పాఠశాల విద్యా శాఖ విద్యార్థుల కోసం కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసింది. పాఠశాల విద్యా డైరెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కాల్‌సెంటర్‌కు (1800 425 7462) ఫోన్ చేసి విద్యార్థులు తగిన సలహాలు, సూచనలు పొందవచ్చని పాఠశాల విద్య డైరెక్టర్ కిషన్ వెల్లడించారు. విద్యార్థుల సందేహాలకు క్వాలిఫైడ్ కౌన్సెలర్లు తగిన సలహాలు, సూచనలు ఇస్తారని వెల్లడించారు. ఈ సదుపాయం మార్చి 12వ తేదీన అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విద్యార్థులే కాకుండా తమ పిల్లలకు సంబంధించిన సమస్యలపై తల్లిదండ్రులు కూడా ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 వరకు సంప్రదించవచ్చని వివరించారు.

‘13న యథావిధిగా ఇంటర్ పరీక్షలు’

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 13వ తేదీన జరగనున్న ఇంటర్ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, వాటి నిర్వహణకు అందరూ సహకరించాలని ఇంటర్మీడియెట్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో కోరింది. 13వ తేదీన ఎమ్మార్పీఎస్ బంద్‌కు పిలుపునిచ్చినా.. పరీక్షలను వాయిదా వేసే పరిస్థితి లేదని పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13న 1,294 కేంద్రాల్లో కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. పరీక్షలను వాయిదా వేస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని, ఆ ప్రభావం నీట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలపై పడుతుందని వివరించింది. ఈ నేపథ్యంలో 13వ తేదీ నాటి పరీక్షలకు ఎమ్మార్పీఎస్ కూడా సహకరించాలని కోరింది.

హైకోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయవాదుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. హైకోర్టు న్యాయవాదుల సంఘం హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు జస్టిస్ జె.ఉమాదేవి, జస్టిస్ టి.రజని, న్యాయవాది ఎం.భాస్కరలక్ష్మి, రక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.బాలలత, ‘మన చెరువులు రక్షించుకుందాం’స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ జవీన్ జైరత్ తదితరులు హాజరయ్యారు. మహిళా సాధికారత, నేటి సమాజంలో మహిళల పాత్ర వంటి అంశాలపై వక్తలు మాట్లాడారు.

నాడు కోహ్లిని ధోని వద్దన్నాడు: వెంగ్‌సర్కార్



ముంబై: ప్రస్తుత భారత కెప్టెన్ విరాట్ కోహ్లిని 2008లో జట్టులోకి ఎంపిక చేసిన కారణంతో తాను పదవి కోల్పోయానని అంటున్నాడు నాటి చీఫ్ సెలెక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్. కోహ్లిని తీసుకోవడం నాటి కెప్టెన్ ధోని, కోచ్ కిర్‌స్టెన్‌లకు ఏమాత్రం ఇష్టం లేదని తెలిపాడు. వీరిద్దరితో పాటు నాడు బీసీసీఐ కోశాధికారిగా ఉన్న శ్రీనివాసన్ తమిళనాడు ఆటగాడు బద్రీనాథ్ కోసం పట్టుబట్టారని వివరించాడు. 'కోహ్లి అండర్-19 ప్రపంచకప్ గెలవడంతో ఆస్ట్రేలియాలో అండర్-23 వర్ధమాన ఆటగాళ్ల టోర్నీకి అతడిని ఎంపిక చేశాం. కోహ్లి ఓపెనర్‌గా వచ్చి న్యూజిలాండ్ జట్టుపై 123 పరుగులు చేశాడు. దీంతో అతడు టీమిండియాలోకి రావడానికి శ్రీలంక సిరీసే సరైనదిగా భావించాం. అయితే... కోహ్లి ప్రతిభ పూర్తిగా తెలియని కిర్‌స్టెన్, ధోని దీనిని వ్యతిరేకించారు. తమ చెన్నై ఫ్రాంచైజీ బ్యాట్స్‌మన్ బద్రీనాథ్‌ను పక్కన బెట్టాల్సి వస్తుండటంతో ధోని, శ్రీనివాసన్ కూడా ఇష్టపడలేదు. ఆ ఏడాది 800 పరుగులు చేసిన బద్రీనాథ్ సంగతేంటని శ్రీనివాసన్ వాదించారు. ఈ విషయాన్ని బీసీసీఐ అధ్యక్షుడు శరద్ పవార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నన్ను పదవి నుంచి తప్పించారు.



శిఖర్ నడిపించగా...

భారత్ అలవోక విజయం ● 6 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు ● ధావన్ అర్ధ సెంచరీ ● నిదహాస్ టి20 టోర్నీ

శ్రీలంక చేతిలో పరాజయం నుంచి భారత్ వెంటనే కోలుకుంది. బౌలర్ల సమష్టి ప్రదర్శనకు తోడు శిఖర్ ధావన్ మరోసారి కదం తొక్కడంతో ముక్కోణపు టి20 టోర్నీలో బోణీ చేసింది. ఆడుతూ పాడుతూ బంగ్లాదేశ్‌పై ఏకపక్ష విజయాన్ని అందుకుంది. టి20 తరహాలో భారీ షాట్లు, మెరుపు బ్యాటింగ్ పెద్దగా కనిపించని ఈ మ్యాచ్‌లో టీమిండియా పూర్తి ఆధిపత్యం కొనసాగించగా... బంగ్లాదేశ్ కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయింది. ఫలితంగా మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే గెలుపు రోహిత్ సేన ఖాతాలో చేరింది.

కొలంబో: ముక్కోణపు టి20 టోర్నీ (నిదహాస్ ట్రోఫీ)లో భారత్ తొలి విజయాన్ని అందుకుంది. గురువారం ఇక్కడి ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. లిటన్ దాస్ (30 బంతుల్లో 34; 3 ఫోర్లు), షబ్బీర్ రహమాన్ (26 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భారత బౌలర్లలో ఉనాద్కట్ 3, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' విజయ్ శంకర్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 140 పరుగులు చేసింది. శిఖర్ ధావన్ (43 బంతుల్లో 55; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) తన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో హాఫ్ సెంచరీ నమోదు చేయగా, సురేశ్ రైనా (27 బంతుల్లో 28; 1 ఫోర్, 1 సిక్స్) సహకారం అందించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 54 బంతుల్లో 68 పరుగులు జోడించారు. చివర్లో మనీశ్ పాండే (19 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు) రాణించాడు. తమ తర్వాతి మ్యాచ్‌లో భారత్ సోమవారం శ్రీలంకతో తలపడుతుంది.


ఉనాద్కట్‌కు సహచరుల అభినందన

నిస్సారంగా...

భారత్‌తో గతంలో ఆడిన ఐదు టి20ల్లోనూ ఓడిన బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఈ మ్యాచ్‌లోనూ నాసిరకంగా కనిపించింది. టి20 స్థాయిలో ఎలాంటి మెరుపులు లేకుండా, ఒక్క ఆటగాడు కూడా ధాటిగా ఆడకుండా జట్టు ఇన్నింగ్స్ సాగింది. మధ్యలో భారత్ రెండు క్యాచ్‌లు వదిలేసినా, రనౌట్ అవకాశాలు వృథా చేసినా ఆ జట్టు వాటిని ఉపయోగించుకోలేకపోయింది. జట్టు ఇన్నింగ్స్‌లో ఏకంగా 55 డాట్ బాల్స్ ఉండటం పరిస్థితిని సూచిస్తోంది. ఉనాద్కట్ వేసిన మూడో ఓవర్లో సిక్సర్ కొట్టిన సర్కార్ (14) అదే ఓవర్లో వెనుదిరగడంతో బంగ్లా తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత శార్దుల్ తొలి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాదిన తమీమ్ (15) తర్వాతి బంతికే అవుటయ్యాడు. విజయ్ శంకర్ తొలి ఓవర్లో రైనా, సుందర్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన దాస్ ఆ తర్వాత మరికొన్ని పరుగులు జోడించగలిగాడు. కీపర్ కార్తీక్ క్యాచ్‌తో ముష్ఫికర్ (18) ఆట ముగిసింది. రివ్యూ ద్వారా భారత్ ఈ ఫలితం పొందగా... విజయ్ శంకర్ కెరీర్‌లో ఇది తొలి వికెట్ కావడం విశేషం. కెప్టెన్ మహ్ముదుల్లా (1) కూడా ప్రభావం చూపలేకపోయాడు. దాస్‌ను చహల్ ఔట్ చేయగా, చివర్లో వేగంగా ఆడే ప్రయత్నం చేసిన షబ్బీర్‌ను చక్కటి బంతితో ఉనాద్కట్ డగౌట్‌కు పంపించాడు. బంగ్లా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేసిన మన బౌలర్లు కొన్ని సార్లు గతి తప్పారు. 11 వైడ్‌లు, 2 నోబాల్‌లు సహా మొత్తం 15 పరుగులు ఎక్స్‌ట్రాలు ఇచ్చారు.

అర్ధసెంచరీ భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్‌కు పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయినా ఎలాంటి ఇబ్బంది లేకుండా టీమిండియా విజయం దిశగా దూసుకెళ్లింది. ఇన్నింగ్స్ రెండో బంతిని ఫోర్‌గా మలచి ధావన్ శుభారంభం చేయగా, రెండో ఓవర్లో రోహిత్ (17) తాను ఎదుర్కొన్న ఐదు బంతుల వ్యవధిలో మూడు బౌండరీలు బాదాడు. అయితే ముస్తఫిజుర్ బంతిని రోహిత్ వికెట్లపైకి ఆడుకోగా, కొద్ది సేపటికి రూబెల్ బౌలింగ్‌లో రిషభ్ పంత్ (7) కూడా అదే తరహాలో అవుటయ్యాడు. ఈ దశలో ధావన్, రైనా చకచకా పరుగులు సాధిస్తూ పోయారు. ధావన్ గత మ్యాచ్ జోరును కొనసాగించగా, రైనా మాత్రం తన శైలికి భిన్నంగా నెమ్మదిగా ఆడాడు. మెహదీ హసన్ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్ ద్వారా కొట్టిన సిక్సర్‌తో రైనా అంతర్జాతీయ టి20ల్లో 50 సిక్సర్లు పూర్తి చేసుకోవడం విశేషం. నజ్ముల్ బౌలింగ్‌లో ఫైన్‌లెగ్ దిశగా ఫోర్ కొట్టిన ధావన్ 35 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. విజయానికి చేరువైన దశలో తక్కువ వ్యవధిలో వీరిద్దరు వెనుదిరిగినా... దినేశ్ కార్తీక్ (2 నాటౌట్)తో కలిసి పాండే జట్టును గెలిపించారు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ (సి) ఉనాద్కట్ (బి) శార్దుల్ 15; సౌమ్య సర్కార్ (సి) చహల్ (బి) ఉనాద్కట్ 14; లిటన్ దాస్ (సి) రైనా (బి) చహల్ 34; ముష్ఫికర్ (సి) కార్తీక్ (బి) శంకర్ 18; మహ్ముదుల్లా (సి) శార్దుల్ (బి) శంకర్ 1; షబ్బీర్ రహమాన్ (సి) కార్తీక్ (బి) ఉనాద్కట్ 30; మెహదీ హసన్ (సి) పాండే (బి) ఉనాద్కట్ 3; తస్కీన్ అహ్మద్ (నాటౌట్) 8; రూబెల్ హొస్సేన్ (రనౌట్) 0; ముస్తఫిజుర్ రహమాన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 139.**
వికెట్ల పతనం: 1-20, 2-35, 3-66, 4-72, 5-107, 6-118, 7-134, 8-135.
బౌలింగ్: ఉనాద్కట్ 4-0-38-3, సుందర్ 4-0-23-0, శార్దుల్ 4-0-25-1, చహల్ 4-0-19-1, శంకర్ 4-0-32-2.
భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) ముస్తఫిజుర్ 17; ధావన్ (సి) దాస్ (బి) తస్కీన్ అహ్మద్ 55; రిషభ్ పంత్ (బి) రూబెల్ 7; రైనా (సి) మెహదీ హసన్ (బి) రూబెల్ 28; పాండే (నాటౌట్) 27; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 140.** **వికెట్ల పతనం:** 1-28, 2-40, 3-108, 4-123.
బౌలింగ్: ముస్తఫిజుర్ 4-0-31-1, తస్కీన్ 3-0-28-1, రూబెల్ 3.4-0-24-2, మెహదీ హసన్ 4-0-21-0, సౌమ్య సర్కార్ 1-0-8-0, మహ్ముదుల్లా 1-0-11-0, ఇస్లాం 2-0-15-0.

దోషిగా తేలితే ఏ శిక్షకైనా సిద్ధం: షమీ

కోల్‌కతా: పెను వివాదంలో చిక్కుకున్న భారత పేసర్ మొహమ్మద్ షమీ తన భార్య మోపిన ఆరోపణలన్నీ నిరాధారమన్నాడు. ఈ ఆరోపణల్ని రుజువు చేస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమన్నాడు. దోషినని తేలితే ముందుగా ఆమెకు, అభిమానులకు క్షమాపణలు చెబుతానన్నాడు. అతని భార్య హసీన్ జహాన్ పేసర్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ కోల్‌కతా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ వివాదంపై ఓ మీడియా సంస్థతో షమీ మాట్లాడుతూ 'మేమిద్దరం బాగానే ఉంటున్నాం. సఫారీ టూర్ నుంచి వచ్చిన వెంటనే హోలీ వేడుక చేసుకున్నాం. కలిసి షాపింగ్‌కు వెళ్లాం. కానీ ఈ నిరాధార ఆరోపణలేంటో అర్థం కావడంలేదు. ఈ విషయం కనుక్కుందామని నా భార్యకు చాలాసార్లు ఫోన్ చేశా. ఆమె మాత్రం ఫోన్ ఎత్తడం లేదు. ఒక వేళ నా భార్యవైపే న్యాయముంటే ఏ శిక్షకైనా సిద్ధం' అని షమీ అన్నాడు. త్వరలోనే నిజానిజాలు తేలతాయని, సమస్య కూడా పరిష్కారమవుతుందని పేసర్ తెలిపాడు.



హీరోయిన్‌ను పెళ్లాడాలనుకున్నాడు...

షమీకి వివాహేతర సంబంధాలున్నాయని, పెళ్లైనప్పటి నుంచి అత్తింటి వారు గృహహింసకు పాల్పడుతున్నారని ఆరోపణలు చేసిన అతని భార్య హసీన్ తాజాగా ఓ టీవీ చానెల్‌తో మరో విషయాన్ని వెల్లడించింది. కోహ్లి బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మను చేసుకున్నట్లే షమీ తను కూడా ఓ హీరోయిన్‌ను చేసుకోవాల్సిందని, పొరపాటుగా నిన్ను (హసీన్‌ను ఉద్దేశించి) కట్టుకున్నానని పదేపదే అనేవాడని ఆమె ఆరోపించింది. 'గతేడాది శ్రీలంక పర్యటనకు తన బదులు పాకిస్తాన్‌కు చెందిన ప్రియురాలిని తీసుకెళ్దామనుకున్నాడు. షమీ నన్నెపుడు భార్యగా చూడలేదు. విందులకు, వేడుకలకు తన భార్యగా వెంట తీసుకెళ్లలేదు. ఎప్పుడూ విడాకులు కావాలనే అడిగేవాడు. గత ఐదేళ్లుగా అతనికి తుబా అనే మహిళతో వివాహేతర సంబంధముంది. అది దాచి నన్ను పెళ్లి చేసుకున్నాడు' అని హసీన్ తెలిపింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ చీర్ లీడర్, మోడల్ అయిన హసీన్ జహాన్‌కు 2012 ఐపీఎల్ సందర్భంగా షమీ పరిచయమయ్యాడు. రెండేళ్ల ప్రేమించుకున్నాక షమీ, హసీన్ 2014లో వివాహం చేసుకున్నారు.

తొమ్మిదేళ్ల తర్వాత...

మాస్టర్స్ టోర్నీ మెయిన్ 'డ్రా'లో యూకీ బాంబ్రీ



కాలిఫోర్నియా (అమెరికా): భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ యూకీ బాంబ్రీ తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి ఓ మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ప్రతిష్టాత్మక ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో ఈ ఢిల్లీ ప్లేయర్ మెయిన్ 'డ్రా' బెర్త్ దక్కించుకున్నాడు. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో యూకీ 6-4, 6-2తో భారత్‌కే చెందిన రామ్‌కుమార్ రామనాథన్‌ను ఓడించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 110వ స్థానంలో ఉన్న యూకీ గతంలో ఒకేఒక్కసారి 2009లో మయామి మాస్టర్స్ సిరీస్ టోర్నీ మెయిన్ 'డ్రా'లో ఆడినా... తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు.

షరపోవాకు షాక్...

ఇదే టోర్నీ మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, రెండుసార్లు ఈ టైటిల్ నెగ్గిన షరపోవా (రష్యా) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. జపాన్ క్రీడాకారిణి నయోమి ఒసాకా 6-4, 6-4తో ప్రపంచ 41వ ర్యాంకర్ షరపోవాపై సంచలన విజయం సాధించింది. 2003 తర్వాత ఈ టోర్నీలో షరపోవా తొలి రౌండ్‌లోనే ఓడిపోవడం ఇదే ప్రథమం.

అఫ్గాన్ మళ్లీ ఓడింది

బులవాయో: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో అఫ్గానిస్తాన్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడింది. దాంతో ఆ జట్టు సూపర్ సిక్స్ చేరడం క్లిష్టంగా మారింది. గురువారం జరిగిన పోరులో హాంకాంగ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 30 పరుగుల తేడాతో అఫ్గాన్‌ను ఓడించింది. మొదట హాంకాంగ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 241 పరుగులు చేసింది. అన్షుమన్(65) రాణించాడు. తర్వాత అఫ్గానిస్తాన్ లక్ష్యాన్ని 46 ఓవర్లలో 226 పరుగులకు కుదించగా... 9 వికెట్ల నష్టానికి 195 పరుగులే చేయగలిగింది. హాంకాంగ్ బౌలర్ ఎహ్‌సాన్ 4 వికెట్లు తీశాడు. మరో మ్యాచ్‌లో వెస్టిండీస్ 6 వికెట్ల తేడాతో పపువా న్యూగినియాను ఓడించింది. పీఎన్‌జీ 42.4 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌటైంది. బ్రాత్‌వైట్ 5 వికెట్లు తీశాడు. తర్వాత వెస్టిండీస్ 43 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ హోల్డర్ (99 నాటౌట్) సెంచరీకి పరుగు దూరంలో నిలిచాడు. ఇతర మ్యాచ్‌ల్లో స్కాట్లాండ్ 4 వికెట్లతో నేపాల్‌పై, యూఏఈ 6 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై నెగ్గాయి.

దేవధర్ ట్రోఫీ విజేత భారత్ 'బి'

ఫైనల్లో కర్ణాటకపై 6 వికెట్లతో విజయం


అయ్యర్

ధర్మశాల: దేవధర్ ట్రోఫీలో అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో తన జట్టును ఫైనల్ చేర్చిన రవికుమార్ సమర్థ్ మరోసారి సెంచరీతో మెరిసినా కర్ణాటకకు టైటిల్ అందించలేకపోయాడు. గురువారం భారత్ 'బి'తో జరిగిన ఫైనల్లో కర్ణాటక 6 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. సమర్థ్ (107; 8 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత శతకం సాయంతో మొదట కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 279 పరుగులు చేయగా... భారత్ 'బి' 48.2 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 281 పరుగులు చేసి నెగ్గింది. ఈ ఏడాది దేశవాళీల్లో టన్నుల కొద్దీ పరుగులు చేసిన మయాంక్ (14), నాయర్ (10) త్వరగానే అవుటయ్యారు. ఫామ్‌లో ఉన్న సమర్థ్, సీఎం గౌతమ్ (74; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి జట్టును ఆదుకున్నాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. చివర్లో శ్రేయస్ గోపాల్ (38; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. ఖలీల్ 3, ఉమేశ్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 'బి' బ్యాట్స్‌మెన్ సమష్టిగా రాణించడంతో విజయం సాధించింది. గైక్వాడ్ (58; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఈశ్వరన్ (69; 8 ఫోర్లు)లతో పాటు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (61; 7 ఫోర్లు), మనోజ్ తివారి (59 నాటౌట్; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

ఆఫీస్ బేరర్ల ఉద్వాసనకు సీఓఏ నివేదిక

న్యూఢిల్లీ: పాలనా వ్యవహారాల్లో జస్టిస్ లోధా సంస్కరణల అమలుపై బీసీసీఐ ఆఫీస్ బేరర్లు, బోర్డు పరిపాలక కమిటీ (సీఓఏ) మధ్య అసలే అంతంతమాత్రంగా ఉన్న సంబంధాల్లో మరో కుదుపు. బీసీసీఐ నియమావళి ప్రకారం పదవీ కాలం పూర్తయినందున ప్రస్తుత ఆఫీస్ బేరర్లు తప్పుకోవాలని, కొత్త రాజ్యాంగం అమలుకు ముందే లోధా సిఫార్సుల ప్రకారం సర్వసభ్య సమావేశం నిర్వహించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని అపెక్స్ కోర్టును సీఓఏ కోరింది. ఈ మేరకు సీఓఏ సభ్యులు వినోద్‌రాయ్, డయానా ఎడుల్జీ గురువారం తమ ఎనిమిదో స్థాయీ నివేదికను సుప్రీంకోర్టుకు అందజేశారు. మార్చి 1వ తేదీతోనే పదవీ కాలం పూర్తయిన తాత్కాలిక అధ్యక్ష, కార్యదర్శులు సీకే ఖన్నా, అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరి, ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లాలను తొలగించి, కొత్తగా ఎన్నిక నిర్వహించాలని ఇందులో కోరారు. అయితే... దీనిని వీరు ముగ్గురూ ప్రతిఘటించనున్నట్లు తెలుస్తోంది.

భారత మహిళలకు తొలి ఓటమి

సియోల్: దక్షిణ కొరియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ కొరియాతో గురువారం ఇక్కడ జరిగిన మూడో మ్యాచ్‌లో రాణి రాంపాల్ నేతృత్వంలోని భారత్ 1-2తో ఓడింది. కొరియా తరఫున సోల్ కీ చేన్ (12వ ని.లో), యురిమ్ లీ (14వ ని.లో) గోల్స్ నమోదు చేయగా... మన జట్టు తరఫున లాల్రేమ్‌సియామి (16వ ని.లో) ఓ గోల్ కొట్టింది. ఇరు జట్ల మధ్య నాలుగో మ్యాచ్ శుక్రవారం జరుగనుంది.



గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న జయమ్మ

జయమ్మకు నారీ శక్తి పురస్కారం ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: నారీ శక్తి పురస్కారాన్ని 2017 సంవత్సరానికిగానూ తెలంగాణ నుంచి జయమ్మ అందుకున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మహిళలను గుర్తించి కేంద్రం నారీ శక్తి పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ నేపథ్యంలో హెచ్ఐవీ నియంత్రణకు, సెక్స్ వర్కర్ల కుటుంబాల పరిరక్షణకు చేస్తున్న ఉద్యమాలకు గుర్తింపుగా తెలగాణకు చెందిన జయమ్మను నారీ శక్తి పురస్కారానికి కేంద్రం ఎంపిక చేసింది. గురువారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. అమాయక మహిళలను పడుపు వృత్తిలోకి నెట్టుతున్న శక్తులను అడ్డుకోవాలని, హెచ్ఐవీ నియంత్రణపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



గురువారం రాజస్తాన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న యోగితా రాణా

కలెక్టర్ యోగితా రాణాకు అవార్డు

‘బేటీ బచావో... బేటీ పడావో’లో హైదరాబాద్‌కు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: ‘బేటీ బచావో.. బేటీ పడావో’లో హైదరాబాద్ అద్భుత ప్రగతి సాధించినందుకు గాను ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితా రాణా అవార్డు అందుకున్నారు. గురువారం రాజస్తాన్‌లోని జుంజునులో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో యోగితా రాణాకు మోదీ అవార్డును బహూకరించారు. ‘బేటీ బచావో–బేటీ పడావో’లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బాలికా సంరక్షణ, బాలికా విద్యకు విశేష కృషికి గాను ఈ మేరకు ఆమెను సత్కరించారు. ఈ పథకం అమలులో హైదరాబాద్ జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. బాలికల నిష్పత్తి పురోభివృద్ధికి యోగితా రాణా ప్రత్యేక చొరవను ప్రధాని ప్రశంసించారు. ఈ పథకం ప్రారంభం అయిన తరువాత మహా నగరంలో ప్రతి వెయ్యి మంది బాలురకు బాలికల నిష్పత్తి శాతం 914 నుంచి 968కు పెరిగింది. లింగ నిర్ధారణ కట్టడి, బాలికల పట్ల చిన్నచూపు, సెక్స్ డిటర్మినేషన్ టెస్టులు, ఒక మగపిల్లాడు పుడితే రెండో బిడ్డకి నో చెప్పే పద్ధతి లాంటి కార్యక్రమాలతో నగరంలో బాలికల శాతం పెరిగింది.

హజ్ సేవకు దరఖాస్తుల షురూ

ఈ నెల 24 వరకు అవకాశం: షకూర్

సాక్షి, హైదరాబాద్: 2018 హజ్ యాత్రకు వెళ్లే వారికి సేవలు చేయడానికి ప్రభుత్వ ఉద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ఎస్ఎ.షకూర్ తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలోని ఉద్యోగులు హజ్ సేవకులుగా వెళ్లడానికి అర్హులన్నారు. ఉద్యోగి వయస్సు 25–58 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఇంతకు ముందు హజ్ లేదా ఉమ్రా ఆరాధనలు చేసినవారే హజ్ సేవ చేయడానికి అర్హులన్నారు. అలాగే హజ్ ఆరాధనపై అవగాహన ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్నాక ప్రభుత్వ ఉద్యోగి ఐడీ కార్డు, డిపార్ట్‌మెంట్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఇంతకు ముందు హజ్ లేదా ఉమ్రా ఆరాధనలకు వెళ్లి వచ్చినట్లు ప్రూఫ్, పాస్‌పోర్టు జిరాక్స్, మెడికల్ సర్టిఫికెట్ పత్రాలను ఈ నెల 24 లోపు రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో జమచేయాలని తెలిపారు. ఎంపికైన వారి అన్ని ఖర్చులు హజ్ కమిటీ భరిస్తుందని, వారు హజ్ యాత్రకు వెళ్లి వచ్చిన రోజులను ఆన్ డ్యూటీగా పరిగణిస్తామని చెప్పారు.

హెచ్‌సీయూ చెరువులో అరుదైన బ్యాక్టీరియా

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లోని బఫెల్లో చెరువులో అరుదైన బ్యాక్టీరియాను కనుగొన్నారు. రెండేళ్లుగా వర్సిటీలోని ప్లాంట్ సైన్సెస్ ల్యాబ్‌లో ప్లాంట్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ సీహెచ్ వెంకటరమణ చేస్తున్న పరిశోధనల్లో దీనిని కనుగొనడం విశేషం. దీనికి ‘ప్లాంటోఫైరస్’ అని నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. అరుదైన యాంటీ బయాటిక్‌ను ఉత్పత్తి చేసే ఇలాంటి బ్యాక్టీరియాను కనుగొనడం దేశంలోనే మొదటిసారని వెల్లడించారు. ఈ యాంటీ బయాటిక్ ద్వారా ప్లాంటోమైసిటీని ఉత్పత్తి చేసి నూతన ఔషధాల తయారీకి వినియోగించవచ్చని పేర్కొన్నారు. ప్రధానంగా పరిశ్రమల్లోని అమ్మో నియా వ్యర్థాలను శుభ్రం చేయడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. దీనిపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. అరుదైన బ్యాక్టీరియాను వర్సిటీ చెరువులో కనుగొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, దీన్ని పెంచడానికి అవసరమైన ఏర్పాట్లు కూడా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఆరు జిల్లాల్లో 155 మహిళా భవనాలు

రూ.15.50 కోట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 155 మహిళా భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.15.50 కోట్లు కేటాయించారు. కరీంనగర్, వరంగల్ అర్బన్, జగిత్యాల, పెద్దపల్లి, వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో ఈ మహిళా భవనాలను నిర్మించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

సీనియారిటీ తుది జాబితా తర్వాతే పదోన్నతి

అప్పటివరకు శిక్షణ వాయిదా వేసిన పోలీస్ శాఖ

సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ పదోన్నతిపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పదోన్నతికి ముందే ఇచ్చే ముందస్తు శిక్షణను వాయిదా వేస్తున్నట్టు గురువారం ట్రైనింగ్ విభాగం అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లకు తెలిపింది. ఏఆర్ కానిస్టేబుల్ సీనియారిటీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైందని, దానిపై తుది తీర్పు వచ్చే వరకు పదోన్నతి శిక్షణ నిలిపివేస్తున్నట్టు యూనిట్లకు రాసిన మెమోలో పేర్కొంది. ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్ సీనియారిటీపై సైబరాబాద్‌కు చెందిన కొంత మంది కోర్టును ఆశ్రయించారు. సీనియారిటీకి సంబంధించి తుది జాబితా రూపొందించే వరకు తమ యూనిట్‌లో పదోన్నతులు కల్పించవద్దని వారు కోర్టును కోరారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు పోలీస్ శాఖ సమయం తీసుకుంది. దీనిపై పూర్తి స్థాయిలో ఉన్నతాధికారులు శుక్రవారం చర్చించనున్నారు.

హైదరాబాద్‌లో సీ ప్లేన్ ప్రాజెక్టు!

- ప్రధాన రహదారులపై ఎయిర్ అంబులెన్స్‌లు
- సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ వెల్లడి
- వింగ్స్ ఇండియా విమానయాన సదస్సు ప్రారంభం



గురువారం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో జరిగిన ‘వింగ్స్ ఇండియా’ విమానయాన సదస్సులో ప్రదర్శనలను తిలకిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో కేంద్ర విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ నారాయణ్ చౌబే

సాక్షి, హైదరాబాద్: రాజధాని నగరాన్ని ఇతర నగరాలతో అనుసంధానం చేసేందుకు హుస్సేన్‌సాగర్ కేంద్రంగా సీ ప్లేన్ ప్రాజెక్టు నిర్మాణంపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రధాన రహదారులపై ఎయిర్ అంబులెన్స్ సేవలు ప్రవేశపెట్టేందుకు ఉన్న అవకాశాలనూ పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయంలో గురువారం జరిగిన ‘వింగ్స్ ఇండియా’ విమానయాన సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. పారిశ్రామిక విధానంలో ఏరోస్పేస్, రక్షణ రంగాలను అత్యంత ప్రాధాన్య రంగాలుగా గుర్తించామని ఉద్ఘాటించారు. బోయింగ్, ఎయిర్ బస్, జీఈ, సఫ్రాన్, ప్రాట్ అండ్ విట్నీ, సీఎఫ్ఎం, బాంబార్డియర్, పిలాటస్, ఆర్‌యూఏజీ, కోబామ్, హనీవెల్, సాబ్, రాక్‌వెల్ కొల్లిన్స్ వంటి ప్రఖ్యాత ఏరో స్పేస్ కంపెనీలు ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏయిర్ ఇండియా, జీఎంఆర్‌ల ఆధ్వర్యంలో రెండు విమానాల మరమ్మతు, నిర్వహణ కేంద్రాలు ఉన్నాయన్నారు. అగ్రగామి విమాన ఇంజిన్ తయారీ కంపెనీలైన ప్రాట్ అండ్ విట్నీ, సీఎఫ్ఎంలు తమ విమాన ఇంజిన్ల తయారీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నాయన్నారు. ఈ సంస్థలన్నీ రాష్ట్రానికి దేశ ఏరోస్పేస్, విమానయాన రంగ రాజధానిగా గుర్తింపు కలిగించాయన్నారు. ఇక్కడ ప్రధాన విమానయాన కంపెనీలన్ని మరమ్మతు, శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. చాలా పరిశ్రమలకు మెగా పరిశ్రమల హోదా కల్పించి వాటికి అవసరమైన ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు.

అంతర్జాతీయ శిక్షణ

వియానయాన, ఏరో స్పేస్ రంగానికి అత్యున్నత నైపుణ్యం అవసరమని, ఇందుకు వైమానిక ఇంజనీరింగ్ విభాగంలో విదేశీ సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఫ్రెంచ్ ఏరో స్పేస్ అకాడమీ, యూకేకు చెందిన క్రాన్‌ఫీల్డ్ వర్సిటీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. అమెరికాలోని ఎంబ్రీ రిడిల్ వర్సిటీ భాగస్వామ్యంతో టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభించామని చెప్పారు. తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ గత ఐదేళ్లుగా అత్యుత్తమ విమానయాన శిక్షణ సంస్థగా కేంద్రం నుంచి పురస్కారాలు అందుకుందని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ ఏవియేషన్ వర్సిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏవియేషన్ టర్బైన్ ఇంధనంపై వ్యాట్ తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

కొత్త విమానాశ్రయాలు

ఏరో స్పేస్, విమానయాన కేంద్రాల్లో ఒకటిగా రాష్ట్రం ముందుకు వెళ్తోందని కేటీఆర్ తెలిపారు. దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి సాధిస్తున్న విమానాశ్రయాల్లో ఒకటైన రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఏటా 1.8 కోట్ల మంది ప్రయాణికులు, 1.35 లక్షల మెట్రిక్ టన్నుల సరుకుల రవాణా జరుగుతోందన్నారు. ఔషధ పరిశ్రమలు, ఏరో స్పేస్ రంగ విస్తరణలో విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి కార్గో సదుపాయాలతో హైదరాబాద్ విమానాశ్రయం ఫార్మా రంగం కోసం ప్రత్యేక జోన్‌ను కలిగి ఉందన్నారు. రాష్ట్రంలో బేగంపేట, వరంగల్, హకీంపేట, దుండిగల్, నాదర్‌గుల్, రామగుండం విమానాశ్రయాలున్నాయని, వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ హబ్‌ల అవసరాల కోసం అక్కడి విమానాశ్రయాన్ని క్రియాశీలం చేస్తామన్నారు. కొత్తగూడెంలో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంతో ఖమ్మం జిల్లా చుట్టూ ఉన్న బొగ్గు, విద్యుత్ పరిశ్రమలకు అనుసంధానం లభించనుందన్నారు. జక్రాన్‌పల్లిలో ప్రతిపాదించిన విమానాశ్రయం వల్ల హైదరాబాద్ ఫార్మా సిటీకి ప్రయోజనం కలగనుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ నారాయణ్ చౌబే, సంయుక్త కార్యదర్శి ఉషా పాఢీ, ఫిక్కీ ఉపాధ్యక్షుడు సందీప్ సోమనీ పాల్గొన్నారు.

నేటి నుంచి టీఎస్‌సెట్-2017 సర్టిఫికెట్ల జారీ

హైదరాబాద్: టీఎస్‌సెట్–2017లో అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్రవారం నుంచి (9వ తేదీ) నుంచి సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు సెట్ సభ్యకార్యదర్శి ప్రొఫెసర్ యాదగిరిస్వామి గురువారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలోని సెట్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి సర్టిఫికెట్లు పొందవచ్చని వెల్లడించారు.





Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792